www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 22-2-2026 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 347 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి ఉ.11:10 తదుపరి షష్ఠి, నక్షత్రం: అశ్విని సా.5:55 తదుపరి భరణి, వర్జ్యం: మ.2:07-3:38, రా.2:58-4:29, దుర్ముహూర్తం: సా.4:43-5:29, అమృతఘడియలు: ఉ.11:04-12:35, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం:6:41, సూర్యాస్తమయం: 6:15

కాస్త సంస్కారం ఉండాలి!

..తెలుగు రాష్ట్రాలలో, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో సంస్కారం పూర్తిగా కొరవడింది. మంచీ చెడూ అన్న తేడా లేకుండా ప్రతి దాన్నీ రాజకీయం చేస్తూ హద్దూపద్దూ లేని భాషను వినియోగిస్తున్నారు. పార్టీల కోసం పనిచేస్తున్న పేటీయం బ్యాచ్‌లు చెలరేగిపోతున్నాయి.

..బిల్ గేట్స్‌ను విమర్శించిన వైసీపీ గ్యాంగ్‌లో ఎంత మందికి ప్రజా జీవితంలో కొనసాగే నైతికత ఉంది? ఆ పార్టీ అధినేత జగన్ రెడ్డికే ఆ అర్హత లేదు కదా? నెత్తిన డజనుకు పైగా కేసులు మోస్తున్న జగన్ రెడ్డి నీతులు చెబుతుంటే భరిస్తున్నాం కదా!

..ఆంధ్రప్రదేశ్‌కు గానీ, రాష్ట్ర ప్రజలకు గానీ బిల్ గేట్స్ చేసిన అన్యాయం కూడా ఏమీ లేదు. అయినా ఆయనను వైసీపీ గ్యాంగ్ తిట్టిపోయడానికి కారణం ఏమిటి? జగన్ రెడ్డికి బిల్ గేట్స్ రాజకీయ ప్రత్యర్థి కూడా కాదే! అయినా ఆయన వ్యక్తిగత జీవితంపై వచ్చిన ఆరోపణల కారణంగా వైసీపీ రెచ్చిపోయింది. పచ్చి బూతులు తిట్టారు. దీనికి అంతటికీ కారణం బిల్ గేట్స్‌కు విలువలు లేకపోవడం కాదు. ఆయన పర్యటన వల్ల చంద్రబాబుకు ఎక్కడ మంచి పేరు వస్తుందో అన్న కడుపు మంట ప్రధాన కారణం.

..నైతిక విలువలే ప్రాతిపదిక అయిన పక్షంలో మన దేశంలో ప్రజా జీవితంలో కొనసాగే నైతిక అర్హత అతి కొద్ది మందికి మాత్రమే ఉంటుంది. మన దేశంలో ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన ఎంత మందిపై ఆర్థిక నేరాలు, క్రిమినల్ కేసులు నమోదు కాలేదు? అయినా ఏ పట్టింపూ లేకుండా దర్జాగా పదవులు అనుభవిస్తున్నారు కదా?

..ఆంధ్రప్రదేశ్ దశా దిశా మార్చడానికి అందివచ్చిన ఏ అవకాశాన్నీ వదులుకోని చంద్రబాబు, ఈ క్రమంలోనే బిల్ గేట్స్‌ను సాదరంగా ఆహ్వానించి గౌరవ మర్యాదలు కల్పించారు. ఏఐ ఆధారిత వ్యవసాయానికి, డిజిటల్ మ్యాపింగ్‌కు, రియల్ టైం గవర్నెన్స్‌కు సహకారం అందించడానికి బిల్ గేట్స్ వచ్చారు. గేట్స్ ఫౌండేషన్ అందించే సాయానికి, ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధం ఏమిటి? వ్యక్తిగత జీవితాలకు సంబంధించి ఎంత మంది వైసీపీ నేతలు, కూటమి నాయకులపై ఆరోపణలు రాలేదు?



కొత్త పలుకు

ఆర్కే విశ్లేషణ 4లో

లిక్కర్ స్కామ్‌లో ఏ2 అరెస్ట్



వాసుదేవరెడ్డిని కోర్టుకు తీసుకెళుతున్న దృశ్యం

నాటి సీఎం అభీష్టం మేరకే

- బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా వాసుదేవరెడ్డి
- రైల్వేస్ నుంచి డిప్యుటేషన్‌పై ఏపీ సర్వీసుకు
- నాటి సీఎం ప్రిన్సిపల్ అడ్వైజర్ లేఖలే ఆధారం
- పక్కా ప్రణాళిక, ముందస్తు కుట్రతోనే: సిట్
- 3,500 కోట్ల లిక్కర్ కుంభకోణంలో ప్రధాన కుట్రదారు, పాత్రధారి ఆయనే 14
- లిక్కర్ సిండికేట్ ఏర్పాటులో కీలక పాత్ర
- యంత్రాంగాన్ని పణంగా పెట్టి ఆదాయానికి గండి
- సిండికేట్‌కు వేల కోట్ల ముడుపులు
- ఇండెంట్, సరఫరా, అమ్మకాలు అంతా ఆఫ్‌లైన్‌లో
- వాసుదేవరెడ్డి రిమాండ్ రిపోర్టులో కీలకాంశాలు

మరీ ఇంత నీచమా?

తప్పు చేసి మాపై నిందలా?

తిరుమల పవిత్రత దెబ్బతీసే హక్కు వైసీపీ వాళ్లకు ఎవరిచ్చారు?

- చెప్పులేసుకుని స్వామి ఫొటోను సభలోకి తెచ్చి విసిరికొడతారా?
- అధికారంలో ఉన్నా, విపక్షంలో ఉన్నా బూతులు తిడుతున్నారు
- ఆంబోతుల్లా ప్రవర్తిస్తున్నారు
- బూతులు తిట్టేవారికి పరామర్శలు
- వైసీపీ వాహనాల కింద నలిగేవారిని మాత్రం పట్టించుకోరా?
- పల్నాడు జిల్లా వినుకొండ పర్యటనలో సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం
- గ్రామాల్లో 100% చెత్త సేకరణ
- వృత్తాకార ఆర్థిక వ్యవస్థను పునర్నిర్వచిస్తున్నాం: సీఎం

నేను బాంబులకు కూడా భయపడలేదు. 23 క్లైమోర్ మైన్స్ పెడితే వేంకటేశ్వర స్వామి కిందకు దిగి వచ్చి నన్ను కాపాడారు. మా ఇంటి దైవం వేంకటేశ్వరస్వామి. అలాంటి స్వామికి అప చారం తలపెడుతున్నారు. తమ తప్పును వేరే వాళ్లపై వేసే నీచులు వీళ్లు. శివుడి తలపై పాము ఉంటే, అది ఎక్కడ కాటు వేస్తుందోనని అంతా భయపడతారు. నేను మాత్రం శివుడికి నమ స్కారం పెట్టి, ఆ పామును బయటకు తీసుకొచ్చి ఏం చేయాలో అది చేస్తాను.

\- సీఎం చంద్రబాబు



వినుకొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బాలింతతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

గుంటూరు(వినుకొండ), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో నాడు నాసిరకం ప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారని, ఇప్పుడేమో తాము చేసిన తప్పును వైసీపీ నేతలు వేరే వాళ్లపైకి నెట్టేసే నీచానికి పాల్పడుతున్నారని సీఎం చంద్రబాబు ఆగ్రహించారు. వేంకటేశ్వర స్వామిపై భక్తులకు ఉన్న నమ్మకాన్ని,

మిగతా 13వ పేజీలో...



సుంకాలు 15 శాతం

- అదనపు సుంకాల రద్దు నేపథ్యంలో పాత సుంకాలు మరింత పెంచిన ట్రంప్
- అమెరికా వాణిజ్య చట్టంలోని సెక్షన్ 121 ఇచ్చిన వెసులుబాటు పూర్తిగా వినియోగం
- న్యాయ, చట్టపరమైన మార్గాల్లో మరిన్ని టారిఫ్‌లు విధిస్తామని ప్రకటన 12
- వాణిజ్య ఒప్పందంలో 18 శాతంగా ఉన్నా భారత్‌పై ప్రస్తుతానికి 15 శాతమే వసూలు
- ఇప్పటికే వసూలు చేసిన అదనపు సుంకాలను తిరిగి చెల్లించే అంశంలో సందిగ్ధం



14

బుట్టా రేణుకకు షాక్!

- వైసీపీ మాజీ ఎంపీ ఆస్తుల వేలానికి మళ్లీ 'ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్' నోటీస్
- ఆ సంస్థ నుంచి 340 కోట్ల రుణం
- వడ్డీ, అసలు కట్టకపోవడంతో రూ.782 కోట్లకు చేరిన అప్పు
- మార్చి 24న ఆస్తుల ఇ-వేలం

మానవాళికి సమానంగా ఏఐ ఫలాలు!

- ఆ లక్ష్యంగా కొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలి
- 'న్యూఢిల్లీ ఏఐ సదస్సు' ఉమ్మడి ప్రకటన 12
- ఆమోదించిన 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు

స్తంభించిన 'సహకారం'

- పీఏసీఎస్ ఉద్యోగుల నిరవధిక సమ్మె 11
- నిలిచిపోయిన రుణాల రికవరీ
- సొసైటీల్లో లావాదేవీలు, రైతు సేవలకు ఆటంకం

'ఐఎన్‌ఎస్ అరిధమన్' సిద్ధం

సముద్ర పరీక్షలు పూర్తి చేసుకున్న మూడో అణు జలాంతర్గామి

» త్వరలోనే నేవీ అమ్ములపొదిలోకి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మూడో అణు జలాంతర్గామి 'ఐఎన్‌ఎస్ అరిధమన్' త్వరలోనే నౌకాదళం అమ్ములపొదిలో చేరనుంది. మరో రెండు నెలల్లో దీనిని ప్రారంభించి జాతికి అంకితం చేస్తారని విశ్వసనీయంగా తెలిసింది. విశాఖపట్నంలోని నేవీ షిప్ బిల్డింగ్ సెంటర్‌లో అణు జలాంతర్గాముల నిర్మాణం కొనసాగుతోంది. ఏటీవీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెజల్) ప్రాజెక్టు కింద వీటిని నిర్మిస్తున్నారు. మొదట రష్యా సహకారంతో ఐఎన్‌ఎస్ అరిహంత్‌ను నిర్మించి నేవీకి అందించారు. ఇది దశాబ్ద కాలం నుంచి సేవలందిస్తోంది. రెండోదైన ఐఎన్‌ఎస్ అరిఘాత్‌ను 2024 ఆగస్టులో ప్రారంభించారు. అదే సిరీస్‌లో మూడోదైన ఐఎన్‌ఎస్ అరిధమన్ సముద్ర పరీక్షలన్నీ పూర్తి చేసుకొని సేవలకు సిద్ధమైంది. దీనిని ఇంకో రెండు నెలల్లో ప్రారంభించనున్నట్టు నేవీ వర్గాలు పేర్కొన్నాయి. వీటిని స్ట్రాటజిక్ స్ట్రయిక్ న్యూక్లియర్ సబ్‌మెరైన్లు (ఎస్ఎస్‌బీఎన్)గా వ్యవహరిస్తున్నారు.



స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన ఐఎన్‌ఎస్ అరిధమన్ జలాంతర్గామి

ఇవీ ప్రత్యేకతలు..

ఐఎన్‌ఎస్ అరిధిమన్ పొడవు 130 మీటర్లు. బీమ్ వెడల్పు 11 మీటర్లు. డ్రాఫ్ట్ సుమారు 10 మీటర్లు. ఇది సముద్ర ఉపరితలంపై ఉన్నప్పుడు ఆరు వేల టన్నులు, లోపల ఉన్నప్పుడు ఏడు వేల టన్నుల బరువును తరలించగలుగుతుంది. అధికారులు, నావికులు కలిపి 95 నుంచి 100 మంది వరకు ఉంటారు. ఉపరితలంలో గంటకు 12 నుంచి 15 నాటికల్ మైళ్ల వేగంతోను, సముద్రం లోపల గంటకు 24 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణిస్తుంది. అవసరమైనంత ఇంధనం, సిబ్బందికి అవసరమైన ఆహారం సమకూరిస్తే ఎంత దూరమైనా ప్రయాణించే సామర్థ్యం దీనికి ఉంది. దీనికి 83 మెగావాట్ సామర్థ్యం కలిగి నీటి ఒత్తిడితో పనిచేసే సీఎల్‌డబ్ల్యూఆర్-బీ1 రియాక్టర్‌ను అమర్చారు. ఇందులో బాలిస్టిక్ మిస్సైళ్లను నిట్టనిలువుగా ప్రయోగించే ఏర్పాట్లు ఉన్నాయి.

క్యారెట్, బీట్రూట్ ధరలు ఢమాల్

రూ.100కు 3కిలోలు ఇస్తున్న రిటైలర్లు



అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కూరగాయల మార్కెట్లలో డిమాండ్‌గా అమ్ముడయ్యే క్యారెట్, బీట్రూట్ ధరలు పడిపోయాయి. ఒకప్పుడు సెంచరీలు కొట్టిన క్యారెట్, బీట్రూట్ ఇప్పుడు రూ.100కు మూడు కిలోల చొప్పున ఇంటి ముందుకే వస్తున్నాయి. సాధారణంగా కిలో రూ.50నుంచి రూ.80 వరకు పలికే క్యారెట్, బీట్రూట్ ఒక్కోసారి రూ.100కు చేరుతుంటాయి. అలాంటివి గత కొన్ని రోజులుగా మార్కెట్లలో కిలో రూ.40లోపే లభ్యమౌతున్నాయి. రైతుబజార్లలో అయితే కిలో రూ.32కే దొరుకుతున్నాయి. క్యారెట్ పంటను ఏపీ, తెలంగాణతోపాటు హరియాణ, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లో పండిస్తున్నారు. బీట్రూట్ పంట మహారాష్ట్ర, హరియాణ, ఉత్తరప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలో పండిస్తారు. ఈ ఏడాది తమిళనాడు, కర్ణాటకలో క్యారెట్, బీట్రూట్ ఉత్పత్తి గణనీయంగా పెరగడంతో ఏపీకి దిగుమతి పెరిగింది. ఈ కారణంగా ధరలు తగ్గాయని వ్యాపారులు చెబుతున్నారు.

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వరుడు కావలెను



★ ఆర్యవైశ్య 21y & 23y & 25y & 27y & 29y & 31y & 33y & 35y & 37y & 39y & 41y & 43y & 45y & 47y & 49y & 51y & 53y & 55y & 59y బి.సుప్రజాగుప్త "మాసేవ" (Since 1998) : PH: 9291503949 AJH-15820

★ గౌడ / కుల పట్టింపు లేదు /WIDOW / ఫ్యామిలీ పెన్షనర్ / మంచి జీతం / సొంత సూపర్ మార్కెట్ బిజినెస్ / ఒంటరి వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8125076013 AJH-003821

★ 50 సంవత్సరాల వధువుకు టీచర్, గవర్నమెంట్, రెంట్స్, ప్రాపర్టీ, పెన్షనర్ వరుడు కావలెను. అన్ని సంబంధాలు 1వ, 2వ సంబంధాలు కలవు. ప్రేలకు ఫ్రీ సర్వీస్. ఫాస్ట్ సెటిల్మెంట్. ఫోన్ : 6281147818 AJH-003822

★ 40-60-Y / Widow / ఆంధ్ర / తెలంగాణ / Govt. Job / మంచి జీతం / పిల్లలు లేరు / సొంత ఇల్లు / ల్యాండ్స్ / అన్ని కులాల వారికి సంబంధం కుదిరించబడును. అందమైన వధువులకు వరులు కావలెను.ఫోన్ : 7075948409 AJH-003821

★ బ్రాహ్మణ / 28 yrs / 1st మ్యారేజ్ / Qua: Inter, Pvt. Job / Father పౌరోహిత్యం / Mother Teacher / బ్రాహ్మణ వరుడు కావలెను. ఫోన్ : 9347422789 AJH-003821

★ కుల పట్టింపు లేదు / 40y Widow/ ఆంధ్ర / పిల్లలు లేరు / సొంత ఇల్లు / పొలాలు / ఓన్ షోరూమ్ బిజినెస్ / చదువు ప్రసక్తి లేదు / అందమైన వధువుకు వరుడు కావలెను. (డైరెక్ట్ మీటింగ్ పెట్టబడును). (Hyd Ok.) ఫోన్ : 9989350417 AJH-003821

★ 60y / రెండవ పెళ్ళి / విడో /ఫెయిర్ /GOVT ఫ్యామిలీ పెన్షనర్ / పిల్లలు లేరు /సొంత ఇల్లు రెంట్స్ / ఎలాంటి బాదరాబందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్ : 7995376608 AJH-15820

★ రజక / B.Tech (సివిల్) / Govt. Asst. ఇంజనీర్ / RWS / మంచి జీతము / 5'5" ఎత్తు / 25 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9550166072 AJH-15819

★ రెడ్డి / 2ND మ్యారేజ్ / కుల, ఆస్తి పట్టింపు లేదు / 45 yrs / డిగ్రీ / బిజినెస్ & స్థిర ఆస్తి గల వధువుకి వరుడు కావలెను. 1st & 2nd అన్ని వయస్సుల వారికి సంబంధాలు మా వద్ద కలవు. ఫోన్ : 9063623252 AJH-15819

★ రెడ్డి / 2ND (కుల-ఆస్తి) పట్టింపు లేదు / Age:32, Q:Pharmacy / Own Business & Property's గల వధువుకి వరుడు కావలెను. అన్ని వయస్సుల వారికి 1వ/2వ సంబంధాలు కలవు. ఫోన్ : 9100502526 AJH-15819

★ 63y / రెండవ పెళ్లి / విడో / ఫెయిర్ / Govt. ఫ్యామిలీ పెన్షనర్ / పిల్లలు లేరు / సొంత ఇల్లు రెంట్స్ / ఎలాంటి బాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్: 9030858258 AJH-15820

★ రెడ్డి, (పెపుకంటి, మోటాటి, పాకనాటి). మొదటి సంబంధం, 26 సం.రాలు to 30 సం.రాలు. ఆంధ్ర, తెలంగాణ అమ్మాయిలకు Job లేదా బిజినెస్ వరులు కావలెను. ఫోన్ : 7842269654 AJH-003675

★ భట్‌రాజులు, సూర్యవంశరాజులు, చంద్రవంశ రాజులు, క్షత్రియులు. 1st మ్యారేజ్ - 25 to 32 సం.రాలు. డిగ్రీ to B.Tech అమ్మాయిలకి AP, TS లో వరులు కావలెను. ఫోన్ : 7842269654 AJH-003675

★ కన్వర్టెడ్ క్రిస్టియన్, గుంటూరు, రాజమండ్రి, చీరాల, బాపట్ల, విజయనగరం, నంద్యాల, ప్రొద్దుటూరు, కరీంనగర్, Hyd లో 25 to 35 సం.రాల వారికి వరులు కావలెను. ఫోన్ : 7842269654 AJH-003675

★ మున్నూరుకాపు, గౌడ్స్, 26 సం.రాలు, 27,28, 30 సం.రాలు, డిగ్రీ, ప్రైవేట్ జాబ్, సొంత ఇల్లు, ఉన్న అమ్మాయిలకి ఆంధ్ర, తెలంగాణ, సాంప్రదాయ కుటుంబ వరులు కావలెను. ఫోన్ : 7842269654 AJH-003675

★ చౌదరి (కమ్మ), కాపు, 1st మ్యారేజ్ / 26 సం.రాలు / డిగ్రీ, సొంత ఇల్లు, అలాగే 27 సం.రాలు. B.Tech, Job, సొంత ఇల్లు ఉన్న అమ్మాయికి వరుడు కావలెను. ఫోన్ : 7842269654 AJH-003674

★ దేవాంగ, పద్మశాలి, పట్టుశాలి, 10th 26 సం.రాలు, డిగ్రీ 27 సం.లు, ఇంటర్ - 25 సం.లు ఉన్న అమ్మాయిలకి బిజినెస్ లేదా జాబ్ ఉన్న వరులు కావలెను. ఫోన్ : 7842269654 AJH-003674

★ రజక (చాకలి), యాదవ్స్ (గొల్ల), మొదటి సంబంధం. 25 to 30 సం.లు, 10th, ఇంటర్, సొంత ఇల్లు టైలరింగ్ ఉన్న అమ్మాయిలకి వరులు కావలెను. ఫోన్ : 7842269654 AJH-003674

★ అచారులు, విశ్వబ్రాహ్మిన్స్, కంసాలి, గోల్డ్‌స్మిత్, ఇంటర్ - 26 సం.లు, 27 సం.లు, 30 సం.లు ఉన్న అమ్మాయిలకు సాంప్రదాయ కుటుంబ వరులు కావలెను. ఫోన్ : 7842269654 AJH-003674

వధువు కావలెను



★ 38 సం.గల బిజినెస్ చేసే వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు. కుల ప్రసక్తి లేదు. నో డోరి. ఫోన్: 8008440189, 6301943220 AJH-15820

★ Healthy, Senior Faculty (FC, 64 Widower) From Nellore Needs Educated Well Settled Healthy Life Partner - 8332070712 AJH-15820

★ తెలుగు, దేవాంగ, A.P. వరుడికి (కుల పట్టింపు లేదు) 41y, 5'5", ఫెయిర్ / M.Tech, MCA, IRPM, Govt. Job. 4 Cr. వధువు కావలెను.(డైరెక్ట్) ఫోన్: 7036361292 AJH-15820

★ SC మాల / కట్న ప్రసక్తి లేదు / BE / Govt. ఇంజనీర్ / AEE / R&B Dept. / మంచి జీతం / 5'8" ఎత్తు / 31 సం.ల వరుడికి వధువు కావలెను. ఫోన్: 8897389698 AJH-15819

★ 2వ పెళ్ళి / పిల్లలు లేరు / M.Com, MBA, CA / Govt. అకౌంటెంట్ ఆఫీసర్ / మంచి జీతము / 5'9" ఎత్తు / 35 సం.ల వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 9963757612 AJH-15819

★ SC హిందు మాల / M.Tech, IIT / C. Govt. Asst. Exq ఇంజనీర్ / NTPC / మంచి జీతం / 6' ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 9908222406 AJH-15819

★ SC హిందు మాదిగ / కట్న ప్రసక్తి లేదు/ M.Tech, / C. Govt. Asst. ఇంజనీర్ / IOCL / మంచి జీతం / 5'11" ఎత్తు / 30 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 6305007091 AJH-15819

★ గౌడ /M.Tech, NIT / Govt. గజిటెడ్ ఆఫీసర్ /ఇరిగేషన్ Dept / మంచి జీతం / 6' ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 9550166072 AJH-15819

★ మాల క్రిస్టియన్, వయస్సు 43 సం॥ ఎత్తు 5/7, ఎడ్యుకేషన్ M.A.,M.PED, D.Ed. ఏలూరు స్కూల్‌లో ఉద్యోగం. నెలకి 35,000/- జీతం, తూర్పుగోదావరి జిల్లా వరుడికి JOB చేసే వధువు కావలెను. కాంటాక్ట్: 7794911019. AJD:244577

కళ్యాణ వేదిక

★ వడ్లమూడి (V) మ్యారేజ్ బ్యూరో నందు అన్ని కులముల వారికి పెండ్లి సంబంధములు చూడబడును. ఫోన్ నం.లు: 9666227979, 7569347979, 6303837979 AJH-003822

★ సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్మెంట్ చేయబడును. సంప్ర: 8688006130 AJH-15820

★ ఆర్య వైశ్య - బ్రాహ్మణ - OC లో అందమైన కులం, కట్నం వద్దు. అమ్మాయి బాగుంటే పెళ్ళి చేసుకుంటారు. కొన్ని వేల ప్రొఫైల్స్ వ్యాపారం - ఉద్యోగం - సొంత ఇల్లు - ఆదాయం (Only ప్రొఫైల్, ఫోటో వాట్సాప్ - 8332000801 AJH-15820

★ ఆంధ్ర, తెలంగాణ రజక వివాహ పరిచయ వేదిక 22/03/2026 రజక సంఘం కమ్యూనిటీ హాల్, ముసారాంబాగ్, హైదరాబాద్. ముందుగా ఫోన్ చేసి మీరు పేరు నమోదు చేసుకోగలరు. 7660803720 / 9515607936 AJH-003822

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు.కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగినసంబంధాన్ని నిర్ణయించుకోండి.

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.

9985921386
9703618806
9985921380

★ కమ్మ (INDIA): 24 / 5'3" / V.FAIR / MBA(US) / BUSINESS / 1000 Cr. / Seeks Well Settled Business Boy Ph: 8143538383

★ కమ్మ (INDIA): 23 / 5'8" / Beautiful / IIT / 30L PA / 100 Cr. / Seeks well settled job / Business Groom Ph: 8143538383

★ కమ్మ (INDIA): 22 / V.FAIR / BE / 40L PA / 50 Cr / Hyd / Seeks Job / Business Boy From Hyd Based Ph: 8143538383

★ కమ్మ (INDIA): 23 / 5'3" / V.FAIR / MBA / BUSINESS / 300 Cr. / Seeks well settled CIVILS / BUSINESS GROOM Ph: 8143538383

★ కమ్మ (INDIA): 24 / 5'4" / Beautiful /MBBS / BUSINESS / HYD / 200 Cr. Seeks Doctor(or) Business Boy. Ph: 8143538383

★ కమ్మ (INDIA): 24 / 5'5" / V.FAIR / CA / 24L PA / HYD 75 Cr. / Seeks CA, IIT, IIM, GROOM Ph: 8143538383

★ కమ్మ (INDIA): 24 / 5'7" / V.FAIR / MBA(IIM) / 50L PA / HYD 50 Cr. వధువుకు IIT, IIM, Bits (or) BUSINESS Boy కావలెను. Ph: 8143538383

★ కమ్మ (INDIA): 25 / 5'3" / Beautiful / MS / Family Business / Only Daughter / 100 Cr. వధువుకు Business వరుడు కావలెను. Ph: 8143538383

★ కమ్మ (Doctor): 25 / 5'5" / V.FAIR / M.D.(Radiology) 100 Cr / Seeks Merit Doctor / Business Groom

★ కమ్మ (Doctor): 25 / 5'6" / V.FAIR / MS(Gynic) / 50 Cr / Hyd / 26 / 5'5" / V.FAIR / MD (GM) 60 Cr / Hyd Ph: 8143538383

దివ్యాంగుల హక్కులపై అవగాహన సదస్సు


జస్టిస్ రవినాథ్ తిల్హారి

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కాజ వద్ద గల ఏపీ జ్యుడీషియల్ అకాడమీలో శనివారం దివ్యాంగుల హక్కులకు సంబంధించిన అంశాలపై న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఏపీ హైకోర్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సును ఏపీ జ్యుడీషియల్ అకాడమీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ అధ్యక్షుడు జస్టిస్ రవినాథ్ తిల్హారి ప్రారంభించి విలువైన సూచనలు అందించారు. డబ్ల్యూడీఏటీ, ఎస్సీ విభాగం మాజీ డైరెక్టర్ బీడీవీ ప్రసాద మూర్తి, డాక్టర్ ఎన్.జేసురత్న కుమార్ సెన్సిటైజేషన్, యాక్సెసిబిలిటీ, సమగ్ర విద్య, న్యాయ నిర్ణయాలలో ఉత్తమ పద్ధతులు, దివ్యాంగుల హక్కుల చట్టం-2016పై అవగాహన కల్పించారు. సదస్సులో ఏపీజేఏ డైరెక్టర్ సి.పురుషోత్తమ కుమార్ చింతలపూడి, అదనపు డైరెక్టర్ ఎల్.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.11.54 కోట్ల జీఎస్టీ మోసం

- విశాఖ వ్యాపారి అరెస్టు

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తప్పుడు ఇన్వాయిస్ పత్రాల ద్వారా రూ.11.54 కోట్ల జీఎస్టీ ఇన్‌పుట్ క్రెడిట్ పొందిన విశాఖ వ్యాపారిని సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విశాఖకు చెందిన ఓ వ్యాపారి రూ.81.25 కోట్ల విలువైన తప్పుడు ఇన్వాయిస్‌లు సృష్టించి రూ.11.54 కోట్ల ఇన్‌పుట్ క్రెడిట్ క్లెయిమ్ చేశాడు. దీనిని సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ అధికారులు గుర్తించి కేసు నమోదుచేశారు. విశాఖలోని ఆర్థిక నేరాల న్యాయస్థానం నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించింది.

టికెట్ ఉన్నా దర్శనానికి పంపట్లేదు!

- 3 గంటలకు దర్శన సమయం.. వచ్చాక 10 గంటలకు రమ్మంటున్నారు
- సోషల్ మీడియాలో శ్రీవారి భక్తుడి ఆవేదన

తిరుమల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తమకు జారీ చేసిన టికెట్‌పై వేకువజామున మూడు గంటలకు శ్రీవారి దర్శనమని ముద్రించి, తీరా వచ్చాక ఇప్పుడు కాదు ఉదయం 10 గంటలకు దర్శనానికి రమ్మన్నారంటూ ఓ భక్తుడు మాట్లాడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఓ కుటుంబం శుక్రవారం వేకువజామున మూడు గంటల సమయానికి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు పొందింది. దర్శనం కోసం క్యూలైన్‌లోకి వస్తే తమను అనుమతించలేదంటూ ఓ యువకుడు టీటీడీని ప్రశ్నిస్తూ సెల్ఫీ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఈ అంశం చర్చనీయాశంగా మారింది. 'దర్శనం మూడు గంటలకు అని ఇచ్చారు. 2.30 గంటలకు కుటుంబ సభ్యులు, చంటి బిడ్డతో వైకుంఠం క్యూకాంప్లెక్స్ దగ్గరికి వస్తే తిరిగి ఉదయం 10 గంటలకు రమ్మని చెప్తున్నారు. ఈ చలిలో ఎక్కడికి వెళ్లాలి. సింపుల్‌గా ప్రింటింగ్ మిస్టేక్ అని చెప్తున్నారు. దీనికెవరు బాధ్యులు' అంటూ వీడియోలో ఆ భక్తుడు ప్రశ్నించాడు.

విద్యార్థి సంఘాల ఆందోళనలు

- స్వయంగా రంగంలోకి దిగిన పోలీస్ కమిషనర్
- స్టూడెంట్ లీడర్లతో అధికారుల సమావేశం
- నాన్ బోర్డర్లు క్యాంపస్‌లో ఉంటే చర్యలంటూ హెచ్చరిక
- మార్చి 2 వరకూ ధర్నాలు, నిరసనలపై ఆంక్షలు

ఏయూలో మళ్లీ రగడ


ఏబీవీపీ నాయకులు క్యాంపస్‌లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘాల మధ్య మళ్లీ రగడ చోటు చేసుకుంది. ఎన్నడూ లేని విధంగా సంఘాలు పరస్పరం దాడులకు దిగుతున్నాయి. ఇది శాంతి భద్రతల సమస్యగా పరిణమించింది. ఏబీవీపీ విద్యార్థులు శనివారం వందల సంఖ్యలో క్యాంపస్‌లోకి ప్రవేశించి జెండాలు ఎగురవేసే స్తంభాలను విరిచేశారు. ఒకేసారి ఎక్కువ మంది రావడం, పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో స్వయంగా సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. కొందరిని వ్యాన్లలో ఎక్కించి బయటకు తరలించారు. క్యాంపస్‌కు సంబంధం లేనివారు ఈ ఆందోళనలో పాల్గొన్నట్టు తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆధారాలు సమర్పించండి...

ఈ ఘర్షణలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని జిల్లా అధికార యంత్రాంగం శాంతి కమిటీని ఏర్పాటు చేసింది. ఏయూ వీసీ ప్రొఫెసర్ జీసీ రాజశేఖర్ అధ్యక్షతన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు, ఆర్‌డీఓ సుధాసాగర్, విశాఖ ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి కలిసి విద్యార్థి సంఘాల నాయకులతో శనివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. రెండు గంటలసేపు సాగిన సమావేశంలో ఇరువర్గాల ఆరోపణలు, వాదనలు విన్నారు. వివాదానికి సంబంధించిన ఎవరి దగ్గర ఏయే ఆధారాలు ఉన్నాయో వీడియోలు, ఫొటోలు సోమవారం మధ్యాహ్నానికి సమర్పించాలని సూచించారు. వాటి ఆధారంగా మార్చి రెండో తేదీన మరోసారి సమావేశం నిర్వహించి, తుది నిర్ణయం వెల్లడిస్తామన్నారు. దీనికి అన్ని విద్యార్థి సంఘాలు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. అంతవరకు క్యాంపస్‌లో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించకూడదని ఆంక్షలు విధించారు. విద్యార్థులు కెరియర్‌పై దృష్టి సారించాలని, వివాదాల్లో తలదూర్చవద్దని సూచించారు. నాన్ బోర్డర్లకు క్యాంపస్‌లో స్థానం కల్పించవద్దని స్పష్టం చేశారు. అలా ఎవరైనా చేస్తే ఆ విద్యార్థులపైనా చర్యలు చేపడతామన్నారు.


క్యాంపస్‌లో జెండా స్తంభాలను తొలగిస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

గొడవకు కారణం ఇదీ....

ఏబీవీపీ విద్యార్థులు కొద్దిరోజుల క్రితం క్యాంపస్‌లోని బాస్కెట్‌బాల్ మైదానంలో ఆర్ఎస్ఎస్ శాఖ కార్యక్రమం నిర్వహించారు. ఈ విషయం తెలిసి ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ప్రతినిధులు అక్కడకు వెళ్లి ఘర్షణ పడ్డారు. దాడి చేశారని ఏబీవీపీ ఆరోపిస్తోంది. దీనిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పందించారు. ఈ నేపథ్యంలో గత నాలుగు రోజులుగా క్యాంపస్‌లో ఆందోళనలు, ధర్నాలు జరుగుతున్నాయి. పోలీసులు సర్దిచెప్పి పంపుతున్నారు. తాజాగా శనివారం ఉదయం పెద్ద సంఖ్యలో ఏబీవీపీ ప్రతినిధులు వచ్చారు. పరిస్థితి చేయి దాటిపోయేటట్టు ఉందని పోలీసు కమిషనర్ స్వయంగా రంగంలోకి దిగారు.

ఎవరు చెబితే కిడ్నాప్ చేశారు?

పోలీస్ కస్టడీలో ఎంబీయూ పీఆర్వో, మరో ఇద్దరికి ప్రశ్నలు

- తిరుపతి కోర్టు అనుమతితో ఐదు రోజుల పోలీస్ కస్టడీకి

తిరుచానూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి నేతల కిడ్నాప్ కేసులో మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ) పీఆర్వో సతీశ్ (ఏ1), క్రమశిక్షణ విభాగం ఇన్‌చార్జి మునిచంద్ర (ఏ12), వాహనాల ఇన్‌చార్జి వాసు(ఏ17)ను ఐదు రోజుల పోలీసు కస్టడీకి ఇస్తూ తిరుపతి న్యాయస్థానం శనివారం ఉత్తరులిచ్చింది. ఆమేరకు ఈ ముగ్గురినీ ఏఎస్పీ రవిమనోహరాచారి ఆధ్వర్యంలో చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, సీఐ సునీల్‌కుమార్ బృందం కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. ధర్నా చేయడానికి వెళుతున్న విద్యార్థి సంఘం నేతలను ఎందుకు కిడ్నాప్ చేశారు? ఎవరుచెబితే ఈ పనిచేశారు? అసలు మీ ఉద్దేశం ఏమిటి..? అనే ప్రశ్నలు వేసి నిందితుల నుంచి సమాధానాలు రాబట్టినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. ఇదే కేసులో ఏ3గా ఉన్న మంచు విష్ణుకు నోటీసులు ఇచ్చినా.. ఇంతవరకు విచారణకు హాజరు కాలేదని సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. తిరుపతి కలెక్టరేట్ వద్ద ధర్నా చేయడానికి వెళుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అలీ అక్బర్, ఉపాధ్యక్షుడు వినోద్‌ను తిరుచానూరు వద్ద కిడ్నాప్ చేసిన వ్యవహారంలో ఎంబీయూ పీఆర్వో సతీశ్, మోహన్‌బాబు, మంచు విష్ణుతో పాటు మరో 20మందిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. కాగా, ఏ2 మోహన్‌బాబుకు అరెస్టు నుంచి రక్షణ కల్పించేందుకు ఈ నెల 17న జరిగిన విచారణలో హైకోర్టు నిరాకరించింది. తదుపరి విచారణ మార్చి 3న జరగనుంది.


కర్నూలులో కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీని చింపివేస్తున్న బీజేవైఎం నాయకులు


కర్నూలులో కాంగ్రెస్ కార్యాలయంపైకి టమోటాలు విసురుతున్న దృశ్యం

భారత్ పరువు తీసేలా కాంగ్రెస్ తీరు

ఢిల్లీ ఏఐ సదస్సులో నిరసనలు చేయడంపై బీజేపీ ఆగ్రహం

- రాష్ట్రంలోని పలుచోట్ల కాంగ్రెస్ కార్యాలయాలపై దాడులు
- కోడిగుడ్లు, టమోటాలు విసిరిన బీజేపీ, బీజేవైఎం నాయకులు
- రాహుల్ దిష్టిబొమ్మ, కాంగ్రెస్ ఫ్లెక్సీలు, జెండాలు దహనం

కర్నూలు అర్బన్/గుంటూరు/విజయనగరం క్రైం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూత్ కాంగ్రెస్ నాయకులు నిరసనలు చేపట్టడంపై బీజేపీ మండిపడింది. ప్రపంచ దేశాల ప్రతినిధుల ఎదుట భారత్ పరువు తీసేలా కాంగ్రెస్ వ్యవహరించటం సిగ్గు సిగ్గు.. అంటూ నినాదాలు చేస్తూ రాష్ట్రంలోని పలు చోట్ల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలపై బీజేపీ, బీజేవైఎం, వీహెచ్‌పీ నాయకులు, కార్యకర్తలు దాడి చేశారు. కోడిగుడ్లు, టమోటాలు, రాళ్లు విసిరి ఆందోళనలు చేశారు. కర్నూలులోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి మాట్లాడుతూ పెట్టుబడుల కోసం ప్రధాని మోదీ ఢిల్లీలో సమ్మిట్ చేస్తే.. కాంగ్రెస్ శ్రేణులు అరాచకం సృష్టించారని మండిపడ్డారు. దేశాభివృద్ధిని అడ్డుకుంటే కాంగ్రెస్ నాయకుల ఇళ్లపై దాడులకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. పార్టీ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఆందోళనకారులు చింపివేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

గుంటూరులో ఉద్రిక్తత

బీజేవైఎం కార్యకర్తలు కొందరు గుంటూరులో కాంగ్రెస్ కార్యాలయంపై కోడిగుడ్లు, రాళ్లతో దాడి చేయడం ఉద్రిక్తతకు దారితీసింది. కాంగ్రెస్ కార్యాలయంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేవైఎం కార్యకర్తలపైకి దూసుకెళ్లే ప్రయత్నం చేయటంతో పోలీసులు అడ్డుకున్నారు. బీజేవైఎం కార్యకర్తలు అక్కడున్న కాంగ్రెస్ ఫ్లెక్సీలను చించి, కాల్చివేసి నిరసన తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యేలు షేక్ మస్తాన్‌వలి, లింగంశెట్టి ఈశ్వరరావు ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసి కాంగ్రెస్ కార్యాలయంపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

విజయనగరంలో 20 మందిపై కేసు నమోదు

విజయనగరంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఆ పార్టీ జెండాలను, ఫ్లెక్సీలను బీజేపీ కార్యకర్తలు ధ్వంసం చేసి, దహనం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ మాట్లాడుతూ ఏఐ సమ్మిట్‌లోకి కాంగ్రెస్ యూత్ నాయకులు ఉగ్రవాదుల్లా ప్రవేశించి నిరసన తెలియజేయడం తగదన్నారు. 20 మంది బీజేపీ నాయకులపై కేసు నమోదు చేసినట్టు సీఐ ఆర్‌వీఆర్‌కె చౌదరి తెలిపారు.

ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ తీరు దురదృష్టకరం: లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ సృష్టించిన ఆటంకాలపై మంత్రి నారా లోకేశ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచ ఏఐ సూపర్ పవర్‌గా సత్తా చాటేందుకు భారతదేశం ఏర్పరుచుకున్న అంతర్జాతీయ వేదికపై యూత్ కాంగ్రెస్ నాయకులు వ్యవహరించిన తీరు తనను తీవ్రంగా నిరుత్సాహపరిచిందని లోకేశ్ పేర్కొన్నారు. 'ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ వేదికను రాజకీయ డ్రామాకు వేదికగా మార్చేందుకు ప్రయత్నించడం దురదృష్టకరం. వినూత్న ఆవిష్కరణలతో దేశాన్ని ప్రపంచ యవనికపై నిలబెట్టేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దాం' అని లోకేశ్ పిలుపునిచ్చారు.

మోదీ పాలనలోనే దళిత సంక్షేమం: మాధవ్

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ పాలనలోనే దళిత సంక్షేమానికి పెద్దపీట పడింది. రామ్‌నాథ్ కోవింద్, ద్రౌపదీ ముర్ము లాంటి వారిని దేశ అత్యున్నత పదవుల్లో కూర్చోబెట్టారు' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఏపీ బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర పదాధికారుల సమావేశం విజయవాడలో ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పనతల సురేశ్ నేతృత్వంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాధవ్ మాట్లాడుతూ... 'కాంగ్రెస్ పార్టీ దళితుల్ని ఓటు బ్యాంకుగానే చూసింది. నరేంద్ర మోదీ దళిత, గిరిజనుల సంక్షేమంతో పాటు కేంద్ర మంత్రి వర్గంలో వారికి పెద్ద పీట వేశారు' అని అన్నారు. ఎస్సీ మోర్చా జాతీ య అధ్యక్షుడు లాల్ సింగ్ ఆర్య మాట్లాడుతూ... 'నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉన్నంత వరకూ రిజర్వేషన్లకు ఎలాంటి ముప్పు లేదు. రాహుల్ గాంధీ విదేశాల్లో భారత పరువు తీసేందుకు ప్రయత్నిస్తే యువజన కాంగ్రెస్ ఢిల్లీలో అంతర్జాతీయ ఏఐ సదస్సు జరిగే సమయంలో అదే చర్యకు పాల్పడటం హేయం' అని మండిపడ్డారు.



వీధి కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని నల్లచెరువు ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంటకు (శనివారం తెల్లవారుజామున) ఫణీంద్ర రెడ్డి అనే ఆరేళ్ల బాలుడిపై వీధి కుక్కలు గుంపుగా దాడి చేశాయి. బాలుడి తల, మెడ భాగాల్లో లోతైన గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన బాలుడిని ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. వీధి కుక్కలు బాలుడిపై దాడి చేసిన విషయం తెలియడంతో శుక్రవారం అర్ధరాత్రి ఒకటిన్నర ప్రాంతంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ ప్రభుత్వాస్పత్రికి వచ్చి అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.


గుండె మార్పిడి శస్త్రచికిత్సను నిర్వహించిన మణిపాల్ ఆసుపత్రి వైద్యులు

మణిపాల్‌లో తొలి గుండె మార్పిడి శస్త్ర చికిత్స

- సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సహకారం

కృష్ణలంక, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మణిపాల్ ఆసుపత్రి వైద్యులు తొలి గుండె మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. సీఎం సహాయ నిధి సహకారంతో నిర్వహించిన ఈ అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స వివరాలను శనివారం మీడియాకు తెలిపారు. విజయనగరం జిల్లాకు చెందిన కె.సత్యవతి కొన్ని సంవత్సరాలుగా డైలేటెడ్ కార్డియోమయోపతి అనే తీవ్ర గుండె సమస్యతో బాధపడుతున్నారు. ఆమెకు రైట్ హార్ట్ క్యాథెటరైజేషన్‌తో పాటు, గుండె మార్పిడికి అర్హతను నిర్ధారించే పూర్తిస్థాయి ట్రాన్స్‌ప్లాంట్ వర్కప్ నిర్వహించారు. ఈ ఇవాల్యుయేషన్ తరువాత ఆమెను జీవన్‌దాన్ అవయవ మార్పిడి పథకం కింద ట్రాన్స్‌ప్లాంట్ జాబితాలో చేర్చారు. అసుపత్రిలోనే ఆమెకు సరిపోయే దాత గుండె అందుబాటులోకి రావడంతో మణిపాల్ ఫౌండేషన్, ముఖ్యమంత్రి సహాయనిధి సహకారంతో గుండె మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు దిలీప్ రత్తి, వరుణ్ పామిడి, శంకరరావు, అనిల్‌కుమార్, ఏవీఎస్ఎస్ శ్రీధర్, ఎన్.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నాదనీరాజనం వేదికపై కావ్య నృత్య ప్రదర్శన

శ్రీవారికి నాసా శాస్త్రవేత్త నృత్యార్చన

తిరుమల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నాసా స్పేస్ సెంటర్‌లో సైంటిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కావ్య కె మన్యపు తిరుమలేశుడికి నృత్యార్చన సమర్పించారు. తిరుమలలోని శ్రీవారి ఆలయం ముందున్న నాదనీరాజనం వేదికపై తన బృందంతో కలిసి శనివారం అద్భుత భరత నాట్య ప్రదర్శన ఇచ్చి ప్రేక్షకుల మనసు దోచారు. హైదరాబాద్‌కు చెందిన కావ్య అమెరికాలో నివాసముంటూ నాసాలో శాస్త్రవేత్తగా పని చేస్తున్నారు.

పీఏసీఎస్ ఉద్యోగుల వేతన సవరణకు చర్యలు తీసుకోండి: సీపీఐ

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) ఉద్యోగుల వేతన సవరణకు వెంటనే చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

కొత్తపలుకు

▪ఆర్కే RK

కాస్త సంస్కారం ఉండాలి!



ట్రిపుల్ ఎక్స్ సబ్బు పేరు గుర్తుందా? దుస్తులు ఉతకడానికి వాడే ఈ సబ్బు ఉత్పత్తిదారులు తమ ట్యాగ్ లైన్‌గా సంస్కారవంతమైన సబ్బు అని పెట్టుకున్నారు. ఉత్పత్తిదారులు ఈ ట్యాగ్ లైన్ ఎందుకు పెట్టుకున్నారో తెలియదు గానీ, తెలుగునాట రాజకీయాలను ఈ ట్రిపుల్ ఎక్స్ సబ్బుతో ఉతికితే సంస్కారం వస్తుందేమో అన్న ఆశ కలుగుతోంది. తెలుగు రాష్ట్రాలలో, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో సంస్కారం పూర్తిగా కొరవడింది. మంచీ చెడూ అన్న తేడా లేకుండా ప్రతి దాన్నీ రాజకీయం చేస్తూ హద్దూపద్దూ లేని భాషను వినియోగిస్తున్నారు. రాజకీయ పార్టీల కోసం పనిచేస్తున్న పేటీయం బ్యాచ్‌లు చెలరేగిపోతున్నాయి. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఆంధ్రప్రదేశ్ పర్యటన సందర్భంగా, వైసీపీకి అనుబంధంగా పనిచేస్తున్న సోషల్ మీడియాతో పాటు పేటీఎం బ్యాచ్‌తో సృష్టించిన రచ్చ ఇందుకు నిదర్శనం. ప్రస్తుతం మన తెలుగువాడైన సత్య నాదెళ్ల సీఈవోగా పనిచేస్తున్న మైక్రోసాఫ్ట్‌ను బిల్ గేట్స్ ప్రారంభించారు. మూడు దశాబ్దాల క్రితం బిల్ గేట్స్‌ను

> **లోకేశ్ ఇటీవలి కాలంలో దుబాయ్, ముంబై, కొలంబోలో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లకు వెళ్లారు. ఇలా వెళ్లడం వల్ల జరిగిన నష్టం కంటే ఎంపీ సానా సతీశ్ ఆయన పక్కన ఉండటం వల్ల ఎక్కువ నష్టం జరిగింది. ఎవరైనా జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే వ్యక్తిగత సరదాలు, అలవాట్లను వదులుకోవాలి. చంద్రబాబు వ్యక్తిగత సరదాలు, విలాసాలు అన్నింటినీ వదులుకున్నారు. లోకేశ్ కూడా రాజకీయాలలో మరింత ప్రజాదరణ చూరగొనాలనుకుంటే తండ్రిని ఆదర్శంగా తీసుకోవాలి. చంద్రబాబు తదనంతరం తెలుగుదేశం పార్టీకి నాయకత్వం వహించాలనుకుంటున్న వ్యక్తిగా లోకేశ్ కొన్ని సరదాలను వదులుకోవాల్సిందే.**

కలుసుకోవడం మన రాజకీయ నాయకులు మహదవకాశంగా భావించేవారు. 1998లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు అమెరికా పర్యటనలో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్‌ను కలవడానికి అష్టకష్టాలు పడ్డారు. మొత్తానికి ఆ సంస్థను ఎలాగోలా ఒప్పించి మైక్రోసాఫ్ట్‌ను హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. అప్పట్లో ఢిల్లీ వచ్చిన బిల్ గేట్స్‌ను కలవడానికి చంద్రబాబు కష్టపడాల్సి వచ్చింది. ఆ తర్వాత క్రమంలో వయోభారం కారణంగా బిల్ గేట్స్ మైక్రోసాఫ్ట్ నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. ఈ సంస్థ నాది, నా వారసులే దాన్ని నడుపుతారు అని మన దేశంలో లాగా ఆయన భావించలేదు. తన శేష జీవితాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగించాలని నిర్ణయించుకున్నారు. బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ ఏర్పాటుచేసి విద్య, వైద్య, వ్యవసాయ రంగాలలో సేవలు అందించడం ప్రారంభించారు. వారెన్ బఫెట్‌తో కలసి ఫౌండేషన్‌కు తొమ్మిది లక్షల కోట్ల రూపాయలు దానం చేశారు. ఇందులో ఆరు లక్షల కోట్లు బిల్ గేట్స్ వ్యక్తిగత సంపదే. ఆయన ఇప్పుడు వ్యాపారవేత్త కాదు, కేవలం సంఘ సేవకుడిగానే వ్యవహరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా వైద్య రంగంలో సేవలు అందించాలన్న బృహత్తర ఆశయంతో సొంత ఆస్తిని వితరణ చేసిన బిల్ గేట్స్‌ను గౌరవించాలా? వద్దా? మన దేశంలో కూడా ఇప్పుడిప్పుడే అపర కుబేరులు కొందరు ట్రస్ట్‌లు ఏర్పాటు చేసి తమ సంపదలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. బిల్ గేట్స్ వంటి వారే వీరికి స్ఫూర్తి. ఇంత చరిత్ర ఉన్న బిల్ గేట్స్ నాలుగు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. అది కూడా మైక్రోసాఫ్ట్ ప్రతినిధిగా కాకుండా ఫౌండేషన్ ప్రతినిధిగా వైద్య రంగంలో ఆంధ్రప్రదేశ్‌కు సహాయం చేయడానికి వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంజీవని ప్రాజెక్టుకు ఈ ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందిస్తోంది. ఇలాంటి బిల్ గేట్స్ పర్యటనపై వైసీపీ నాయకులు, ఆ పార్టీ కోసం పనిచేస్తున్న పేటీఎం బ్యాచ్ చేస్తున్న విమర్శలు కంపరం పుట్టిస్తున్నాయి. సహాయం చేయడం కోసం వచ్చిన వారిని తిట్టడాన్ని మించిన రోత రాజకీయం ఉంటుందా? జగన్మోహన్ రెడ్డికి గానీ, ఆయన మద్దతుదారులకు గానీ బిల్ గేట్స్ చేసిన అపకారం ఏమిటి? అని ప్రశ్నించుకుంటే సమాధానం లభించదు. జగన్ రెడ్డి వంటి ఆర్థిక నేరాల అభియోగాలు ఎదుర్కొంటున్న వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉంటే కలుసుకోవడానికి బిల్ గేట్స్ వంటి వ్యక్తి అంగీకరించేవారు కారు. అలాంటి స్థాయి ఆయనది. అయితే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తున్న ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బిల్ గేట్స్ పేరు కూడా ఉంది. మనుషులు అన్నాక కొందరిలో బలహీనతలు ఉండటం సహజం. ఈ బలహీనతలు వేర్వేరుగా ఉంటాయి. జగన్ రెడ్డికి సంపద పోగేసుకోవడం అనే బలహీనత ఉండటం వల్లనే కదా ఆయన అవినీతి ఆరోపణలపై విచారణ ఎదుర్కొంటున్నారు. సమాజంలో అత్యున్నత స్థానాలకు చేరుకున్న వారు కూడా ఇందుకు మినహాయింపు కాదు. రాజకీయ ప్రముఖులు, వ్యాపార దిగ్గజాలు ఈ జాబితాలో ఉన్నారు. వ్యక్తిగత బలహీనతలను అధిగమించలేకపోవడం వారి బలహీనత. నైతిక విలువలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చే దేశాలలో వ్యక్తిగత బలహీనతలకు లొంగిపోయిన వారు భారీ మూల్యం చెల్లించుకున్నారు. ఈ క్రమంలోనే బిల్ గేట్స్ వైవాహిక జీవితం కూడా విచ్ఛిన్నమైంది. చేసిన తప్పులకు ఆయన తన భార్యకు, సమాజానికి క్షమాపణలు చెప్పుకొన్నారు. మానసికంగా కృంగిపోతున్నారు. ఈ కారణంగానే ఢిల్లీలో జరుగుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదస్సుకు ఆహ్వానం ఉన్నా ఆయన దూరంగా ఉండిపోయారు. అంటే జనంలోకి రావడానికి ఆయనకు ముఖం చెల్లడం లేదన్న మాట! నిజానికి బిల్ గేట్స్ చేసిన పని వల్ల సమాజానికి గానీ, దేశానికి గానీ నష్టం ఏమీ జరగలేదు. కేవలం నైతికతకు సంబంధించి తప్పటడుగులు వేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడలేదు. ప్రభుత్వ సంపదను దోచుకోలేదు. అంతేకాదు, ఆంధ్రప్రదేశ్‌కు గానీ, రాష్ట్ర ప్రజలకు గానీ బిల్ గేట్స్ చేసిన అన్యాయం కూడా ఏమీ లేదు. అయినా ఆయనను వైసీపీ గ్యాంగ్ తిట్టిపోయడానికి కారణం ఏమిటి? జగన్ రెడ్డికి బిల్ గేట్స్ రాజకీయ ప్రత్యర్థి కూడా కాదే! అయినా ఆయన వ్యక్తిగత జీవితంపై వచ్చిన ఆరోపణల కారణంగా వైసీపీ రెచ్చిపోయింది. పచ్చి బూతులు తిట్టారు. దీనికి అంతటికీ కారణం బిల్ గేట్స్‌కు విలువలు లేకపోవడం కాదు. ఆయన పర్యటన వల్ల చంద్రబాబుకు ఎక్కడ మంచి పేరు వస్తుందో అన్న కడుపు మంట ప్రధాన కారణం. నైతిక విలువలే ప్రాతిపదిక అయిన పక్షంలో మన దేశంలో ప్రజా జీవితంలో కొనసాగే నైతిక అర్హత అతి కొద్ది మందికి మాత్రమే ఉంటుంది. మన దేశంలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన ఎంత మందిపై ఆర్థిక నేరాలు, క్రిమినల్ కేసులు నమోదు కాలేదు? అయినా ఏ పట్టింపూ లేకుండా వారంతా దర్జాగా పదవులు అనుభవిస్తున్నారు కదా? జైలుకు వెళ్లి రావడం ప్రత్యేక అర్హతగా మార్చుకోలేదా? ఆంధ్రప్రదేశ్‌లో బిల్ గేట్స్‌ను విమర్శించిన వైసీపీ గ్యాంగ్‌లో ఎంత మందికి ప్రజా జీవితంలో కొనసాగే నైతికత ఉంది? ఆ పార్టీ అధినేత జగన్ రెడ్డికే ఆ అర్హత లేదు కదా? నెత్తిన డజనుకు పైగా కేసులు మోస్తున్న జగన్ రెడ్డి నీతులు చెబుతుంటే భరిస్తున్నాం కదా! తనపై నమోదైన అవినీతి కేసుల విచారణకు రాకుండా ఆయన ఎన్ని కుటిల ఎత్తులకు పాల్పడుతున్నారో చూస్తున్నాం. చివరికి సొంత బాబాయ్ హత్య కేసులో కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. రక్తం పంచుకు పుట్టిన చెల్లిని సైతం ఆస్తి కోసం దూరం చేసుకున్న జగన్ రెడ్డి నాయకత్వంలోని పార్టీ, లక్షల కోట్ల సంపదను తృణప్రాయంగా భావించి దానధర్మాలు చేస్తున్న బిల్ గేట్స్‌ను విమర్శించడం దుస్సాహసమే అవుతుంది. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మన దేశానికి చెందిన ఎంతో మంది పేర్లు ఉన్నాయి. వారి గురించి మాట్లాడే సాహసం చేయలేని వారు మన ప్రజలకు సహాయం చేద్దామని వచ్చిన వ్యక్తిని తిట్టిపోయడం వారి కుసంస్కారానికి నిదర్శనం కాదా? ఆంధ్రప్రదేశ్ దశా దిశా మార్చడానికి అందివచ్చిన ఏ అవకాశాన్నీ వదులుకోని చంద్రబాబు, ఈ క్రమంలోనే రాష్ట్రానికి వచ్చిన బిల్‌గేట్స్‌ను సాదరంగా ఆహ్వానించి గౌరవ మర్యాదలు కల్పించారు. ఏఐ ఆధారిత వ్యవసాయానికి, డిజిటల్ మ్యాపింగ్‌కు, రియల్ టైం గవర్నెన్స్‌కు సాంకేతిక సహకారం అందించడానికి బిల్ గేట్స్ వచ్చారు. ఈ విషయమై గేట్స్ ఫౌండేషన్ అందించే సహాయానికి, ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధం ఏమిటి? వ్యక్తిగత జీవితాలకు సంబంధించి ఎంత మంది వైసీపీ నాయకులు, కూటమి నాయకులపై ఆరోపణలు రాలేదు? వారి అనైతికతను పట్టించుకోని వారు అమెరికా పౌరుడైన బిల్ గేట్స్‌కు మాత్రమే నైతికత ఉండాలని అనుకోవడం ఏమిటి? ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రాక్టుల కోసం బిల్ గేట్స్ రాలేదే? ఎవరితోనూ వ్యక్తిగత సంబంధాలు పెంచుకోవడానికి ఆయన రాలేదు. ఫౌండేషన్ అందిస్తున్న సేవలను ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించాలన్న చంద్రబాబు అభ్యర్థన మేరకు మాత్రమే ఆయన వచ్చారు. ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా మొదలైన సంజీవని పథకం విజయవంతమైంది. ఈ ప్రాజెక్టు కింద తక్కువ ఖర్చుతో ప్రజలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన చికిత్స అందిస్తారు. ఇందుకోసం ఏఐని వినియోగిస్తున్నారు. గర్భిణులు, పిల్లల్లో పోషకాహార లోపాన్ని అరికట్టడం కోసం అంగన్‌వాడీ కేంద్రాలకు సహాయం చేస్తున్నారు. ఈ విధంగా ఆంధ్రప్రదేశ్‌కు సహాయం చేస్తున్న వ్యక్తిని అతిథిగా గౌరవించకపోయినా ఫర్వాలేదు గానీ తిట్టిపోయడం ఏమిటి? బిల్‌గేట్స్ వంటి వారు సమాజ సేవకు పనికిరారు అనుకుంటే మన దేశంలో దాదాపు 95 శాతం మంది రాజకీయ నాయకులపై నిషేధమే విధించాలి. జగన్ రెడ్డి వంటి వారికి ఎన్నికల్లో పోటీ చేసే అర్హత ఉంటుందా?

ప్రత్యర్థులు.. శత్రువులు!

రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా పరిగణించడం ప్రస్తుతం తెలుగునాట మొదలైన రాజకీయ సంస్కృతి. ఈ క్రమంలోనే రాజకీయ ప్రత్యర్థులను గౌరవించే వారిని కూడా శత్రువుగానే పరిగణిస్తున్నారు. ఈ కారణంగానే బిల్ గేట్స్‌ను కూడా జగన్ అండ్ కో తమ శత్రువుగా ప్రకటించుకున్నట్టుగా కనిపిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో చోటుచేసుకున్న వ్యవహారాలపై చాలా కాలం క్రితం అమెరికాలో ఆరోపణలు నమోదయ్యాయి. అంతెందుకు అదానీ సంస్థ తాము ఉత్పత్తి చేసే విద్యుత్తును ఆంధ్రప్రదేశ్‌లో విక్రయించడానికి 1,750 కోట్ల రూపాయలను లంచంగా ఇచ్చిందని అమెరికాలో కేసు నమోదు కాలేదా? ఆ లంచాల వ్యవహారం జరిగినప్పుడు జగన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు కదా? బిల్ గేట్స్ నేరస్థుడే అయితే, జగన్ రెడ్డిని మించిన నేరస్థుడైతే కాదు కదా? చంద్రబాబును విమర్శించడం వేరు. రాష్ట్రానికి సహాయం చేయడానికి వచ్చిన వ్యక్తిని విమర్శించడం వేరు అన్న ఇంగితం కూడా లేకపోతే ఎలా? ఇలాంటి దిక్కుమాలిన సలహాలు, సూచనలు ఎవరిస్తారో తెలియదు. రాష్ట్రానికి వెయ్యికోట్ల రూపాయల వరకు ఫౌండేషన్ తరపున సహాయం చేస్తున్న బిల్ గేట్స్ ఎవరి జేబులూ కొట్టడానికి రాలేదు. ప్రజల జేబులు కొడుతున్న వారిని నెత్తిన పెట్టుకొని, సహాయం చేయడానికి వచ్చిన వారిని దూషించడం ఏమిటి? వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆరోపణలను పక్కన పెడితే, బిల్ గేట్స్ పక్కన నిలబడటానికి జగన్ అండ్ కోకు అర్హత ఉంటుందా? గేట్స్ పర్యటన సందర్భంగా టీకి, సమోసాలకు, భోజనాలకు ఎంత ఖర్చు చేశారో వివరాలు వెల్లడించాలని కోరడం రోతగా ఉంది. ఇలాంటి చెత్త మాటలకు వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి పనిగట్టుకొని దళితులను వాడుకోవడం గమనార్హం. బిల్ గేట్స్ అపాయింట్‌మెంట్ కూడా పొందలేని వారు చవకబారు విమర్శలు చేయడం వల్ల నష్టపోయేది రాష్ట్ర ప్రజలే. రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలను కూడా చంద్రబాబు వ్యక్తిగత వ్యవహారాలుగా పరిగణించడం వల్ల ప్రస్తుత దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో చేపడుతున్న ప్రయోగాలు విజయవంతమైతే ప్రపంచ దేశాలలో అమలు చేయవచ్చునని బిల్ గేట్స్ భావిస్తున్నారు. ఈ అభిప్రాయానికి కూడా విపరీతార్థాలు తీస్తూ నల్లజెండాలు పట్టుకోవడం వారి మనో వికారాలకు అద్దం పడుతోంది. చంద్రబాబును 'హలో ఫ్రెండ్' అని సంబోధించడం వల్ల బిల్ గేట్స్‌పై కొందరిలో అకారణంగా వ్యతిరేకత పెరుగుతున్నట్టుగా ఉంది. ఇదే జగన్ రెడ్డి తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇంటింటా సత్య నాదెళ్లను తయారు చేస్తానని చెప్పుకొన్నారు. బిల్ గేట్స్ నెలకొల్పిన మైక్రోసాఫ్ట్ లేకపోతే సత్య నాదెళ్ల గురించి జగన్ రెడ్డి ప్రస్తావించగలిగేవారా? ఏ అంశాన్ని రాజకీయంగా చూడాలి.. ఏ అంశాన్ని రాజకీయాలకు అతీతంగా చూడాలన్న విచక్షణ లేకపోవడం శోచనీయం. రాజకీయాలు ఇంత దరిద్రంగా మారడం మహా విషాదం. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, జగన్ రెడ్డి రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే. దురదృష్టవశాత్తు వారి మధ్య శత్రుత్వం ఏర్పడింది. ఈ ఇరువురికీ అభిమానులు ఎలా ఉంటారో వ్యతిరేకులూ అలాగే ఉంటారు. ఇద్దరి మధ్యా నెలకొన్న శత్రుత్వం వారిని అభిమానించే వారినీ ఆవహిస్తోంది. ఫలితంగానే బిల్ గేట్స్ వంటి వారు కూడా కొందరికి శత్రువులు అవుతున్నారు. విమర్శలు, దూషణలు ఇప్పుడు చంద్రబాబు–జగన్‌రెడ్డికి మాత్రమే పరిమితం కాకుండా వారి మద్దతుదారులకు కూడా వ్యాపిస్తున్నాయి. ఇందుకు సోషల్ మీడియా వేదిక అవుతోంది. స్వేచ్ఛ ఉంది కదా అని హద్దులు మీరి విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే బిల్ గేట్స్ ముడి సరుకు అయ్యారు.

> **దుస్తులు ఉతకడానికి వాడే ట్రిపుల్ ఎక్స్ సబ్బు ఉత్పత్తిదారులు తమ ట్యాగ్ లైన్‌గా సంస్కారవంతమైన సబ్బు అని పెట్టుకున్నారు. ఉత్పత్తిదారులు ఈ ట్యాగ్ లైన్ ఎందుకు పెట్టుకున్నారో తెలియదు గానీ, తెలుగునాట రాజకీయాలను ఈ ట్రిపుల్ ఎక్స్ సబ్బుతో ఉతికితే సంస్కారం వస్తుందేమో అన్న ఆశ కలుగుతోంది.**

లాజిక్ ఏదీ.. ఎక్కడ?

బిల్ గేట్స్ పర్యటన నుంచి ప్రజల దృష్టి మళ్లించడం కోసం చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ ఉత్పత్తులను వివాదంలోకి లాగే ప్రయత్నం చేస్తున్నారు జగన్. మూడున్నర దశాబ్దాల క్రితం నాలుగు కోట్ల రూపాయల పెట్టుబడితో ప్రారంభమైన హెరిటేజ్ సంస్థ విలువ ఇప్పుడు నాలుగు వేల కోట్లకు చేరింది. ఇది ఒక్కరోజులో సాధ్యం కాలేదు. 35 ఏళ్ల పాటు ఆ కుటుంబం పడిన శ్రమ అందుకు కారణం. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా కావడానికి జగన్ రెడ్డి హయాంలో నెయ్యి సేకరణకు సంబంధించిన నిబంధనలను సడలించడమే ప్రధాన కారణం అన్నది నిర్వివాదాంశం. తాడూ బొంగరం లేని కంపెనీలకు కూడా టెండర్ దాఖలు చేసే అవకాశం కల్పించారు. నాణ్యతకు పెద్ద పీట వేయాల్సింది పోయి ధరకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ప్రస్తుత దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడింది. అమెరికా వంటి దేశాల్లో అంచనా వ్యయం కంటే తక్కువకు టెండర్లు వేసే కంపెనీలను పరిగణనలోకి తీసుకోరు. కారణం, నాణ్యత దెబ్బతింటుందని! తిరుమల ప్రసాదం విషయంలో కూడా ఇదే విధానాన్ని అనుసరించి ఉంటే లడ్డూ ప్రాశస్త్యం దెబ్బతిని ఉండేది కాదు కదా? గతంతో పోల్చితే తిరుమల లడ్డూ నాణ్యత రానురాను తగ్గిపోయింది. ఒకప్పుడు లడ్డూ ఉన్న ప్రాంతం సువాసనలతో నిండిపోయేది. అలా సువాసనలు వెదజల్లకపోవడానికి కారణం, ధరలకు ప్రాధాన్యమిచ్చి నాణ్యత విషయంలో రాజీ పడటమే! జగన్ రెడ్డి హయాంలో ఈ విషయంలో నిబంధనలను సడలించడం వల్లే భోలే బాబా వంటి సంస్థలు రంగ ప్రవేశం చేయగలిగాయి. ఈ విషయమై భక్తుల మనోభావాలు దెబ్బతినడంతో తటస్థులుగా, మేధావులుగా చెప్పుకొనే కొంత మంది జగన్‌కు అనుకూలంగా రంగంలోకి దిగారు. అయినా డ్యామేజ్ కంట్రోల్ కాకపోవడంతో జగన్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థను వివాదంలోకి లాగారు. తిరుమలకు నెయ్యి సరఫరా టెండర్లలో పాల్గొన్న సంస్థలలో ఒకటైన ఇందాపూర్ డెయిరీలో సౌకర్యాలను హెరిటేజ్ సంస్థ వాడుకుందని చెబుతూ, హెరిటేజ్ ఉత్పత్తులు కూడా నాణ్యమైనవి కావనే అర్థం వచ్చేలా జగన్ రెడ్డి ఆరోపణలు చేశారు. ఇందుకు ప్రతిఫలంగా ఇందాపూర్ డెయిరీ నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం అధిక ధరకు నెయ్యి కొనుగోలు చేసేలా వెసులుబాటు కల్పిస్తున్నదని కూడా ఆరోపించారు. ఈ ఆరోపణలకు ఆ సంస్థ సమాధానం చెప్పుకొంటుంది గానీ, ఈ సందర్భంగా జగన్ రెడ్డి ప్రస్తావిస్తున్న అంశాలలో లాజిక్ లేదు. అంతర్జాతీయంగా పేరొందిన బ్రాండెడ్ కంపెనీలు కూడా తమ ఉత్పత్తుల కోసం వివిధ ప్రదేశాలలోని సదుపాయాలను వినియోగించుకుంటున్నాయి. ఉదాహరణకు, పోలో బ్రాండ్ దుస్తులను ఉమ్మడి మెదక్ జిల్లాలోని నర్సాపూర్‌లోని టైలర్స్ కుడతారు. తమ బ్రాండ్‌కు అనుగుణంగా వస్త్రాలకు దారాన్ని పోలో కంపెనీయే సరఫరా చేస్తుంది. నాణ్యత విషయంలో రాజీ పడకుండా నర్సాపూర్‌లోని టైలర్ల సేవలను పోలో కంపెనీ వాడుకుంటోంది. విక్టోరియా సీక్రెట్ వంటి మహిళల లోదుస్తుల తయారీ బ్రాండ్ కంపెనీ కూడా విశాఖపట్నంలోని అచ్యుతాపురం అపరెల్ సిటీలో తమ ఉత్పత్తులను కుట్టిస్తుంది. హెరిటేజ్ కూడా ఇదే విధంగా ఇందాపూర్ డెయిరీలోని సౌకర్యాలను వాడుకొని ఉండవచ్చు.

> **తెలంగాణలో 72 శాతం మంది ఓటర్లు మున్సిపల్ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితిని దూరం పెట్టారు. తెలంగాణ మా అడ్డా అని చెప్పుకొనే పార్టీకి ఈ దుస్థితి ఏమిటో తెలుసుకోకుండా ఆంధ్రజ్యోతిని దూరం పెట్టామని చెప్పుకోవడం చెరువు మీద అలిగి ఎండబెట్టుకోవడమే అవుతుంది. పొరపాటున జరిగిన ఒక తప్పు విషయమై భారత రాష్ట్ర సమితి ప్రతిస్పందన ఆ పార్టీ అహంకారానికి నిదర్శనం.**

..కొన్ని సరదాలు వదులుకోవాల్సిందే!

ఈ విషయం అలా ఉంచితే, విలేఖరుల సమావేశంలో మంత్రి లోకేశ్ గురించి జగన్ రెడ్డి చెప్పిన ఒక మాట నాకు నచ్చింది. ఏ ఉద్దేశంతో జగన్ రెడ్డి మంత్రి లోకేశ్‌ను విమర్శించారో తెలియదు గానీ ఆయన చెప్పిన దాంట్లో పాయింట్ ఉంది. 'క్రికెట్ మ్యాచ్‌లను తిలకించడానికి లోకేశ్ విదేశాలకు వెళ్లడం ఎందుకు? ఇంట్లో కూర్చొని టీవీలో వీక్షించవచ్చు కదా' అన్న ఆయన మాటల్లో అర్థం ఉంది. లోకేశ్ ఇటీవలి కాలంలో దుబాయ్, ముంబై, కొలంబోలో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లకు వెళ్లారు. ఇలా వెళ్లడం వల్ల జరిగిన నష్టం కంటే ఎంపీ సానా సతీశ్ ఆయన పక్కన ఉండటం వల్ల ఎక్కువ నష్టం జరిగింది. ఎవరైనా జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే వ్యక్తిగత సరదాలు, అలవాట్లను వదులుకోవాలి. ఒకటి కావాలంటే ఒకటి వదులుకోవాలని అందుకే అంటారు. రాజకీయాలలో ఉన్నవారికి ఇది మరింత ఎక్కువగా వర్తిస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునే తీసుకుందాం. ఆయన వ్యక్తిగత సరదాలు, విలాసాలు అన్నింటినీ వదులుకున్నారు. లోకేశ్ కూడా రాజకీయాలలో మరింత ప్రజాదరణ చూరగొనాలనుకుంటే తండ్రిని ఎంతో కొంత ఆదర్శంగా తీసుకోవాలి. మన చుట్టూ ఉన్న వారిని బట్టి ప్రజలు మనల్ని అంచనా వేస్తారన్న వాస్తవాన్ని కూడా లోకేశ్ గ్రహించాలి. సోషల్ మీడియాలో కనిపిస్తున్న ఫొటోలు అన్నింటిలో లోకేశ్ పక్కన సానా సతీశ్ ఉండటం వల్ల క్రికెట్ మ్యాచ్ తిలకించడానికి వెళ్లడం కన్నా ఆయన పక్కనే ఉండటం వల్ల ఎక్కువ నష్టం జరిగింది. రాజకీయాలలో ఇప్పుడిప్పుడే గుర్తింపు పొందుతున్న లోకేశ్ ఇలాంటి విషయాల్లో మరింత జాగ్రత్త తీసుకుంటే ఆయనకే మంచిది. జగన్ రెడ్డి అన్నారని కాదు గానీ, క్రికెట్ మ్యాచ్ చూడ్డానికి మంత్రిగా ఉండి విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. సొంత ఖర్చులతో వెళ్లారా? ప్రభుత్వ ఖర్చుతో వెళ్లారా? అని కాదు, చంద్రబాబు తదనంతరం తెలుగుదేశం పార్టీకి నాయకత్వం వహించాలనుకుంటున్న వ్యక్తిగా లోకేశ్ కొన్ని సరదాలను వదులుకోవాల్సిందే. రాజకీయ ప్రత్యర్థులకు తనను విమర్శించే అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఆయనకే మంచిది. ప్రత్యర్థులకు కాలు అందిస్తే పట్టుకోకుండా ఉంటారా?


> **ఆంధ్రప్రదేశ్ దశ దిశా మార్చడానికి అందివచ్చిన ఏ అవకాశాన్నీ వదులుకోని చంద్రబాబు, ఈ క్రమంలోనే రాష్ట్రానికి వచ్చిన బిల్ గేట్స్‌ను సాదరంగా ఆహ్వానించి గౌరవ మర్యాదలు కల్పించారు. ఏఐ ఆధారిత వ్యవసాయానికి, డిజిటల్ మ్యాపింగ్‌కు, రియల్ టైం గవర్నెన్స్‌కు సాంకేతిక సహకారం అందించడానికి బిల్ గేట్స్ వచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రాక్టుల కోసం బిల్ గేట్స్ రాలేదే? ఎవరితోనూ వ్యక్తిగత సంబంధాలు పెంచుకోవడానికి ఆయన రాలేదు. ఫౌండేషన్ అందిస్తున్న సేవలను ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించాలన్న చంద్రబాబు అభ్యర్థన మేరకు మాత్రమే ఆయన వచ్చారు.**

కాలమే నిర్ణయిస్తుంది!

ఇక తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'లో ఓట్ల శాతం విషయమై పొరపాటు దొర్లింది. బీఆర్ఎస్, బీజేపీకి వచ్చిన ఓట్ల శాతం తారుమారు అయింది. ఈ పొరపాటును గుర్తించిన మేం మరుసటిరోజు ఎవరూ కోరకుండానే స్వచ్ఛందంగా సవరణ ప్రచురించాం. ఇలాంటి పొరపాట్లు మీడియాలో అప్పుడప్పుడూ జరుగుతూనే ఉంటాయి. మానవ తప్పిదాలకు, సాంకేతిక లోపాలకు ఏ మీడియా కూడా అతీతం కాదు. అయితే ఈ పొరపాటును ఆసరాగా చేసుకొని భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా వేదికగా రెచ్చిపోయింది. బ్రోకర్లు న్యూస్ పేపర్లను నడిపితే ఇలాంటి అబద్ధాలనే అచ్చోసిన ఆంబోతుల్లా ప్రజల మీదకు వదులుతారు.. అందుకే 'ఆంధ్రజ్యోతి'ని బీఆర్ఎస్ దూరం పెట్టిందని ఆ పార్టీ అధికారికంగా ఒక పోస్టు పెట్టింది. లోఫర్ల చేతికి పార్టీ పగ్గాలు వచ్చినప్పుడు ఇలాంటి భాషనే వాడతారు అని మేం కూడా అనవచ్చు కదా? 'ఆంధ్రజ్యోతి'ని మీరు దూరం పెట్టడం కాదు, తెలంగాణలో 72 శాతం మంది ఓటర్లు మున్సిపల్ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితిని దూరం పెట్టారు. తెలంగాణ మా అడ్డా అని చెప్పుకొనే పార్టీకి ఈ దుస్థితి ఏమిటో తెలుసుకోకుండా మీడియాను దూరం పెట్టామని చెప్పుకోవడం చెరువు మీద అలిగి ఎండబెట్టుకోవడమే అవుతుంది. పొరపాటున జరిగిన ఒక తప్పు విషయమై భారత రాష్ట్ర సమితి ప్రతిస్పందన ఆ పార్టీ అహంకారానికి నిదర్శనం. ఎవరు బ్రోకర్లో.. ఎవరు లోఫర్లో కాలమే నిర్ణయిస్తుంది!

> **రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలను కూడా చంద్రబాబు వ్యక్తిగత వ్యవహారాలుగా పరిగణించడం వల్ల ప్రస్తుత దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. చంద్రబాబును 'హలో ఫ్రెండ్' అని సంబోధించడం వల్ల బిల్ గేట్స్‌పై కొందరిలో అకారణంగా వ్యతిరేకత పెరుగుతున్నట్టుగా ఉంది. ఇదే జగన్ రెడ్డి తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇంటింటా సత్య నాదెళ్లను తయారు చేస్తానని చెప్పుకొన్నారు. బిల్ గేట్స్ నెలకొల్పిన మైక్రోసాఫ్ట్ లేకపోతే సత్య నాదెళ్ల గురించి జగన్ రెడ్డి ప్రస్తావించగలిగేవారా? ఏ అంశాన్ని రాజకీయంగా చూడాలి.. ఏ అంశాన్ని రాజకీయాలకు అతీతంగా చూడాలన్న విచక్షణ లేకపోవడం శోచనీయం. రాజకీయాలు ఇంత దరిద్రంగా మారడం మహా విషాదం.**

యాంత్రికమైన జ్ఞానార్జన!



ఇవ్వాళ కాలేజీలు, విశ్వవిద్యాలయాలు మనసున్న మనిషిని తయారు చేసే నిలయాలుగా లేవు. అవి ఉద్యోగాలకు టికెట్లు ఇచ్చే కౌంటర్లుగా మారాయి. మార్కులు, ర్యాంకులు గ్రేడ్లు ప్యాక్ చేసి విడుదల చేసే ఉత్పత్తి కేంద్రాలయ్యాయి. ఇక్కడ విద్యార్థి ఆలోచించే ప్రాణి కాదు, కేవలం ఒక ఫైల్. ఒక హాల్ టికెట్ నెంబర్. ఒక రిజల్ట్. అతని కళ్లలో ప్రశ్నలు ఉంటాయి, కానీ వాటి చెంతే స్టాప్ సిగ్నల్ కూడా ఉంటుంది. తరగతి గది ఇప్పుడు ప్రశ్నలకు చోటివ్వదు. అది టైమ్ టేబుల్‌కు విధేయంగా ఉంటుంది. ఎంత సిలబస్ చెప్పామన్నది ముఖ్యం, ఎవరికి ఏమి అర్థమైందన్నది కాదు. సంస్కృతి ఈ క్యాంపస్‌లలో అప్పుడప్పుడూ అతిథిలా ప్రవేశిస్తుంది. ఏటా ఒక రోజు– ఒక స్టేజ్, ఒక సెల్ఫీ; మరుసటి రోజు ఒక న్యూస్ క్లిప్, మళ్లీ మౌనం.

కవితలు సిలబస్ అంచుల్లో పడుకుంటాయి. సినిమాలు 'డిస్ట్రాక్షన్'గా ముద్ర వేయబడతాయి. భాషలు పరీక్ష పేపర్ వరకే పరిమితమవుతాయి. విద్య వేగంగా పరిగెడుతోంది... లోతు మాత్రం వెనుకబడుతోంది. సర్టిఫికెట్లు పెరుగుతున్నాయి... స్పృహ మాత్రం తగ్గుతోంది. విద్య మనిషిని కాదు సి.విని తయారు చేస్తోంది. ఆలోచనను కాదు ఫలితాన్ని కొలుస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే కాలేజీలు, విశ్వవిద్యాలయాలు భవిష్యత్తును రూపొందించే ప్రదేశాలుగా కాక, పరీక్షలు నిర్వహించే శిక్షణ కేంద్రాలుగా మిగిలిపోతాయి. నిజానికి కాలేజీలు విశ్వవిద్యాలయాలు కేవలం తరగతుల గదులు, కారిడార్లు, పరీక్షా హాళ్ల సమాహారం కాదు. అవి భావాలు శ్వాస తీసుకునే ప్రదేశాలు, ఆలోచనలు స్వేచ్ఛగా నడిచే స్థలాలు. ప్రశ్నలు, జవాబులు పక్కపక్కనే కూర్చునే స్థలాలు. నవయువ మనసులు నెమ్మదిగా, మనిషిగా మారడాన్ని నేర్చుకునే వాతావరణం అది. సాంస్కృతిక వాతావరణమే ఆయా క్యాంపస్‌లకు కనిపించని హృదయ స్పందన. అది లేకపోతే జ్ఞానం యాంత్రికమవుతుంది,

డిగ్రీలు కేవలం ప్రాణం లేని కాగితాలవుతాయి, విద్య అనుభూతిని మరిచిపోతుంది. సాయంత్రం వేళ ఒక కవిత గొంతెత్తి చదివినప్పుడు, మసక వెలుగుల్లో ఒక నాటకం సాధన చేస్తున్నప్పుడు, హాస్టల్ గదిలో పుట్టిన పాట, రాత్రి గాలిలో కలిసిపోయినప్పుడు అక్కడే విద్య నిశ్శబ్దంగా తన సంపూర్ణతను పరిపూర్ణతను పొందుతుంది. ఎందుకంటే అక్కడే విద్యార్థులు ఏమి ఆలోచించాలో కాదు, దేన్ని ఎలా చూడాలో నేర్చుకుంటారు. ఇతర భాషలను, చరిత్రలను, ఇతరుల బాధలు, ఆనందాలను; ప్రాంతం, కులం, మతం, లింగం పేరుతో అడ్డుగా నిలిచిన గోడలను కరిగించి, పంచుకున్న క్షణాలను సృష్టిస్తుంది. సాంస్కృతిక వాతావరణం విశ్వవిద్యాలయాలకు ఒక అంతఃకరణను ఇస్తుంది. సాంస్కృతికత ఉన్న విశ్వవిద్యాలయం ఆలోచించే పౌరులను, సున్నితమైన మనసులను, అన్యాయాన్ని సాధారణంగా అంగీకరించని హృదయాలను సమాజానికి అందిస్తుంది. అటువంటి క్యాంపస్ తన గేట్ల వద్ద ముగియదు. అది సమాజంలోకి ప్రవహిస్తుంది. ప్రశ్నలుగా, కళగా, ప్రతిఘటనగా, ఆశగా... కాలేజీ విశ్వవిద్యాలయ క్యాంపస్‌లలో సంస్కృతిని నిర్మించే అనేక దారులున్నాయి.

ఆలోచనకు స్వేచ్ఛ, భిన్నతకు గౌరవం, సృజనాత్మకతకు చోటు అనే విలువలు.. గోడలపై రాసే నినాదాలుగా కాదు, దైనందిన కార్యక్రమంగా మారాలి. క్యాంపస్‌లో కొన్ని ప్రదేశాలు ఎప్పుడూ తెరిచి ఉండాలి. ఆడిటోరియం తాళం వేసిన గది కాకుండా, సాయంత్రం ఆలోచనలు చేరే మైదానంగా మారాలి. గ్రంథాలయం కేవలం పరీక్షల కోసం, మార్కుల కోసం చదివే వేదికగా కాకుండా, మనసు నిశ్శబ్దం కావడానికి ఉపయోగపడే ప్రదేశంగా ఉండాలి. భయపడే చోట సంస్కృతి ఎప్పుడూ పుట్టదు. విద్యార్థులు కేవలం వినియోగదారులు కాదు, వారే సంస్కృతి సృష్టికర్తలు. సిలబస్ కూడా సంస్కృతితో మాట్లాడాలి; శాస్త్రం కవితను వినాలి; సాహిత్యం సమాజాన్ని ప్రశ్నించాలి; సినిమా తత్వశాస్త్రంతో వాదించాలి. తరగతి గది– జీవితం నుంచి విడిపోయిన దీవిలా ఉండకూడదు.

ఉపాధ్యాయులు కేవలం పాఠాలు చెప్పే యంత్రాలు కాదు. వారు సంస్కృతికి దీపస్తంభాలు. ఒక కవితను సూచించడం, ఒక సినిమా చూడమని చెప్పడం, ఒక ప్రశ్నను ఆపకుండా ముందుకు నెట్టడం ఇలాంటివే పెద్ద సాంస్కృతిక చర్యలు. ఉపాధ్యాయుడికి గౌరవం ఉండాలి. భాషలు క్యాంపస్‌లో వినిపించాలి. మాతృభాషలు, ప్రాంతీయ స్వరాలు, జానపద గీతాలు– అన్నీ కలిసి మాట్లాడినప్పుడు సంస్కృతి విస్తరిస్తుంది. ఒకే స్వరం సంస్కృతి కాదు. సాంస్కృతిక వేదికలు అందరికీ చెందాలి.

సంస్కృతి పరిపక్వత నేర్పే క్యాంపస్‌లకు డబ్బు అవసరమే. గదులు అవసరమే. పుస్తకాలు, వేదికలూ అవసరమే. కానీ అంతకంటే ముఖ్యమైనది సంకల్పం. దాన్ని ఎప్పుడో ఒకసారి కాదు నిరంతరం ప్రతిరోజూ నెరవేర్చాలి. బయట ప్రపంచంతో క్యాంపస్‌లు మాట్లాడాలి. రచయితలు రావాలి, కళాకారులను పిలవాలి. సమాజం కాంపస్‌లోకి రావాలి. సంస్కృతి ఒంటరిగా బతకలేదు. సంస్కృతిని సంఖ్యలతో కొలవలేం. దాని ఫలితం ప్రశ్నల్లో కనిపిస్తుంది; ప్రశాంత మనసుల్లో మెరుస్తుంది; సమాజంలోకి వెళ్లిన విద్యార్థుల్లో, వాళ్ల జీవితాల్లో నెమ్మదిగా బయటపడుతుంది. అప్పుడే కాలేజీ, విశ్వవిద్యాలయ క్యాంపస్ ఒక సంస్థగా కాదు... ఒక సజీవ విద్యా సంస్కృతిగా మారుతుంది. మనసున్న సమాజాన్ని సృష్టించే వేదిక అవుతుంది.

• వారాల ఆనంద్
కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత






ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని పలకరిస్తున్న సీఎం చంద్రబాబు



పాత వస్తువులకు.. నిత్యావసరాలు

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కింద చేపడుతోన్న వివిధ పనుల ద్వారా వృత్తాకార ఆర్థిక వ్యవస్థని పునర్నిర్వచిస్తున్నాం. గతంలో పాత వస్తువులు తీసుకుని కొత్త వస్తువులు ఇచ్చేవారు. అలాగే ప్రస్తుతం ఇళ్లల్లో పనికిరాని పాత వస్తువులను స్వచ్ఛరథాల ద్వారా సేకరించి వారికి అవసరమైన నిత్యావసరాలను అందచేస్తున్నాం. ప్రస్తుతం స్వచ్ఛ రథాల ద్వారా 9 రకాల పాత వస్తువులను సేకరిస్తున్నాం. రాబోయే రోజుల్లో వాటి సంఖ్యను పెంచుతాం. వీటిని పరిశ్రమలకు సరఫరా చేసి పునరుత్పత్తికి వినియోగిస్తాం. స్వచ్ఛ రథాలను దశలవారీగా అన్ని ప్రాంతాల్లో అమలు చేస్తాం. తద్వారా ఇంటి వద్దనే 100 శాతం చెత్తను సేకరించవచ్చు.



561 స్వయం సహాయక సంఘాలకు చెక్కు అందజేస్తున్న సీఎం చంద్రబాబు

స్వచ్ఛ సంకల్పం





స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న సీఎం చంద్రబాబు , మంత్రులు నారాయణ, గొట్టిపాటి, ఎమ్మెల్యే జీవీ ● స్వచ్ఛ రథం ప్రారంభిస్తూ..



భోజనం ప్లేట్లను పరిశీలిస్తూ..

- ప్రజలకు మెరుగైన ఆరోగ్యమే లక్ష్యం
- దశల వారీగా స్వచ్ఛ రథాల విధానం అమలు
- ముమ్మరంగా సాగుతున్న స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర
- వినుకొండ ప్రజా వేదికలో సీఎం చంద్రబాబు

వినుకొండ(గుంటూరు), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 'ప్రతి ఒక్కరూ తన ఇంటిని, తాము ఉండే వీధిని, స్వగ్రామాన్ని తద్వారా రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రతి ఒక్కరూ స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలి..' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు పిలుపిచ్చారు. వినుకొండ ఎన్‌ఎస్‌పీ కాలనీలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా వేదికపై నుంచి ఆయన మాట్లాడుతూ 2025 జనవరిలో ప్రారంభించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. పచ్చదనం, పరిశుభ్రం, నీరు-మీరు తదితర కార్యక్రమాల ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గత పాలకులు వదిలేసిన 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తతో భూమి, భూగర్భ జలాలు, వాతావరణం కలుషితమై ప్రజలు రోగాల బారిన పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కారణంగా ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం ఇవ్వాలనే (మిగతా 8వ పేజీలో)

స్వచ్ఛ రథాలు ప్రారంభం..

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తొలుత ముఖ్యమంత్రి స్వచ్ఛరథానికి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పుష్కార్టులు, ఈ-ఆటోలను పంపిణీ చేశారు. ఆ తర్వాత డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ని సందర్శించారు. మిర్చి, పుట్టగొడుగులు, జొన్న ప్రాసెసింగ్ ప్లాంట్లను పరిశీలిం చారు. డ్వాక్రా సంఘాలకు రూ.100 కోట్ల 14 లక్షల బ్యాంకు లింకేజ్‌ని విడుదల చేశారు. మొక్క జొన్న వ్యర్థాల నుంచి తయారు చేసిన భోజనం ప్లేట్లు, కప్పులను పరిశీలించారు. డోర్ టూ డోర్ వేస్టు కలెక్షన్, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ పునర్నిర్వచనాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, కలెక్టర్ కృతికా శుక్లా

బూట్లు విడిచి శ్రీవారి ప్రతిమ స్వీకారం

చంద్రబాబుకు ఎమ్మెల్యే జీవీ, ఆయన సతీమణి లీలావతి వేంకటేశ్వరస్వామి ప్రతిమని బహూకరించారు. ఆ సమయంలో సీఎం తన బూట్లు విప్పి స్వామివారి ప్రతిమని స్వీకరించారు. రెండు రోజుల క్రితం వైసీపీ ఎమ్మెల్సీలు చెప్పులేసుకుని వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని శాసనమండలిలో ప్రదర్శించిన చిత్రం, బూట్లు విప్పి చంద్రబాబు స్వామి ప్రతిమని తీసుకున్న ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో టీడీపీ కార్యకర్తలు షేర్ చేస్తూ ఇదీ తమకు దేవుడి మీద ఉన్న నమ్మకం, విశ్వాసమని తెలిపారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింతతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



తడి- పొడి చెత్త వాహనాలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



మహిళల విజయ సంకేతం



కోరం లేక.. మళ్లీ వాయిదా

- గణపవరం స్థలం వివాదం మళ్లీ తెరపైకి..
- నిధులు లేకుండా అనుమతులపై ప్రశ్నల వర్షం
- జడ్పీ ఒకటో స్థాయి సంఘ ఎజెండాకు ఆమోదం

జడ్పీ బడ్జెట్ సమావేశం రసాభాస

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆరంభంలో ఉన్న సభ్యులు ఆ తర్వాత లేకపోవడంతో(వాక్ అవుట్) కోరం లేదని ప్రకటిస్తూ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా వాయిదా వేశారు. 2025-26 సవరణ బడ్జెట్, 2026-27 సంవత్సరపు అంచనా బడ్జెట్ ఆమోదం కోసం శనివారం జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. కోరం లేక సమావేశం వాయిదా పడటం ఇది రెండో సారి. కాగా తొలుత కోరం ఉండటంతో ఒకటో స్థాయి సంఘం జరిగింది. అయితే ఈ సమావేశంలో ఎజెండాలను ఆమోదించిన జడ్పీటీసీలు 703 అంశాన్ని తిరస్కరించారు. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం పరిధిలోని జడ్పీ స్థలం తక్కువకే ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడంపై సభ్యులు ఈ అంశాన్ని వ్యతిరేకించారు. అసలు నిధులు లేకుండా అభివృద్ధి పనులకు ముందస్తు అనుమతి ఎలా ఇస్తారంటూ రొంపిచర్ల జడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి ప్రశ్నించారు. దీంతో జిల్లా పరిషత్ సమావేశం రసాభాసగా మారింది.



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, పక్కన కలెక్టర్ అన్సారియా, సీఈఓ జ్యోతి బసు

సమగ్ర గ్రామీణ అభివృద్ధి లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్, శాసన మండలి సభ్యులు, ఎమ్మెల్యేల సూచనలతో జడ్పీటీసీలు, ఎంపీటీసీలను సమన్వయం చేసుకుంటూ నిధుల లభ్యతకు అనుగుణంగా ప్రాధాన్య క్రమంలో నిధులు కేటాయిస్తున్నట్లు ఛైర్‌పర్సన్ తెలిపారు.

రిజిస్ట్రేషన్ సర్‌చార్జి రూ.18 కోట్లకు కోటి మాత్రమే మంజూరైందని మిగిలిన నిధుల కోసం రెవెన్యూ మంత్రికి లేఖ రాసినట్లు చెప్పారు. 32,276 మంది పదో తరగతి విద్యార్థులకు రూ.60 లక్షలతో స్టడీ మెటీరియల్, 24,862 మందికి రూ.19 లక్షలతో అల్పాహారం అందించినట్లు చెప్పారు. అనంతరం సవరణ, అంచనా బడ్జెట్లను ప్రవేశపెట్టగా పలువురు జడ్పీటీసీలు మాట్లాడారు. అయితే బడ్జెట్ ఆమోదానికి కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. ఈ సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నక్కా ఆనంద బాబు, జడ్పీ సీఈవో వి.జ్యోతి బసు, బాపట్ల జిల్లా ఇన్‌చార్జి డీఆర్వో లవన్న, డీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరి బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ భీమనేని వందనాదేవి, తదితరులు పాల్గొన్నారు.



● పాల్గొన్న జడ్పీటీసీలు, ఎంపీపీలు

పరిశుభ్రమైన పరిసరాలే లక్ష్యం

స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్రలో కలెక్టర్ అన్సారియా

మేడికొండూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన పరిసరాలు మన లక్ష్యం, సంకల్పం కావాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని పేరేచర్లలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడిపొడి చెత్త వేరు చేసి ఇచ్చే విధంగా విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఇల్లు, వీధి, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అన్నారు. గ్రీన్ అంబాసిడర్లను, పారిశుధ్య కార్మికులను గౌరవించాలన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయవద్దని ప్రజలకు సూచించారు. డీపీవో బి.వి.నాగ సాయికుమార్ మాట్లాడుతూ ఇళ్ల వద్దకు వచ్చే స్వచ్ఛ రథానికి పొడి చెత్త, తడి చెత్త వేరు చేసి అందించాలని తెలిపారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ వి.శంకర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి సేంద్రియ ఎరువు గుంటను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర గురించి పలకలూరి పూజిత అనే విద్యార్థి ప్రసంగం ఆకట్టుకుంది. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద మొక్కలు నాటారు. చెత్తను ఊడ్చే కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొన్నారు. ఉన్నత పాఠశాల ఆవరణలో సేంద్రియ ఎరువు గుంటకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మన్నవ స్వప్న, ఆర్డీవో కె. శ్రీనివాసరావు, మండల ప్రత్యేక అధికారి, వ్యవసాయ శాఖ జేడీ ఎం.పద్మావతి, డిప్యూటీ మండల పరిషత్ అధికారి పి.పూర్ణశంకరరావు, జడ్పీటీసీ కందుల సిద్దయ్య, ఎం.పి.టి.సి పాములపాటి సురేష్ పాల్గొన్నారు.



చీపురుతో పేరేచర్లలో వీధిని శుభ్రం చేస్తున్న కలెక్టర్ అన్సారియా

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- గంట ముందుగా కేంద్రాలకు రావాలి: ఆర్ఐఓ

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ మీడియట్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని ఇంటర్ బోర్డు ఆర్ఐఓ గర్నెపూడి సునీత తెలిపారు. పరీక్షల నిర్వహణపై ఆర్ఐఓ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. మార్చి 24 వరకు జరిగే పరీక్షలను విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో రాసేలా కేంద్రాల్లో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 87 కేంద్రాల్లో జరిగే పరీక్షలకు 68,858 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షలకు సంబంధించి ఇప్పటికే మూడు సెట్ల ప్రశ్నపత్రాలు, ఇతర సామాగ్రి పోలీస్‌స్టేషన్లకు తరలించినట్లు చెప్పారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఆయా పరీక్షలకు విద్యార్థులు కనీసం గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

- ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ బలోపేతం
- రైతు సాధికార సంస్థ సీఈఓ రామారావు

8

బిల్లుల చెల్లింపునకు గ్రీన్ సిగ్నల్

- 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై కీలక ఆదేశాలు



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

నేడే డాక్ సేవక్ సమ్మేళన్

- హాజరు కానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ, జీఎంసీ కమిషనర్

గుంటూరు, గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భారత తపాలాశాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి సమీపంలోని ఏటుకూరు రోడ్డు బొమ్మిడాలనగర్ శ్రీసత్యసాయి స్పిరిచ్యువల్ సిటీలో ఆదివారం 'డాక్‌సేవక్ సమ్మేళన్' జరగనున్నది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లను శనివారం ఎస్పీ వకుల్ జిందాల్, జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. హెలిప్యాడ్ వద్ద చేసిన భద్రత ఏర్పాట్లను పరిశీలించి, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సభా ప్రాంగణం, వేదిక, వీవీఐపీ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, డాక్‌సేవక్ ఉద్యోగుల సీటింగ్ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసి వాహన రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. జాతీయ రహదారి వెంబడి వ్యర్థాలను శుభ్రం చేయాలని కమిషనర్ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ ప్రాంగణం, బుడంపాడు వరకు సర్వీస్ రోడ్డులో తీసుకోవాల్సిన చర్యలపై పలు ఆదేశాలు జారీ చేశారు. పారిశుధ్య పనులు, ఆక్రమణల తొలగింపు, ప్యాచ్ వర్క్‌లు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు అబ్దుల్ అజీజ్, శ్రీనివాసులు, సీఐలు అళహరి శ్రీనివాస్, శివప్రసాద్, సీఐ వీరయ్యచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రియుడి వేధింపులకు యువతి మృతి

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రియుడి వేధింపులకు ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడేపల్లి పరిధిలోని పోలకంపాడు ప్రాంతంలో శుక్రవారం రాత్రి జరిగింది. తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి కథనం ప్రకారం.. స్థానికంగా నివాసం ఉండే పోలూరి మీనాక్షి (20) మంగళగిరిలోని ఓ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే కాలేజీలో చదివే రహీం అనే యువకుడితో పరిచయం ప్రేమగా మారి ఆరు నెలలపాటు కలిసి తిరిగారు. ఇద్దరికి మనస్పర్థలు రావడంతో విడిపోయారు. గతంలో కలిసి తిరిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానని రహీం కొద్ది రోజులుగా వేధింపులకు గురి చేస్తుండటంతో.. సదరు యువతి జరుగుతున్న పరిస్థితులను తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ఓదారుస్తూ వచ్చారు. ఈ క్రమంలో రోజులాగే పనులకు వెళ్లివచ్చి చూచేసరికి ఫ్యానుకు ఉరేసుకుని మీనాక్షి మృతి చెందినట్టు ఆమె తల్లి రమణమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఖాజావలి తెలిపారు.

వివాహితను బెదిరించి పలుమార్లు అత్యాచారం

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వివాహితను బెదిరించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై ఎస్సార్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లాకు చెందిన 28 ఏళ్ల మహిళ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తూ ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసిస్తుంది. ఎనిమిదేళ్ల క్రితం బాలానగర్‌లో సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వహించిన బంజారాహిల్స్‌కు చెందిన మల్లికార్జునరెడ్డి (50) వద్ద ఆమె ఉద్యోగం చేసింది. కొంతకాలానికి ఆ ఉద్యోగాన్ని వదిలి, అనంతరం వేరొకరిని వివాహం చేసుకుంది. 2024లో మల్లికార్జునరెడ్డి బాధితురాలిని మళ్లీ సంప్రదించాడు. పాత పరిచయంతో ఆమెను మధురానగర్‌లోని తన నివాసానికి రప్పించుకున్నాడు. అక్కడ తన వద్ద ఉన్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తానని బెదిరించి, శారీరకంగా కలవాలని ఒత్తిడి చేశాడు. మధురానగర్, తిరుపతి తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి బెదిరింపులకు పాల్పడి పలుమార్లు అత్యాచారం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల బాధితురాలు గర్భం దాల్చగా, గర్భస్రావం చేయించుకోవాలని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీంతో బాధితురాలు తన స్నేహితురాలి సాయంతో కొంగను, ఎస్సార్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది. ఎస్‌ఆర్ నగర్ పోలీసులు మల్లికార్జునరెడ్డిపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

వేంకటేశ్వరుడిని రాజకీయాంశం చేయడం మహాపాపం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని తమ రాజకీయ అంశంగా వాడుకోవాలని ఆలోచన వైసీపీకి రావడం మహా పాపమని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శాసన మండలిలో వైసీపీ సభ్యులు చేసిన మహాపచారానికి ప్రాయశ్చిత్తంగా శనివారం పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన శుద్ధి, సంప్రోక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కూటమి నాయకులతో కలిసి ఆలయాన్ని శుద్ధి చేసిన అనంతరం స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నందుకుతోనే వైసీపీ మండలిలో అలా వ్యవహరించిందని విమర్శించారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించిన అంశంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుండగా కుతంత్రంతోనే దేవుడితో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

శ్రీరామ సైనిక్ స్కూల్‌కు అధికారిక గుర్తింపు

● డైరెక్టర్ తులసీ విష్ణుప్రసాద్

కొల్లూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ సైనిక్ స్కూల్‌కు భారత రక్షణ శాఖ నుంచి అధికారిక గుర్తింపు లభించినట్టు స్కూల్ డైరెక్టర్ తులసీ విష్ణుప్రసాద్ శనివారం తెలిపారు. చిలుమూరులోని స్కూల్‌లో ఆయన మాట్లాడుతూ.. 2026-27 విద్యా సంవత్సరంలో ఆలిండియా సైనిక్ స్కూల్ అడ్మిషన్ కౌన్సిలింగ్ ద్వారా తమ స్కూల్ ఎంపికైనట్లు చెప్పారు. భారత ప్రభుత్వ నిర్ణయం మేరకు ప్రైవేట్, పబ్లిక్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో దేశ వ్యాప్తంగా ఎంపికైన 79 సైనిక్ స్కూల్స్‌లో శ్రీరామ ఒకటిగా నిలవడం గర్వకారణమన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఆధీనంలో కోరుకొండ, కలికిరి సైనిక్‌స్కూల్స్ ఇప్పటికే సేవలు అందిస్తున్నాయన్నారు. పాఠశాల అభివృద్ధిలో భాగంగా అదనంగా ఒక సైనిక్ భవనం (సేన భవన్), ఆధునిక సదుపాయాలతో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీకాంత్ వెల్లడించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాంట్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కేజీ)	128, 137, 148
చికెన్ విత్ స్కిన్(కేజీ)	240.00
చికెన్ స్కిన్ లెస్(కేజీ)	250.00

28 వరకు మెడికల్ ఎగ్జిబిషన్ పొడిగింపు

● జీఎంసీ ప్రిన్సిపాల్ ఎన్వీ సుందరాచారి

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల తర్వాత గుంటూరు వైద్య కళాశాలలో నిర్వహిస్తున్న మెడికల్ ఎగ్జిబిషన్ మెడ్ ఫ్యూజన్-26కు ప్రజలు, పాఠశాలల యాజమాన్యాల నుంచి వస్తున్న విశేష స్పందన మేరకు ఫిబ్రవరి 28 వరకు పొడిగిస్తున్నట్లు జీఎంసీ ప్రిన్సిపాల్ ఎన్వీ సుందరాచారి శనివారం తెలిపారు. ఆదివారంతో ఎగ్జిబిషన్ ముగుస్తుందని, వివిధ వర్గాల నుంచి అందుతున్న వినతుల నేపథ్యంలో చివరగా ఈ నెలాఖరు వరకు ఎగ్జిబిషన్‌ను కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇకపై పొడిగింపు సాధ్యం కాదని వెల్లడించారు. ఈ అవకాశం వినియోగించుకొని విద్యార్థులు, ప్రజలు ఎగ్జిబిషన్ సందర్శించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఏఎన్‌యూలో యువజన మార్పిడి సమ్మేళనం

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ గొప్పదనం అని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఉప కులపతి కె.గంగాధరరావు అన్నారు. కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ, మై భారత్ కేంద్రం ఆధ్వర్యంలో 5 రోజుల అంతర్‌రాష్ట్రీయ యువజన మార్పిడి సమ్మేళనం 2వ దశ ఎన్ఎస్ఎస్ భవన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా శనివారం ప్రారంభమైంది. ఒడిశాలోని ఐదు జిల్లాలు సంబల్పూర్, బార్గర్, కలహండి, బోలాంగిర్, బాలాసోర్ నుంచి మొత్తం 37 మంది యువతీ యువకులు పాల్గొన్నారు. ఈ సమ్మేళనంలో సంస్కృతి, ఉపాధి అవకాశాలు, సాంకేతికత పై పరస్పర జ్ఞానాన్ని పంచుకోవడం, ప్రాంతీయ జానపదనృత్య ప్రదర్శనలు, క్షేత్రస్థాయి సందర్శనలు వంటి కార్యక్రమాలు జరుగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. భారత్ ఉపసంచాలకులు కిరణ్మయిదేవిరెడ్డి తెలిపారు. ప్రొఫెసర్ గంగాధరరావు మాట్లాడుతూ దేశ ప్రజల మధ్య సాంప్రదాయకంగా ఉన్న భావోద్వేగ బంధాలను బలోపేతంగా కొనసాగించడం ఇటువంటి యువ సమ్మేళనాల ద్వారా సాధ్యమవుతుందని తెలిపారు. రెక్టార్ ప్రొఫెసర్ శివరామప్రసాద్ రామినేని, మై భారత్ రాష్ట్ర సంచాలకులు అంశుమాన్ ప్రసాద్‌దాస్ మాట్లాడుతూ మై భారత్ కేంద్రాల ద్వారా 2025-26లో రెండు దశల్లో 90 అంతర్ రాష్ట్ర యువజన మార్పిడి సమ్మేళనాలు నిర్వహిస్తున్నామన్నారు. రిజిస్ట్రార్ జి.సింహాచలం, ఓఎస్డీ ఆర్‌విఎస్ఎస్ రవికుమార్, ప్రొఫెసర్ పి విద్యాదేవమూర్తి గౌరవ అతిథులుగా పాల్గొని, ప్రసంగించారు. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో యువత అలరించింది.

యజ్ఞంలా జనసేన సభ్యత్వ నమోదు

● పార్టీ శ్రేణులకు ఎమ్మెల్సీ హరిప్రసాద్ పిలుపు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ సభ్యత్వ నమోదు.. పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఉన్నత ఆలోచనలు, మహోన్నత ఆశయాలతో నిండిన యజ్ఞమని, పార్టీ సిద్ధాంతాలు, భావజాలం నమ్మిన ప్రతి ఒక్క జన సైనికుడు, వీర మహిళ సభ్యత్వ నమోదును విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని శాసన మండలి ప్రభుత్వ విప్, పవన్ కల్యాణ్ రాజకీయ కార్యదర్శి పిడుగు హరిప్రసాద్ పిలుపునిచ్చారు. జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియకు జిల్లా సమన్వయకర్తగా పార్టీ అధిష్ఠానం శనివారం ఆయనను నియమించింది. ఈ సందర్భంగా శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పిడుగు హరిప్రసాద్ జిల్లా నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో జనసేనకు 12.60 లక్షల మంది సభ్యులు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ సభ్యత్వ నమోదు డ్రైవ్‌లో 25 లక్షల మందిని సభ్యులుగా చేర్చాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. పాత సభ్యత్వ రెన్యువల్స్‌తో పాటు కొత్త సభ్యులను చేర్చడం కీలకమన్నారు. ముఖ్యంగా జెన్ జీని పార్టీకి దగ్గర చేయాలని, ఇది భవిష్యత్తు రాజకీయాలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గతంలో ప్రతి నియోజకవర్గం నుంచి పార్టీ నియమించిన ఇన్‌ఛార్జ్‌లు మాత్రమే బాధ్యతలు ఉండేవని, పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గాల్లో ఉన్నటువంటి ఇతర నాయకులు కూడా సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. సభ్యత్వం స్వీకరించే ఉద్యమంలా చేసే సాధకులను ప్రతినియోజకవర్గం నుంచి 75 నుంచి 100 మందిని ఎంపిక చేయాలని భావిస్తున్నట్లు ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ వెల్లడించారు.

అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్..ఉపాధ్యాయుడి ఎంపిక

పొన్నూరు, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ కార్యక్రమానికి శ్రీరామ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జె.వెంకటేశ్వరరావు, ఐదవ తరగతి విద్యార్థులు ఎన్ యశశ్విని, పి.సాయి, శ్రీనిధి, శ్రీ మణికంఠ, సంజీవ్ ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కోడింగ్, క్రిటికల్ థింకింగ్ తదితర అంశాలను నేర్చుకోవడానికి అమెజాన్ సంస్థ పాఠశాలకు ల్యాప్‌టాప్‌ను బహూకరించింది. విద్యార్థుల్లో నూతన సాంకేతికను అందిపుచ్చుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయోపడుతుందని ఎంఈవో కె.విజయభాస్కర్ అభినందించారు.

వైఎస్సార్ అనే పేరుకు చట్టబద్ధత లేదు

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ రాజశేఖర్‌రెడ్డి అనే పేరుకు ప్రభుత్వం, ఏఐసీటీఈ తరపు నుంచి చట్టబద్ధత లేదని ఏఎన్‌యూ వీసీ కె.గంగాధరరావు స్పష్టం చేశారు. శనివారం పొన్నూరు వైసీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ.. వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలకు వైఎస్సార్ పేరు తొలగింపుపై ప్రశ్నించిన నేపథ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు. ఏ ప్రభుత్వ విద్యా సంస్థలోనైనా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల అనే ఉంటుందన్నారు. కొన్ని ప్రైవేటు సంస్థలకు వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు ఉండటంతో ఏది ప్రభుత్వ కాలేజీ, ఏది ప్రైవేట్ కాలేజీ అన్నది అభ్యర్థులకు తెలియడం లేదన్నారు. సదరు పేరును ఏఐసీటీఈ... సంబంధిత నియంత్రణ సంస్థలు ధృవీకరించలేదన్నారు. విద్యార్హత, డిగ్రీల ప్రామాణికత, ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్యా ప్రవేశాలపై పేరు తొలగింపు ఎలాంటి ప్రభావం చూపదన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో శనివారం మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యూనిట్ మూడు, ఐదు, ఆరో యూనిట్‌ల ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సునీత, డాక్టర్ రాధిక, డాక్టర్ సుమలత పర్యవేక్షించారు. కాజా వలంటీర్లతో అవగాహన నిర్వహించారు. డ్రగ్స్‌కు నో చెప్పండి.. అంటూ నినాదాల చేశారు. మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై సామాజిక నాటికను ప్రదర్శించారు.

27, 28న జాతీయ సదస్సు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శనివారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిషన్ లెర్నింగ్ ఇన్ ఫార్మా కల్చర్ సైన్స్ సదస్సు గోడపత్రికను వీసీ కె.గంగాధరరావు, రెక్టార్ శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం ఆవిష్కరించారు. ఈ అవగాహన సదస్సు ఈ నెల 27, 28 తేదీల్లో జరుగుతుంది. రీసెర్చ్ సెల్ కో- ఆర్డినేటర్ సుధాకర్, సెమినార్ డైరెక్టర్ డాక్టర్ కె.సుజన పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో తాత్కాలిక ఉద్యోగాలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయంలో తాత్కాలిక ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. పీజీటీ హిందీ, ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయాలజీ, టీజీటీ హిందీ, ఇంగ్లీష్, సంస్కృతం, సోషల్, మ్యాథ్స్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. స్టాఫ్ నర్స్, స్పోర్ట్స్ కోచ్, కౌన్సిలర్, ఒకేషనల్ ల్యాబ్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ నెల 2026-27 విద్యా సంవత్సరంలో ఎంపికైన అభ్యర్థులు పనిచేయాలని, దరఖాస్తుతో పాటు సర్టిఫికెట్లు అందజేయాలన్నారు. వివరాలకు కేంద్రీయ విద్యాలయం వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

నేడు నేతన్నల చలో మంగళగిరి

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులు పోరుబాట పట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నేతన్నలంతా చలో మంగళగిరి అంటూ ఆదివారం మంగళగిరిబాట పట్టనున్నారు. చేనేతలకు కేంద్ర బడ్జెట్‌లో రూ. 25వేల కోట్లు, రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 2వేల కోట్లు కేటాయించాలని, అన్నదాత సుఖీభవ పథకం మాదిరిగానే.. చేనేతకు ఏటా రూ. 25వేలు ఇచ్చి భరోసా ఇవ్వాలని కోరుతున్నారు. ఉచిత విద్యుత్ పథకాన్ని తక్షణం అమలు చేసి, చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని రద్దు చేయాలని కోరుతున్నారు. ఈ మేరకు గత జనవరి 4న విజయవాడలో జరిగిన చేనేతల రౌండ్ టేబుల్ సమావేశంలో చలో మంగళగిరి కార్యక్రమం నిర్ణయించారు. నేతన్న సర్కిల్ వద్ద ఆందోళన చేయాలని తీర్మానించారు. 15 చేనేత కార్మిక సంఘాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేసుకుని 'మహా ధర్నా'కు పిలుపునిచ్చారు.



జిల్లా జైలులో పర్యటిస్తున్న కలెక్టర్, వివిధ శాఖల అధికారులు

ఖైదీల కుల, మతాలు ప్రస్తావించరాదు

● నాణ్యమైన ఆహారం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి

● జిల్లా జైలును తనిఖీ చేసిన కలెక్టర్, అధికారుల బృందం

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఖైదీల కుల, మతాలు అడగరాదని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం జిల్లా న్యాయమూర్తి కల్యాణ్ చక్రవర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) ప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన 7 మంది జిల్లా స్థాయి అధికారులు, సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఏర్పాటు చేసిన బోర్డ్ ఆఫ్ విజిటర్స్ సభ్యులుగా జిల్లా జైలు అధికారిక తనిఖీ, పర్యవేక్షణ నిర్వహించారు. జిల్లా న్యాయమూర్తి, కలెక్టర్ ఖైదీలతో నేరుగా పరస్పర చర్చలు జరిపి వారి అభిప్రాయాలు, అభ్యర్థనలు, సూచనలు నమోదు చేసుకున్నారు. జిల్లా జైలు సూప రింటెండెంట్ ఎ.బి. కాంతరాజ్ మాట్లాడుతూ, జైలులో ఖైదీల సంక్షే మాన్ని పరిరక్షించుటకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ అధికారుల బృందంలో జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, కర్మాగారాల శాఖాధికారి, జిల్లా వ్యవసాయశాఖాధికారి, పీడబ్ల్యూడీ ఇంజనీర్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



హోమ్ కంపోస్ట్‌ని ప్రారంభిస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర, పక్కన కమిషనర్ తదితరులు

హోమ్ కంపోస్టు తయారీని ప్రోత్సహిస్తాం

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరుకార్పొరేషన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రతి రోజు ఉత్పత్తి అయ్యే వ్యర్థాల సమగ్ర నిర్వహణకు క్లస్టర్, హోమ్ కంపోస్ట్ తయారీని ప్రోత్సహిస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో 'జీరో లిట్టర్ గవర్నెన్స్' థీమ్‌లో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కమిషనర్ కె.మయూర్ అశోక్, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి శనివారం స్థానిక ఉద్యోగ నగర్ సచివాల యంలో క్లస్టర్ కంపోస్ట్ యూనిట్ ప్రారంభం, హోమ్ కంపోస్ట్ తయా రీ ద్వారా కిచెన్ గార్డెన్ చేస్తున్న గృహాల పరిశీలన, విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. మేయర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి వచ్చే వ్యర్థాలను కంపోస్ట్‌గా మార్చుకొని, కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేసుకో వడం ద్వారా చెత్త సమస్యకు పరిష్కారంతో పాటు ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవచ్చని అన్నారు. కమిషనర్ స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేసి మాట్లాడుతూ విద్యార్థులు చేతుల శుభ్రతను పాటించడం ద్వారా అనే క వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. సీఎంఓ హెచ్ డాక్టర్ శాంతికళ, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ వర్సిటీలో ఘనంగా థింక్‌క్యూబేటర్ ఎక్స్‌పర్ట్ మీట్



మాట్లాడుతున్న శ్రేయశేఖర్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలోని డీన్ ఏపీఏ ఎఫ్ఏ కార్యాలయం, విజ్ఞాన్స్ టీబీఐ కౌన్సిల్, ఈ సెల్ సంయుక్త ఆధ్వ ర్యంలో నాస్కామ్ ఫౌండేషన్, సిస్కో ఆర్థిక సౌజన్యంతో కోహోర్ట్-9 కోసం నిర్వహించిన 'థింక్ క్యూబేటర్ ఎక్స్‌పర్ట్ మీట్' ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో సామాజిక ఆవిష్కరణలను పెంపొందించి, ప్రారంభ దశ ఆలోచనలను సమాజానికి ఉపయోగపడే పరిష్కారాలుగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాస్కామ్ ఫౌండేషన్ సోషల్ ఇన్నోవేషన్ పర్ యూత్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ శ్రేయ శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు లభించే అవకాశాలు, ఎంపిక విధానం, ప్రాజెక్ట్ అభివృద్ధి దశలు తదితర అంశాలను వివరించారు. విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో సామాజిక సమస్యలకు పరిష్కారాలుగా మలచుకోవాలని సూచించారు. సిస్కో సిస్టమ్స్, నాస్కామ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న థింక్‌క్యూబేటర్ ప్రోగ్రామ్ దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన విద్యార్థి ఆవిష్కర్తలను గుర్తించి ప్రోత్సహించే లక్ష్యంతో రూపొందించబడిందన్నారు.

గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో ఆర్వీఆర్ అండ్ జేసీ విద్యార్థినులు



సీఎం చంద్రబాబు నాయుడుతో విద్యార్థినులు నేహా, రాఫియా

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు నేహా, రాఫియా తదితరులు ఐటీ దిగ్గజాలతో ముఖాముఖిలో మాట్లాడి నట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖాముఖిలో ఆధునిక టెక్నాలజీపై అవగాహన కల్పించిన విద్యార్థినులను సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారని వెల్లడించారు. ఢిల్లీలో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు గ్లోబల్ ఏఐ సమ్మిట్ నిర్వహించిన విషయం తెలిసిందే. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు అభినందించారు.

మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రొఫెసర్ వి.కన్నన్ తదితరులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ మ్యాథమెటిక్స్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ పోటీల్లో విజేతలకు శనివారం ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.కన్నన్ విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలకు గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రాలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి సిల్వర్ మెడల్, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంటీఏ జాయింట్ సెక్రటరీ ఉదేదుల, ఏపీఎంటీ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనాథ్, సెక్రటరీ అనిల్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్స్, పాతనేరస్తులపై నిఘా

● రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

● నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్



నేర సమీక్షా సమావేశంలో అధికారులకు ఆదేశాలిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్లు.. పాతనేర స్తులు.. డ్రగ్స్ కేసుల్లో నిందితులపై నిఘా ఉంచాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ వకుల్ జిందాల్ జనవరి నెల "నేర సమీక్ష సమావేశం" నిర్వహించారు. జిల్లాలోని శాంతి భద్రతల పరిరక్షణ, పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ పురోగతి, రోడ్డు ప్రమాదాలు, మాదక ద్రవ్యాల నివారణ చర్యలు, రౌడీషీటర్లు, ఇతర నేరస్తులపై తీసుకుంటున్న చర్యలు, పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారం, రాత్రి, పగలు గస్తీలపై ప్రజలకు పోలీస్ అధికారులు, సిబ్బంది అందిస్తున్న సేవలు మొదలగు పలు అంశాల గురించి సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ జీజీహెచ్‌లో వచ్చే ప్రజల ఫిర్యాదులకు సత్వర న్యాయాన్ని పరిష్కార చర్యలు చూపించాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లను పిలిపించి, బైండోవర్ చేయించాలని, ప్రతి ఒక్కరూ బైండోవర్ అయ్యే విధంగా చూసుకోవాలని, వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. పలు నేరాలను ఛేదించడంలో, పలు కేసులను సమగ్రంగా దర్యాప్తు చేయటంలో, శాంతి భద్రతల సమాచారాన్ని సేకరించడంలో, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని కనిపెట్టడంలో విశేష ప్రతిభ కనబరచిన 15 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలు అందించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు రవికుమార్, హనుమంతు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల కోటేశ్వర స్వామి తిరునాళ్ల బందోబస్తు విజయవంతం

● ఎస్పీని సన్మానించిన ఆలయ కమిటీ అధికారులు

ఇటీవల అత్యంత వైభవంగా జరిగిన బాల కోటేశ్వరస్వామి (క్వారీ) తిరునాళ్ళ విజయవంతమైందని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. తిరు నాళ్ల ఉత్సవాలకు సంబంధించి, అత్యుత్తమ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించినందుకు ఎస్పీ వకుల్ జిందాల్‌ని దేవస్థాన అధికారులు, పోలీసు అధికారులు కలిసి ఘనంగా సన్మానించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఏఓ) నరసింహారావు, చేబ్రోలు ఈఓ వినాయక కృష్ణ, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, అర్చకులు కృష్ణమూర్తి ఎస్పీని కలిసి వేద మంత్రోచ్చారణల ఎస్పీకి శాలువా కప్పి, ఘనంగా సన్మానం చేసి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులతో పాటు క్షేత్రస్థాయిలో బందోబ స్తును పర్యవేక్షించిన తెనాలి డీఎస్పీ జనార్ధనరావు, పొన్నూరు రూరల్ సీఐ, పొన్నూరు ఎస్సై పి.వి. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన నేత్రాలే మనుగడకు ఆధారం

● వేద సీడ్స్ ఈడీ తులసీ ధర్మచరణ్ వెల్లడి

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన నేత్రాలే మానవాళి మనుగడకు మూలాధారమని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీ ధర్మచరణ్ తెలిపారు. అభయ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో మెడెక్స్ హాస్పిటల్ సహకారం రెడ్డిపాలెంలోని వేద సీడ్స్ కార్యా లయంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరం, రెటినా సమస్యలు, నీటికాసులు స్క్రీనింగ్ వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవడమే అభయ ఛారిటబుల్స్ ధ్యేయమని ధర్మచరణ్ తెలిపారు. వేద సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పీ.చంద్రశేఖర్ మాట్లాడుతూ నేత్ర పరిరక్షణపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలన్నారు. డాక్టర్ పొట్లూరి అపర్ణ మాట్లాడుతూ దృష్టి సంబంధిత ఆరోగ్య సమస్యలను అశ్రద్ధ చేయకుండా వైద్యనిపుణుల పర్యవేక్షణలో చికిత్సలు పొందాలని సూచించారు. డెంటల్ సర్జన్ డాక్టర్ కావ్యశ్రీ మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే దంత వైద్య సమస్యలను గుర్తించి చికిత్సలు తీసుకోవాలన్నారు. అభయ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు తులసీ ధర్మచరణ్, డాక్టర్ పి.చంద్రశేఖర్‌లు శిబిరాన్ని పర్యవేక్షించారు. శిబిరంలో భాగంగా పేద రోగులకు కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తులసి విశ్వంబర్, పీ ఉదయ్‌రాజ్, తాయి శ్రీనివాసరావు, గుడి సతీష్‌కుమార్, తోట రంగారావు, గాజుల సాయిరాం, టీ వెంకట్రావు, మంగిశెట్టి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న తులసీ ధర్మచరణ్

ప్రతిభావంతులైన విద్యార్థులకు నేడు ఉపకార వేతనాలు పంపిణీ



తులసీ యోగీష్‌చంద్ర

గుంటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): 'కృష్ణదేవ రాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ 'ఏపీ - కట్వా' (ఆంధ్ర ప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, బాపట్ల జిల్లా శాఖ) సంయుక్త ఆధ్వ ర్యంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 93 మంది పేద విద్యార్థులకు రూ.4 లక్షల 50 వేల రూపాయలు ఉపకార వేతనాలుగా పంపిణీ చేయను న్నట్లు తులసీ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ తులసీ యోగీష్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకార వేతనాలు పంపిణీ చేసే నిధుల్లో రూ.2 లక్షల 37వేల 500 తులసి సీడ్స్ వారు కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలెజ్డ్ ద్వారా పేద విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం బాపట్లలోని సూర్యకాళీకల్యాణ మండపంలో ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం పది గంటల కు ప్రారంభమౌతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తులసి గ్రూప్ ఛైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరై ఉపకార వేతనాలను వితరణ చేయనున్నట్లు తులసి యోగీష్‌చంద్ర తెలియజేశారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలకు జేకేసీ కళాశాల విద్యార్థుల ఎంపిక

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జేకేసీ కళాశాలలో గ్లోబల్ లాజిక్ లిమిటెడ్ (హైదరాబాద్)ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 19 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పీ గోపీచంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 92 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా బృంద చర్చ, ఆన్‌లైన్, పర్సనల్ పరీక్షలో 19 మంది ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థులను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు రాయపాటి శ్రీనివాస్, జాగర్లమూడి మురళీమోహన్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె సాంబశివరావు, ఉపాధి కల్పనాధికారి డాక్టర్ వై.సురేష్‌బాబు తదితరులు అభినందించారు.

ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌పై కాంగ్రెస్ చర్యలు హేయం

● బీజేపీ యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాయితి ప్రదీప్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తూ అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 లో యూత్ కాంగ్రెస్ చేసిన చర్యలు హేయమని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాయితి ప్రదీప్ మండిపడ్డారు. హిందు కళాశాల కూడలిలో శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఎదు ట వారు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమెరికా టారిఫ్‌ల విషయంలో అసత్య ప్రచారాలు చేస్తూ షర్ట్‌లు లేకుండా దేశ ప్రతిష్టను మంటగలిపే విధంగా కాంగ్రెస్ వ్యవహరిం చారని అన్నారు. ఈ నిరసనల్లో యశ్వంత్, శ్రీనివాస్, బి.ఎక్కాలసాయి, శశాంక్, గణ, ఆనంద్, దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాస్, ఈదర శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. కాగా నిరసనల్లో భాగంగా స్వల్ప ఉద్రిక్తతలు నెలకొన్నాయి. కాంగ్రెస్ పార్టీ వ్యతిరేఖ వైఖరిని నిరసిస్తూ ఆ పార్టీ జిల్లా కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సందర్భంలో రాళ్ల దాడుల జరిగాయి. ఇరు పార్టీల వారు ఒకరిపై ఒకరు రాళ్ల దాడులకు పాల్ప డ్డారు. పోలీసులు పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చారు.

వేడుకగా సీతారాముల కల్యాణం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతి నగర్, శ్రీ మారుతి దేవాలయ 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ సీతారాముల కల్యాణం వేడుకగా నిర్వహించారు. కార్యక్రమాల్ని కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్, సభ్యుడు కొరపాటి రామారావు పర్యవేక్షించారు.

● స్థానిక కృష్ణనగర్, ఒకటవ లైన్, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామి వారి 80వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం విశేష పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో హయగ్రీవ విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. కార్యక్రమంలో బొల్లేపల్లి సత్యనారా యణ, లంక విజయబాబు పాల్గొన్నారు. అనంతరం శ్రీదేవి, భూదేవి. సమేత శ్రీనివాసుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

నేటి నుంచి ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం జిల్లా యూనిట్ కార్యవర్గం ఎన్నికల ప్రక్రియ ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభమౌతుందని ఆ సంఘం నేత పాపారావు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు, ఎన్నికల అధికారి డీఎస్ కొండయ్య పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. ఆదివారం నామినేషన్ పత్రాల పంపిణీ, స్వీకరణ, పరిశీలన, పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటన, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు జరుగుతుందన్నారు. ఎన్నికలు అవసరమైతే మార్చి 1వ తేదీన ఉదయం 8 గంటల నుంచి 2 గంటల మధ్యన పోలింగ్, ఆ తర్వాత ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన జరుగుతుందన్నారు.

సంఘటిత పోరాటాలను బలోపేతం చేయాలి : ప్రసాదు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కార్మికోద్యమ సంఘటిత పోరాటాలను బలోపేతం చేయాల్సిన అవసరముందని విరసం సీనియర్ నాయకుడు సీఎస్సార్ ప్రసాదు అన్నారు. స్థానిక వసంతరాయపురం 5వ లైన్, కోల్పింగ్ సెంటర్, చర్చి ప్రాంగణంలో శనివారం కార్మికోద్యమ నాయకుడు పోట్లూరి ఆంథోని సంస్మరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మరణా నంతర జీవితం కొందరికి మాత్రమే ఉంటుందని ఆ విలువ, గౌరవం ఆంథోనీకి దక్కుతుందన్నారు. అమరుల, బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బొప్పూడి అంజమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రగతి శీల కార్మిక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి బి.కొండారెడ్డి, పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, పూర్వ విద్యార్థుల సంఘం రాష్ట్ర నాయకులు భరద్వాజ, తమలపాకుల సుబ్బారావు, రవిచంద్ర, కే.కృష్ణ, సురేష్, గంగాభవాని, బెన్‌హర్, కోలా నవజ్యోతి, పాటిబండ్ల కోటేశ్వరరావు, లక్ష్మి, ఎన్.పోతురాజు పాల్గొన్నారు.

బాలలు లక్ష్య సాధన దిశగా పయనించాలి

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : బాలలు చిన్నతనంలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధన దిశగా పయనించాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ గాయత్రిదేవి సూచించారు. అరండల్‌పేట 2/2 లోని హోటల్ వి - రాయల్ పార్క్‌లో చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్ - క్రాఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాలల పంచాయతీ బాలలతో ముఖా ముఖి కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమం క్రాఫ్ ప్రోగ్రామ్ డైరెక్టర్ ఈజీ. పి. ఫ్రాన్సిస్ తంబి ఆధ్వర్యంలో నిర్వహించారు. గాయత్రి దేవి తన ప్రసంగం కొనసాగిస్తూ గడిచిన నెలలలో నలు గురు బడి బయట ఉన్న బాలలను బడిలో జాయిన్ చేశామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సలీమ్‌బాషా మాట్లాడుతూ సమా జంలో అనాథలు, తల్లితండ్రులు లేనివారు అందరూ కూడా చాలా కష్టపడి చదువుకుంటూ ఉన్నారన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమం సాధికారత అధికారి పిపిజి ప్రసూన, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్ పర్సన్ ఆరోగ్య ప్రమీల ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ అధికారి (డి.సి.పి.ఓ) సీహెచ్ విజయకుమార్ డి.రోషన్ కుమార్, ఎ.పి ప్రో చైల్డ్ గ్రూప్, ఆంధ్రప్రదేశ్. జి.తిరుపతిరావు స్టేట్ కో-ఆర్డినేటర్. క్రాఫ్ జిల్లా కో- ఆర్డినేటర్స్ కె.సమీర్ కుమార్, జి . వెంకట్, సిబ్బంది జయరాజు, బ్యూలా, శిరీష్ పాల్గొన్నారు.

తెలుగుతల్లికి పుష్పాభిషేకం

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం శనివారం అరండల్ పేట పార్కులో నిర్వహించారు. పార్కులో గల తెలుగుతల్లి విగ్రహానికి ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్తమ్మ పుష్ప మాలవేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షులు బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని, కోశాధికారి నానా, శ్రీవశిష్ఠ సోమేపల్లి, సభ్యులు కొణతం నాగేశ్వరరావు, పుండరికాక్ష పార్కు బాధ్యులు పోలినేని నరసింహారావు, జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉప గ్రంథ పాలకురాలు కె. ఝాన్సీ లక్ష్మీ, వై.బ్రహ్మయ్య, జి.రాజేష్, ఫణి భూషణ్, జి. గురవయ్య సందర్శకులు పాల్గొని తెలుగుతల్లికి పుష్పాభిషేకం చేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బృందావన్ గార్డెన్స్ సెంటర్‌లో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఓ కారు దగ్ధమైంది. గార్డెన్స్ ప్రాంతానికి చెందిన ఆర్ కార్తీక్ తన కారులో వెళుతుండగా గార్డెన్స్ సెంటర్‌కు వచ్చే సరికి కారు ఇంజన్ నుంచి పొగలు వస్తుండటంతో ఆయన రోడ్డు మీదనే కారు ఆపి వెంటనే కిందకు దిగి ఫైర్ విభాగానికి ఫోన్ చేసారు. దీంతో ఏడీఎఫ్ఓ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని గ్యాస్‌ను ప్రయోగించి మంటలు అదుపు చేసారు. పక్కనే పెట్రోల్ బంకు ఉండటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఎటువంటి ప్రమాదం లేకపోవడంతో బాధితుడు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

హనుమాన్‌నగర్‌లో మహిళ అదృశ్యం

నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని చుట్టుగుంట హనుమా న్‌నగర్‌కు చెందిన చల్లా సత్యవతి (55) అదృశ్యమైంది. ఆమె తన కుమారుడుతో కలసి హనుమాన్ నగర్ రెండవ లైన్‌లో నివాసం ఉం టోంది. సత్యవతి ఈనెల 19న ఉదయం నుంచి కనిపించడం లేదు. కుమారుడు వెంకట్రావు శనివారం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

మసీద్ ఎదురు బార్ ఏర్పాటుపై నిరసన

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతిరోడ్డు, బండ్లమూడి గార్డెన్స్, అంబేద్కర్ నగర్‌లో మసీద్ ఎదుట ఏర్పాటు చేస్తున్న సత్య బార్ అండ్ రెస్టారెంట్‌ను అధికారులు అడ్డుకోవాలని అంబేద్కర్‌నగర్, మజీద్ ఎ మురాద్ సభ్యులు కోరారు. బార్ అండ్ రెస్టారెంట్ ఎదుట శనివారం ముస్లీంలు నిరసన చేపట్టారు. వారం క్రితం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేసామని స్పష్టం చేశారు. విద్యాసంస్థలకు, ప్రార్థన స్థలాలకు 100 మీటర్లకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ నిబంధనలు చెబుతున్నాయని, ఈ చట్టాల్ని ఉల్లంఘించి ఈ బార్‌ను ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నిరసనల్లో మజీద్ ఎ మురాద్ సభ్యులు షేక్ మొహ్మద్ వలీ, అబ్దుల్ గఫూర్, జిలాని, మస్తాన్‌వలీ, నాగూర్, హబీబుల్లాఖాన్, మిరావలీ, ఖాదర్‌వలీ, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్ల బాలుడిపై వీధి కుక్కల దాడి

● తీవ్ర గాయాలతో జీజీహెచ్‌కు తరలింపు

● పరామర్శించిన ఎమ్మెల్యే నసీర్ అహ్మద్



గాయపడిన బాలుడిని తిలకిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని నల్లచెరు వు ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంటకు ఫణీంద్రరెడ్డి అనే ఆరేళ్ల బాలుడిపై వీధి కుక్కలు గుంపుగా దాడి చేశాయి. బాలుడి తల, మెడ తదితర శరీర భాగాల్లో లోతైన గాయాలయ్యాయి. బాలుడి ఆర్తనాదాలు విని తల్లిదండ్రులు, స్థానికులు శునకాలను అడ్డుకొని తరి మారు. తీవ్రంగా గాయపడిన బాలుడిని చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రి క్యాజువాల్టీ విభాగానికి తెచ్చారు. గాయాల తీవ్రతను పరిశీలించిన వైద్యులు ముందస్తు జాగ్ర త్తగా వైద్యులు ఖరీదైన ఇమ్యునో గ్లోబిలిన్ మందులతో చికిత్సలు ప్రారంభిం చారు. విషయం తెలియడంతో శుక్రవారం అర్ధరాత్రి ఒకటిన్నర ప్రాంతంలో తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, వైసీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా తదితరులు ప్రభుత్వాస్పత్రికి వచ్చి బాలుడికి అందే వైద్య సేవలను పరిశీలించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలు సుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే నసీర్ కోరారు. బాలుడి తల్లి గౌతమి, తండ్రి శివారెడ్డికి ధైర్యం చెప్పారు. బాధిత కుటుం బానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్ తదితరులు బాలుడిని పరామర్శించారు. వీధి కుక్కల నియంత్రణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీధి కుక్కల దాడిలో గాయపడిన ఫణీంద్రరెడ్డికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని, ప్రస్తుతం బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు.

బాలుడికి మెరుగైన వైద్యం అందించాలి

● వైద్యులను ఆదేశించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నల్లచెరు వు ప్రాంతంలో 6 సంవత్సరాల ఫణీంద్రరెడ్డి అనే బాలుడిపై వీధి కుక్కలు దాడి చేయడం అత్యంత బాధాకరమని, ఆ బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి శనివారం వైద్యులను ఆదేశిం చారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పందించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసి బాలుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అక్కడి వైద్యులతో మాట్లాడి బాలుడికి అత్యుత్తమ వైద్యం అందించాలని, అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ నగరంలో వీధి కుక్కల సమస్యను నియంత్రించేందుకు సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు చేపట్టాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

హిందువుల మనోభావాలను దెబ్బతీసిన జగన్ క్షమాపణ చెప్పాలి



ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలను దెబ్బతీసినందుకు జగన్మోహన్‌రెడ్డి క్షమాపణ చెప్పాల్సని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి డిమాండ్ చేశారు. పశ్చిమ కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. శాసనమండలిలో వైసీపీ నేతలు ప్రదర్శించిన తీరు సభ్య సమాజం వ్యతిరేకిస్తున్నదని ఎమ్మెల్యే మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనమండలిలో (వైసీపీ) నేతలు వేంకటే శ్వరస్వామి ఫొటోలు చేతబట్టి, కాళ్లకు చెప్పులు, బూట్లు ధరించి నినాదాలు చేస్తూ సభలోకి రావ డం క్షమించరాని నేరమని అన్నారు. దేవుడిని కూడా రాజకీయాలకు వాడు కునే స్థాయికి వైసీపీ నేతలు దిగజారారని, హిందువుల మనోభావాల పట్ల మాజీ ముఖ్యమంత్రి జగన్‌కి గౌరవం లేదని, హిందువులను అవమానించి నందుకు జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ సూచించారు. స్థానిక అంజుమన్ పాఠశాలలో శనివారం ఆయన ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. ఆయన విద్యార్థులతో మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో మంత్రి నారా లోకేశ్ ఆలోచనా విధానంతో పేరెంట్స్- టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేశారని చెప్పారు. దీని ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి ప్రతి ఒక్కరినీ ముందంజలో నిలిపేందుకు వీలు కలిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు కల్పించారని తెలిపారు. విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే పాఠ్య పుస్తకాలు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. విద్యార్థులు ఇప్పటి నుంచి సమయపాలన పాటించాలని, సిలబస్‌ను ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. మంచి ర్యాంకులు సాధించాలన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నేతలు

మత కల్లోలాలు సృష్టించేలా జగన్ రెడ్డి చర్యలు

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి చర్యలు మత కల్లో లాలు సృష్టించేలా ఉన్నాయని కూటమి ముఖ్య నేతలు ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్యనేతలు పిల్లి మాణిక్యరావు, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, బోనబోయిన శ్రీనివాసయాదవ్, తిరుప తిరావు తదితర కూటమి ముఖ్యనేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ తిరుమల శ్రీవారిని, హిందువుల మనోభావాల్ని దెబ్బ తీసేవిధంగా జగన్ రెడ్డి చర్యలు ఉన్నాయన్నారు. మండలిలో స్పష్టంగా చెప్పులతో తిరుగుతున్న ఆధా రాలు ఉన్నప్పటికీ.. చెప్పులు వేయలేదని, శ్రీవారి పటాలను పట్టుకోలేదని బొత్స, మాధవరావు బుకాయించడం సిగ్గుచేటన్నారు. శ్రీవారి లడ్డుని కల్తీ చేయడం, దానికి హెరిటేజ్‌ని ఆపాదించడం హేయమన్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ శాసనమండలి, శాసనసభలోను చర్చిం చబోయే అంశాల గురించి ముందస్తు ప్రణాళిక ఉంటుందన్నారు. కానీ స్వామి వారిని అపవిత్రం చేయాలనేది వైసీపీ ముందస్తు కార్యాచరణలో భాగమేనన్నారు. శ్రీవారికి చేసిన అపచారానికి వైసీపీ నాయకులు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీని వాస్ యాదవ్ మాట్లాడుతూ కల్తీ నెయ్యి విషయంలో అంబటి రాంబాబు కులాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు మాట్లాడుతూ శాసనమండలిలో వైసీపీ సభ్యులు ప్రవర్తించిన తీరు దుర్మార్గమన్నారు. సమావేశంలో కంచర్ల శివరామయ్య, మధుసూదనరావు, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాష పరిరక్షణ బాధ్యత యువత తీసుకోవాలి

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సమాజ జీవన స్థితిగతులు మాతృభాషతో ముడిపడివున్నాయని, అమ్మ భాషతో పాటు ఎన్ని భాషలనైనా నేర్చుకోగల శక్తి యువతకు ఉందని ప్రముఖ రచయిత బండికల్లు జమదగ్ని అన్నారు. టీజేపీఎస్ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవంలో ఆయన మాట్లాడారు. జమదగ్ని మాట్లాడుతూ మాతృ భాష పరిరక్షణ ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి మేడిశెట్టి సుభద్రాకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ కామేశ్వరశాస్త్రి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

● ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ బలోపేతం ● రైతు సాధికార సంస్థ సీఈఓ రామారావు



స్టాల్‌ను పరిశీలిస్తున్న సీఈఓ రామారావు, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం సాధనలో భాగంగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ వేదికలు కల్పించాల్సిన అవసరం ఉందని రైతు సాధికార సంస్థ కార్యనిర్వహణ అధికారి రామారావు అన్నారు. ప్రకృతి వ్యవసాయం రైతుకు లాభదాయకంగా మారాలంటే ఉత్పత్తికి సరైన ధర, స్థిరమైన మార్కెట్ అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం కార్యక్రమంలో భాగంగా గుంటూరులో నిర్వహించిన కొనుగోలుదారులు- విక్రేతల అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి అధ్యక్షత వహించారు. సీఈఓ రామారావు మాట్లాడుతూ రసాయన వ్యవసాయం వల్ల వాతావరణంలో ఏర్పడుతున్న మార్పులను అధిగమించాలంటే ప్రకృతి వ్యవసాయమే శాశ్వత పరిష్కారమని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 12 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తున్నారని, జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ద్వారా మరో 6.25 లక్షల మంది రైతులు ఈ విధానంలోకి అడుగుపెడుతున్నారని వెల్లడించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన కొనుగోలుదారులు తమ అవసరాలను రైతులతో పంచుకుని ప్రత్యక్ష చర్చలు జరపడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను సరైన ధరకు కొనుగోలు చేసి విలువ జోడిస్తే రైతు- వ్యాపారి ఇద్దరూ అభివృద్ధి చెందుతారని నిర్వాహకులు పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ముళ్లపూడి పద్మావతి, సీనియర్ కన్సల్టెంట్ ప్రణవ్ భార్గవ్, మార్కెటింగ్ థీమాటిక్ లీడ్ వీసీ భీజేష్, చంద్రశేఖర్, రైతు నేస్తం ఫౌండేషన్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక సాంకేతికతతో మెదడు చికిత్స

● తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా నెక్ స్టెంట్ వినియోగం ● గుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్స్ వైద్యుల ఘనత



రోగి శ్రీనివాసరావుతో న్యూరో సైన్సెస్ వైద్య బృందం

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): న్యూరో వైద్య రంగంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారిగా నెక్ స్టెంట్ సాంకేతికతతో మెదడు ఎన్యురిజమ్ చికిత్సను గుంటూరులోని కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో విజయవంతంగా నిర్వహించినట్లు శనివారం ఆసుపత్రి వైద్య వర్గాలు వెల్లడించాయి. నెక్ స్టెంట్.. కాయిల్ అసిస్టెడ్ ఫ్లో డైవర్టర్ (ఎన్‌క్యూఎస్) నిటినాల్ మైక్రో బ్రైడెడ్ మెష్ పరికరం. దీన్ని సంక్లిష్టమైన నెక్ బైఫర్‌ఫికేషన్ ఎన్యురిజమ్ చికిత్సల్లో వినియోగించడం తెలంగాణ, ఏపీలో ఇదే తొలిసారని, మినిమల్ ఇన్వేజివ్ న్యూరో వైద్యసేవల్లో ఇది మరో ముందడుగుగా వారు అభివర్ణించారు. వివరాల్లోకి వెడితే గుంటూరుకు చెందిన వై శ్రీనివాసరావుకు మెదడులో రక్తనాళం ఉబ్బటం వల్ల రక్తస్రావం జరిగింది. బాధితుడిని కిమ్స్ శిఖర ఆసుపత్రికి తరలించగా, న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు వైద్యపరీక్షలు జరిపారు. రోగికి గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలు కూడా ఉన్నాయి. దీంతో శ్రీనివాసరావుకు క్లిష్టమైన ఎన్ఎఫ్‌క్యూ స్టెంట్ టెక్నిక్ ఉపయోగించి చికిత్సలు చేయాలని వైద్యులు సూచించగా, కుటుంబ సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం న్యూరాలజిస్ట్ డాక్టర్ సూరా ప్రదీప్‌కుమార్ రెడ్డి, న్యూరో ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ గొట్టిపాటి పుష్పక్ వెంకట్ చౌదరి, ఎనస్థటిస్ట్ డాక్టర్ కల్యాణ్ వైద్య బృందం విజయవంతంగా ఈ ప్రొసీజర్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట్ చౌదరి మాట్లాడుతూ మెదడు ధమనుల విభజన ప్రాంతంలో ఉన్న ఎన్యురిజమ్ (ఉబ్బిన మెదడు రక్తనాళం) సాధారణ కనిపించే స్థలం అయినప్పటికీ దాని వైడ్ నెక్ నిర్మాణం కారణంగా కాయిలింగ్ విధానంలో చికిత్సకు క్లిష్టంగా మారుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా నెక్ స్టెంట్ పరికరం వాడినట్లు తెలిపారు. నెక్ స్టెంట్ ఉపయోగించి ఎన్యురిజమ్ సురక్షితంగా మూసి వేసి చుట్టుపక్కల రక్తనాళాల్లో సహజ రక్తప్రవాహాన్ని కాపాడినట్లు డాక్టర్ వెంకట్ చౌదరి వెల్లడించారు. అరుదైన చికిత్సతో రోగి ప్రాణాలు కాపాడిన వైద్య బృందాన్ని కిమ్స్ హాస్పిటల్స్ మెడి కల్ సూపరింటెండెంట్ డాక్టర్ వినోద్, యూనిట్‌హెడ్ డాక్టర్ ఎన్‌వి హరికుమార్ అభినందించారు.



మిర్చియార్డులో పర్యటిస్తున్న చైర్మన్ కుర్రా అప్పారావు, పక్కన సెక్రటరి చంద్రిక

పారిశుధ్యం మెరుగుపరచాలి

● రైతులకు సకల సదుపాయాలు కల్పించాలి ● వారంలో మార్పు కనిపించాలి: మిర్చియార్డు చైర్మన్ కుర్రా అప్పారావు

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు నూతన చైర్మన్ కుర్రా అప్పారావు మిర్చియార్డులో శనివారం ఆకస్మికంగా పర్యటించారు. మధ్యాహ్నం ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ. చంద్రికతో కలిసి ఆయన యార్డు ప్రాంగణమంతా పరిశీలించారు. ఈ సందర్భంగా కొన్ని ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా మిర్చియార్డులో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అప్పటికప్పుడు కాంట్రాక్టర్‌ను పిలిపించి మాట్లాడారు. వారంలో మార్పు తీసుకురాకపోతే తానే ఒక బృందాన్ని పెట్టి యార్డు మొత్తాన్ని క్లీనింగ్ చేయిస్తానన్నారు. రైతులు విశ్రాంతి తీసుకొనే హాల్‌లో వసతులు మెరుగుపరచాలని సూచించారు. మూడు నాలుగు రోజుల్లో రైతులకు అల్పాహారం, భోజనం ప్రారంభించాలని, పెండింగ్‌లో ఉన్న టెండర్‌ని నిబంధనల మేరకు ఖరారు చేయాలని సెక్రటరీకి సూచించారు. మిర్చి తొడాలు ఎక్కడపడితే అక్కడ కుప్పలు పోస్తున్నారని, వాటన్నింటిని ప్రత్యేక వాహనాల ద్వారా సేకరించి సిమెంట్ కంపెనీల బాయిలర్స్‌కు తరలిస్తే రెవెన్యూ వస్తుందన్నారు. తాగునీటి సదుపాయాన్ని మరింతగా మెరుగుపరచాలన్నారు. యార్డుకు వచ్చిన రైతు ఎక్కడా ఇబ్బంది పడరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు అధికారి సుబ్రహ్మణ్యం, సభ్యులు పాల్గొన్నారు.

(5వ పేజీ తరువాయి)

ఉద్దేశంతో చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టామన్నారు. విశాఖ, గుంటూరులో చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్ల ద్వారా విద్యుత్ తయారు చేసేలా ప్రయత్నిస్తున్నా మన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో వినుకొండ రాష్ట్రంలో 8వ స్థానంలో నిలిచినందుకు అభినందనలు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా ఇంటింటి చెత్త సేకరణని 100 శాతం అమలు చేయాలన్నారు.

కోటప్పకొండ దద్దరిల్లేలా తిరునాళ్లు

పల్నాడు అంటే పౌరుషాల గడ్డ అని అలాంటిది గత ఆదివారం మహా శివరాత్రి రోజున కోటప్పకొండలో ప్రభల పండగని బాగా చేశారని చంద్రబాబు తెలిపారు. తాను అనుక్షణం తిరునాళ్ల ఏర్పాట్లను పర్యవేక్షించినట్లు చెప్పారు. కోటప్పకొండ దద్దరిల్లేలా తిరునాళ్లు నిర్వహించారని, భక్తులు కూడా లక్షల్లో తరలివచ్చారన్నారు.

పలువురికి సత్కారం..

స్వచ్ఛ రథసారథిగా దాచేపల్లికి చెందిన దుర్గారావు, వర్మీ కంపోస్టు తయారీలో ప్రతిభ చాటిన వినుకొండ సీతయ్యనగర్‌కు చెందిన ఎం.లక్ష్మీగోవిందమ్మను సీఎం అభినంచారు. సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంట్‌లో జాష్టి కృష్ణహరీష్, బిందుసేద్యంలో మేడిశెట్టి శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయంలో దారా ప్రకాశరావులను కూడా సత్కరించారు. 2025-26 స్వచ్ఛ సర్వేక్షణ్ ట్రోఫీ

స్వచ్ఛ.. సంకల్పం

ర్‌ని ఆవిష్కరించారు. అనంతరం వారి అనుభవాలను ముఖ్యమంత్రి సమక్షంలో ప్రజలకు తెలిపారు. ముఖ్యమంత్రితో వేదిక పంచుకునే అవకాశం ఇచ్చినందుకు అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛ రథం డ్రైవర్‌గా మారా

గతంలో ఆటోడ్రైవర్‌గా పనిచేసేవాడ్ని. సమాజానికి ఎంతోకొంత ఉపయోగపడాలన్న ఆకాంక్షతో స్వచ్ఛ రథం డ్రైవర్‌గా మారాను. కేటాయించిన స్వర్ణ గ్రామాలకు నిత్యం ఇద్దరు గ్రీన్ అంబాసిడర్లతో వెళ్లి ఇంటింటికి తిరిగి పనికిరాని వస్తువులను సేకరిస్తున్నాను. వాటికి బదులుగా ప్రజలకు కందిపప్పు, సబ్బులు, షాంపులు వంటివి ఇస్తున్నాం. దీంతో ప్రజలు చెత్తని బయట పడేయకుండా దాచి పెట్టి తమకు ఇస్తున్నారు.

-ఏ దుర్గారావు, దాచేపల్లి

వ్యర్థాలతో ఇంట్లోనే సాగు

డ్వాక్రా మహిళగా ఉంటూ హోం కంపోస్టు యూనిట్‌ని స్థాపించాను. కూడా ఇంట్లో ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలతో కంపోస్టు తయారు చేస్తున్నాను. వాటితో మిద్దెపై కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నాను. హోం కంపోస్టింగ్‌లో ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకున్నాను.

-గోవిందమ్మ

ప్రజల హర్షధ్వానాలు

● సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో పలుమార్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వినుకొండ ఎమ్మెల్యే ఆంజనేయులు పేర్లు ప్రస్తావించగానే సభకు హాజరైన వేలాదిమంది ప్రజలు హర్షధ్వానాలు చేశారు.

● అంబోతులు మాదిరిగా వైసీపీ వాళ్లు రెచ్చగొడుతున్నారని సీఎం అనగానే అంబటి అంటూ ప్రజలు ప్రతిస్పందించారు.

● తిరునామాలు పెట్టుకుని సభకు హాజరైన సమాచార ఉద్యోగి శ్రీనుని సీఎం చూసి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ వెంకటేశ్వరస్వామి అంటే అంత నమ్మకమన్నారు. తమ్ముడు తిరునామాలు పెట్టుకున్నాడు.. నేను చిన్నప్పుడు మా ఇంట్లో నుంచి చూస్తే కొండపై తిరునామాలు కనిపించేవని గుర్తు చేసుకున్నారు.

ఎమ్మెల్యే ఆంజనేయులు తన ప్రసంగంలో పట్టణ అభివృద్ధికి రూ.50 వేల కోట్లకు బదులు రూ.50 వేల కోట్లను మంజూరు చేయాలని కోరారు. ఆ మాట వినగానే అందరూ ఆశ్చర్యపోయారు. సీఎంవో కార్యదర్శి ప్రద్యుమ్న సూచనతో ఎమ్మెల్యే తన మాటను సరి చేసుకుని సారీ సార్ రూ.50 కోట్లు అనడంతో సీఎం చంద్రబాబు నాయుడు పడిపడి నవ్వారు.

పార్టీ శ్రేణులతో అధినేత..

టీడీపీ నాయకులు, కార్యకర్తలతో అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎమ్మెల్యే జీవీ ఎంత శాతం కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటున్నది, ఆయన పనితీరు రాష్ట్ర స్థాయిలో ఏ స్థానంలో ఉందనే వివరాలను ఆ సమావేశంలో చంద్రబాబు ప్రత్యేకంగా ప్రకటించారు. పార్టీకి కార్యకర్తల మాటే శిరోధార్యమని స్పష్టం చేశారు. ఎవరైనా రౌడీయిజం, గుండాయిజం చేస్తే 1995 నాటి చంద్రబాబును చూస్తారని చెప్పారు. సంక్షేమ పథకాల్లో దేశంలోనే రాష్ట్రం ముందుందని, పెన్షన్ల పంపిణీలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆదేశించారు. ఒక సీఎంగా తానే ప్రతీ నెల పెన్షన్ల పంపిణీ బాధ్యత తీసుకున్నప్పుడు కార్యకర్తలు తప్పనిసరిగా ఆచరించాలన్నారు. అనంతరం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఆస్పత్రిలో పిల్లల వార్డుకు వెళ్లి వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కాన్పుల పరిస్థితిపై ఆరా తీశారు.

సీఎం చంద్రబాబు అధ్యక్షతన ముగిసిన సీఆర్డీఏ సమావేశం



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

తుళ్లూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 58వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం శనివారం సాయంత్రం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగింది. అనంతరం సమావేశం తీసుకున్న నిర్ణయాలు గురించి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ వివరాలను మీడియాకు వెల్లడించారు. ల్యాండు ఎలాట్‌మెంట్‌లో గ్రూప్ ఆఫ్ మినిస్ట్రీస్ తీసుకున్న నిర్ణయాలకు అథారిటీ ఆమోదం తెలిపిందన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ సిబ్బంది క్వార్టర్స్‌కు స్థలాలను కేటాయించాలని సమావేశంలో బ్యాంక్ ప్రతినిధులు అడిగారు. అయితే ఈ విషయపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అలాగే అంతకుముందు కూడా కొన్ని బ్యాంకులు కార్యాలయాలకు రాజధానిలో స్థలాలను కేటాయించారు. ఆయా బ్యాంకుల ప్రతినిధులు కూడా తమ సిబ్బంది క్వార్టర్స్‌కు స్థలం కేటాయించాలని కోరినట్టు మంత్రి తెలిపారు. బీజేపీ కార్యాలయానికి తొలుత 2.8 ఎకరాలు కేటాయించగా, ప్రస్తుతం దానిని 1.43 ఎకరాలగా మార్చటం జరిగిందన్నారు. హైకోర్టు, అసెంబ్లీకి సంబంధించి ఎంపీపీ వర్క్స్‌కు సమావేశం అనుమతినిచ్చిందన్నారు. అమరావతిలో రోడ్లు, డ్రైన్లతో పాటు గ్రీన్ అండ్ బ్లూ డిజైన్లకు సంబంధించి చర్చ జరిగిందన్నారు. ఇతర ప్రదేశాలలో ఉన్న పార్కులపై అధ్యయనం చేయాలని ఏడీసీకి సమావేశం సూచిందన్నారు.

బిల్లుల చెల్లింపునకు గ్రీన్ సిగ్నల్

● 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై కీలక ఆదేశాలు

గుంటూరుసిటీ, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు, అభివృద్ధి కార్యక్రమాలకు ఊతమిచ్చేలా 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ రాష్ట్రంలోని జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వాహక అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు శనివారం ఆదేశాలు జారీ చేశారు. గతంలో విడుదల చేసిన మెమో నంబరు 3082065/2025 ద్వారా ఖర్చు చేయదగిన పనులను ప్రభుత్వం నిర్దేశించింది. ఈ ఆదేశాలు కొనసాగింపుగా మెమో నంబరు 3093506/2026 ద్వారా ఇప్పటికే పూర్తి చేసి, కొలతల పుస్తకాల్లో నమోదు చేసిన పనులకు కూడా 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించవచ్చని స్పష్టం చేసింది. ఈ ఆదేశాల ప్రకారం ఇప్పటికే పూర్తి చేసిన పనులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలి. తనిఖీ అధికారుల ద్వారా సంబంధిత వివరాలను పీఆర్ వన్ దరఖాస్తు వ్యవస్థలో తప్పనిసరిగా నమోదు చేయాలి. దాని తర్వాత మాత్రమే గ్రామ స్వరాజ్, ఆర్థిక నిర్వహణ వ్యవస్థలో బిల్లుల చెల్లింపులను ప్రాసెస్ చేయాలి. గ్రామాలను చెత్త గుట్టల రహితంగా మార్చడం, పారిశుధ్య కార్యక్రమాలను వేగవంతం చేయడం, ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షించడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి చేసిన పనులకు బిల్లుల చెల్లింపులు వేగవంతం కావడం ద్వారా గ్రామపంచాయతీల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, రాష్ట్ర కార్యదర్శి తరిమెల కృష్ణమోహన్ తదితరులు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మంగళగిరికి బ్రహ్మోత్సవ శోభ

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం బ్రహ్మోత్సవ శోభను సంతరించుకుంది. ఎగువ, దిగువ సన్నిధులు విద్యుద్దీపాలతో కాంతులీనుతున్నాయి. నృసింహుని తూర్పు రాజగోపురాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. దేవతామూర్తుల చిత్రపటాలతో విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. దిగువ సన్నిధిలోని ఆలయంలో ఆదివారం ఉదయం పెండ్లి కుమారుని ఉత్సవంతో బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి. ఈ నెల 23న రాత్రి ధ్వజారోహణం, 24 నుంచి ప్రధాన వాహన సేవలు ప్రారంభమవుతాయి. సాంస్కృతిక కార్యక్రమాల కోసం గాలిగోపురం ఎదురుగా గల కళా వేదికను సిద్ధం చేస్తున్నారు.

చంద్ర గ్రహణంతో స్వల్ప మార్పులు

మార్చి 3న చంద్ర గ్రహణం సందర్భంగా నృసింహుని బ్రహ్మోత్సవాల్లో.. ఆగమ శాస్త్రం పండితుల సూచనల మేరకు 2, 3 తేదీల్లో జరగనున్న పూజా కార్యక్రమాల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయని ఆలయ ఈవో కె.సునీల్‌కుమార్ తెలిపారు. 2న సాయంత్రం 6 గంటలకు సాయంకాల అర్చన, తీర్థగోష్ఠి, 7 గంటలకు స్వామివార్ల ఎదురుకోల ఉత్సవం, పది గంటలకు స్వామి కల్యాణ మండప ప్రవేశం, 12 గంటలకు కల్యాణ క్రతువు ప్రారంభం, 3వ తేదీ వేకువజామున 3 గంటలకు మాడవీధుల్లో శ్రీవారి గరుడోత్సవం, అనంతరం తీర్థపు బిందె, ప్రాతఃకాలార్చన, 5 గంటలకు బలిహరణ, తీర్థగోష్ఠి, 5:30 గంటలకు హరినివేదన, 6 గంటలకు స్వామి వారిని తిరుచ్చిపై అధిష్ఠింపజేయడం, 6:30 నుంచి గంటపాటు దివ్య రథంపై స్వామి దర్శన భాగ్యం కల్పించనున్నట్టు చెప్పారు. గ్రహణం సందర్భంగా ఉదయం 9 గంటలకు ఎగువ, దిగువ సన్నిధులకు ద్వార బంధనం చేయడం జరుగుతుందన్నారు.



దిగువ సన్నిధిలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణలు

హౌస్‌బోట్ నిర్మాణ పనులు ప్రారంభం

● భూమిపూజలో పాల్గొన్న టూరిజం కార్పొరేషన్ చైర్మన్

బాపట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హైదర్‌పేట గ్రామంలో నల్లమడ డ్రెయిన్ పక్కనే హౌస్‌బోట్ తయారీ కేంద్రాన్ని శనివారం లాంచనంగా ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజి ముఖ్య అతిథిగా పాల్గొని భూమి పూజ చేసి, పనులు ప్రారంభించారు. ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న బాపట్ల ప్రాంతంలో హౌస్‌బోట్ షికారు పర్యాటకులను మరెంతగానో ఆకర్షిస్తుందన్నారు. ఉన్నత ప్రమాణాలతో రూ.15 కోట్లు వెచ్చించి రెండు హౌస్‌బోట్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సూర్యలంక తీరంలోని ఆదర్శనగర్ వద్ద పేరలి డ్రెయిన్ నుంచి హౌస్‌బోట్ ప్రారంభమై నిజాంపట్నం వెళ్లి తిరిగి వస్తుందన్నారు. ఈ లగ్జరీబోటులో 6బెడ్‌రూంలు, ఒక కాన్ఫరెన్స్ హాలు ఉంటుందన్నారు. అప్పర్ డెక్‌లో 100మంది ప్రయాణించవచ్చన్నారు. ప్రీమియం హౌస్‌బోట్‌లో లవర్‌డెక్ బెడ్‌రూమ్‌లు రెండు, అప్పర్ డెక్‌లో 25మంది కెపాసిటీతో ఉంటుందన్నారు. ఇందులో పార్టీ హాలు కూడా ఉంటుందని తెలిపారు. ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా, వాటర్ ఫ్లీట్ జీఎం సీహెచ్. నాంచారయ్య, టూరిజం డీవీఎం కృష్ణచైతన్య, ఇరిగేషన్ ఏఈ భరద్వాజ్, సీఈవో వి.రమేష్, పాండురంగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బాపట్ల మండలం హైదర్‌పేటలో హౌస్ బోటింగ్ తయారీ కేంద్రం శంకుస్థాపన చేసిన టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్డీవో పీగ్లోరియా తదితరులు

ఓటమి గెలుపునకు పునాది

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఓటమి గెలుపునకు పునాది అని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులు నుంచి జరుగుతున్న జాతీయ స్థాయి చలపతి ఉద్ఘోష్ 2కె 26 పోటీలు శనివారంతో ముగిసాయి. ముగింపు సభలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్తుపై స్పష్టమైన అవగాహన, ప్రణాళికా ప్రకారం కృషి చేస్తే ఏ రంగంలోనైనా.. విజయం సాధించవచ్చన్నారు. ఓడితే నిరుత్సాహ పడొద్దని, ఉత్సాహంగా సాధన చేస్తే గెలుపు వశమవుతుందని పేర్కొన్నారు. కలలు కనాలని.. ఆ కలలు సాకారానికి కృషి చేయాలని సూచిం చారు. గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి చలపతి విద్యా సంస్థల కృషి అభినందనీయమ అన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచి లక్ష్యాలను నిర్దేశించుకుని.. ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ఏఐను శాసించే స్థాయికి విద్యార్థులు చేరుకో వాలని సూచించారు. మిర్చియార్డు చైర్మన్ కుర్రా అప్పారావు మాట్లాడుతూ పోటీలలో గెలుపు ఓటములు సహజమన్నారు. విద్యా ర్థులు తమ విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెండు రోజుల పాటు జరిగిన సాంకేతిక, క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు, మెమెంటో, ప్రశంసా పత్రాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ.ఆంజనేయులు, సెక్రటరీ సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ కె.నాగశ్రీనివాసరావు, చలపతి సొసైటీ సభ్యులు జి.సుబ్బారావు, కె.కిరణ్‌కుమార్, పి.రత్నబాబు, జీ.రామచంద్రరావు, వివిధ శాఖాధిపతులు, అధ్యాపకులు, వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు



చలపతి ఉద్ఘోష్ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, మేయర్ కోవెలమూడి రవీంద్ర, మిర్చియార్డు చైర్మన్ కుర్రా అప్పారావు

క్లైమాక్స్ సాంగ్ రాసి చచ్చిపోయినా పర్వాలేదు





తెలుగులో ఒకప్పుడు సినిమా నవలలు వచ్చేవి. టీవీలు, మొబైల్స్, ఇంటర్నెట్ వంటివి ఇంకా రాకపోవటం వల్ల ఈ నవలలకు మంచి ఆదరణ ఉండేది. అలాంటి ఒక నవలే- ప్రముఖ దర్శకుడు వంశీ రాసిన 'శంకరాభరణం'. ఈ సినిమా దర్శకత్వ శాఖలో పనిచేసిన వంశీ- మొత్తం కథను నవల రూపంలోకి మార్చారు. రెండున్నర గంటల సినిమాకు వంద పేజీల ప్రతిరూపం ఈ పుస్తకం. దీనిలోనే ఈ సినిమా తీసే సమయంలో తెర వెనుక జరిగిన అనేక ఆసక్తికరమైన సన్నివేశాలను కూడా పాఠకులకు అందించారు. ఈ పుస్తకాన్ని ఈ నెల 18వ తేదీన కె. విశ్వనాథ్ జయంతి సందర్భంగా ఆవిష్కరించారు. ఆ పుస్తకంలో ఒక ఆసక్తికరమైన భాగం మీ కోసం..

"అన్ని పాటలూ ముందే రికార్డు చేసినా ఒక్క క్లైమాక్స్ సాంగ్ మాత్రం తర్వాత చేద్దాం అని వదిలేశారు. దానికి కారణం మహదేవన్ ఇచ్చిన డేట్స్ చాలకనే. ఆ పాట చాలా గొప్పగా రావాలి అన్నారు డైరక్టర్ గారు. నిజంగా అది అద్భుతంగా రాయాలి అనుకున్నారు వేటూరి. ఆ- గగుర్పొడిచే సిట్యుయేషన్‌కి గొప్ప ట్యూన్ ఇవ్వాలని యోచించారు మహదేవన్. ఇవన్నీ జరగాలంటే మంచి టైమ్ కావాలి. అందుకే ఆ పాట తరువాత చేద్దాం అనుకున్నారు. ఆఖరి షెడ్యూల్ టైము దగ్గర పడింది. ఆ షెడ్యూల్‌లోనే పాట తియాలి. కానీ వేటూరిగారికి హెల్త్ కండిషన్ బాగోక విజయా హాస్పిటల్ డీలక్స్ వార్డులో అడ్మిట్ చేశారు. వారం రోజుల్లో ఆయన శారీరక పరిస్థితి కాస్త బాగు పడింది. అయినా డాక్టర్లు ఆయన్ని కదలవద్దని కండిషన్ పెట్టారు. ఓ రోజు ఆయన మా ఆఫీసుకు ఫోన్ చేసి తన పరిస్థితి చెప్పి పాట ఇస్తాను ఎవర్నయినా పంపమన్నారు. నాగేశ్వరరావుగారు ఆ విషయాన్ని డైరక్టర్ గారికి చెప్పారు. ఆయన నన్ను పంపమన్నారట. నేను హాస్పటల్‌కి వెళ్లేసరికి వేటూరిగారు బెడ్ మీద పడుకొని చాలా హీనస్వరంతో బి.పి. చూస్తున్న నర్స్‌కి జవాబు చెబుతున్నారు. ఆమె వెళ్లాక వేటూరిగారన్నారు- "నా కండీషనేం బాగోలేదు. అయినా ఆ క్లైమాక్స్ సాంగ్ రాసి చచ్చిపోయినా బాధలేదు". ఆ సీరియస్ కండిషన్‌లో ఆయనలా మాట్లాడ్తుంటే అన్పించింది శంకరాభరణం మీద ఆయనకున్న గౌరవం, ఇష్టం ఎంత గొప్పదో అని. చాలా సేపయ్యాక ఆయన పాట గురించి ఆలోచించటం మొదలుపెట్టారు. చాలా సేపయ్యాకా నెమ్మదిగా ఆయన డిక్టేట్ చేశారు. "దొరకునా ఇటువంటి సేవ.. నీపద రాజీవముల చేరు నిర్వాణ సోపానమధిరోహణము సేయు త్రోవ.."- 'ఎలా గుంది?' అని అడిగారు. "బావుంది సార్" సమాధానమిచ్చాను. "మొదటిలైను త్యాగరాజుదిలే.. చరణం రాసుకో" అన్నారు. "రాగాలంతాలు నీ వేయిరూపాలు.. భవరోగ తిమిరాన పోకార్చు దీపాలు.. నాదాత్మకుడవై నాలోన చెలగి.. నా ప్రాణ దీపమై నాలోన వెలిగి.. నిను కొల్చువేళ దేవాదిదేవ.. దొరకునా ఇటువంటి సేవ.." అని చెప్పి రెండో చరణం గురించి కాసేపు ఆలోచించి అన్నారు. "గోపాలుడవై నావు గోవబాలుడవైనావు.. గోకులం నీ సొంతం చేసుకున్నావు" అంటూ రెండో చరణం చెప్పారు. ఆ తర్వాత రెండు రోజులకు అంతవరకు అయిన పిక్చర్ చూసి - "ఆ రెండో చరణం బావులేదు. దాన్ని మార్చాలి" అని వేరే చరణం రాశారు. ఆ తర్వాతి కాలంలో- "ఆ పాటలు రాయటానికి మీరు చాలా శ్రమించి ఉంటారు కద సార్" అని అడిగిన వాళ్లకు ఆయనిచ్చిన జవాబు- "చాలా సుఖంగా హాయిగా రాశాను. రెగ్యులర్‌గా రాసే వాటికి పడ్డ కష్టం వీటికి పడలేదు". ఆయన టేస్ట్ ఏ అంచునుండో ఆ మాట ద్వారా అర్థమవుతుంది. అయినా ఆయనది కావ్యాల కోసం వినియోగించే పాండిత్యం. మరి అభిరుచి అటుగాక ఇటెందుకు ఉంటుంది? "



శంకరాభరణం

రచయిత: వంశీ

ప్రచురణ: సాహితీ ప్రచురణలు

అన్ని ప్రముఖ పుస్తక దుకాణాల్లో లభిస్తుంది

స్టార్ స్టోరీ



గ్లామర్ ప్రపంచంలో మెరవడం సులభమే కానీ, ప్రేక్షకుల గుండెల్లో ముద్ర వేయడమే కష్టం. 'సీతారామం'తో తెలుగువారి ఇంటి ఆడపడుచులా మారిపోయిన మృణాల్ ఠాకూర్ ఇప్పుడు నేషనల్ క్రష్‌గా ఎదిగింది. వరుస విజయాలు, పెళ్లి పుకార్లు, కెరీర్ సవాళ్లపై ఆమె మనసు విప్పి మాట్లాడింది. ఆ వివరాలు మీకోసం...

ఒక్క ఫ్రేమ్‌లో కనిపించినా చాలు

సోషల్ మీడియాలో ఈ వారం మృణాల్ ఠాకూర్ పెళ్లి వార్తలు సెన్సేషన్ అయ్యాయి. దీని గురించి ఆమె వద్ద ప్రస్తావించగానే పెద్దగా నవ్వి "నాకైతే ఫిబ్రవరి 14 వాలెంటైన్స్ డేలా కాకుండా 'ఏప్రిల్ ఫూల్స్ డే'లా అనిపించింది. నేను ఎవరినో పెళ్లి చేసుకుంటున్నానని రాసేస్తున్నారు. నిజం చెప్పాలంటే ఈ పుకార్ల వల్ల నాకు కోట్ల రూపాయల ఉచిత పబ్లిసిటీ లభించింది. కానీ సీరియస్‌గా చెప్పాలంటే.. నా పెళ్లి ఎప్పుడు జరిగినా అది నేనే స్వయంగా ప్రకటిస్తాను. మా నాన్న కూడా నన్ను సెటిల్ అవమని అడుగుతుంటారు. అయితే, నా కంటూ ఒక పర్ఫెక్ట్ పార్ట్‌నర్ దొరకాలి కదా! అప్పటి వరకు నా ప్రేమంతా సినిమాలతోనే" అని చెప్పుకొచ్చింది.

టాలీవుడ్ నా సెకండ్ హోం

మరాఠీ అమ్మాయిని అయినప్పటికీ తెలుగు ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణ చూస్తుంటే ఆశ్చర్యమేస్తుందని అంటుంది మృణాల్. "సీతారామంలోని సీతామహాలక్ష్మి పాత్ర నాకు ప్రాణం పోసింది. 'హాయ్ నాన్న'లో యశ్నగా నన్ను రిసీవ్ చేసుకున్న విధానం మర్చిపోలేను. తెలుగు సినిమా పరిశ్రమ కథలకు ఇచ్చే ప్రాధాన్యం అద్భుతం. ఇక్కడ భాష సమస్య అనిపించదు. ఎందుకంటే ఎమోషన్స్ అనేవి యూనివర్సల్. తెలుగులో



నటించడం నాలో నటిని మరింత మెరుగుపరిచింది. టాలీవుడ్ నాకు రెండో ఇల్లు వంటిది" అంటూ తెలుగు చిత్ర పరిశ్రమపై అభిమానాన్ని చాటుకుంది.

అల్లు అర్జున్ ఒక ఇన్‌స్పిరేషన్

మృణాల్ తన ఫేవరెట్ హీరోల గురించి చెబుతూ అల్లు అర్జున్ ప్రస్తావనను తీసుకొచ్చింది. "బన్నీ డ్యాన్స్, ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ చూసి నేను ఫిదా అయిపోయాను. ఆయనతో కలిసి ఒక్క ఫ్రేములో కనిపించినా చాలని కోరుకుంటున్నాను. అట్లీ-అల్లు అర్జున్ కాంబినేషన్‌లో సినిమా వస్తుందని విన్నాను. ఒకవేళ నాకు అందులో అవకాశం వస్తే మాత్రం తన కల నిజమైనట్టేనని చెప్పింది మృణాల్.

సవాళ్లు.. పాఠాలు

టెలివిజన్ నుంచి వెండితెరకు రావడం అంత సులభం కాదని మృణాల్ గుర్తు చేసుకుంది. "ప్రారంభంలో చాలా మంది నన్ను 'టీవీ నటి' అని ముద్ర వేశారు. నాకు గ్లామర్ పాత్రలు సెట్ కావన్నారు. కానీ వెనకడుగు వేయలేదు. 'లవ్ సోనియా' నుంచి 'హాయ్ నాన్న' వరకు నేను ఎంచుకున్న ప్రతి పాత్ర ఒక చాలెంజ్. ఈ రోజు నేను ఎక్కడున్నా అది కేవలం నా కష్టం వల్ల మాత్రమే కాదు, నన్ను నమ్మిన దర్శకుల వల్ల" అని గుర్తు చేసుకుంది.

ఇష్టమైన వంటకం: పూరాణ్ పోలీ, తెలుగు ఆవకాయ అన్నం

ఫేవరెట్ లొకేషన్: కశ్మీర్

హీరోయిన్ కాకపోయి ఉంటే: ఒక మంచి జర్నలిస్ట్‌ను అయ్యేదాన్ని

ఫిట్‌నెస్.. లైఫ్‌స్టైల్

గ్లామర్ వెనక ఉన్న రహస్యాన్ని అడిగితే.. "చక్కని ఆహారం, యోగా, మానసిక ప్రశాంతత" అని సింపుల్‌గా తేల్చేసింది. షూటింగ్స్‌తో ఎంత బిజీగా ఉన్నా కుటుంబంతో గడపడానికి సమయం కేటాయిస్తానని, అదే తనను రీచార్జ్ చేస్తుందని చెప్పింది. ఎంతో పరిణితితో మాట్లాడిన మృణాల్ ఆత్మవిశ్వాసానికి కొదవ లేదు. త్వరలోనే తెలుగులో మరో పెద్ద ప్రాజెక్టుతో వస్తానని అభిమానులకు ప్రామిస్ చేసింది.

దో దీవానే సెహర్ మే.. ఒక అందమైన ప్రయాణం

తాజాగా విడుదలైన తన కొత్త సినిమా 'దో దీవానే సెహర్ మే' గురించి మృణాల్ మాట్లాడుతూ "ఈ సినిమా పేరు వినగానే ఒక రకమైన పాజిటివ్ వైబ్ వస్తుంది. ఇది ఒక ప్రేమకథ మాత్రమే కాదు, ఆధునిక నగరాల్లో యువత ఎదుర్కొనే ఎమోషనల్ స్ట్రగుల్స్ చుట్టూ తిరిగే కథ. ఇందులో నాది చాలా లేయర్స్ ఉన్న అమ్మాయి పాత్ర. షూటింగ్ సమయంలో ముంబై వీధుల్లో తిరుగుతూ, ఆ వాతావరణాన్ని ఎంజాయ్ చేయడం మర్చిపోలేని అనుభూతి. ఈ సినిమా కోసం నేను నా సహజ సిద్ధమైన నటనను మరింత రాటుదేల్చుకోవాల్సి వచ్చింది. ముఖ్యంగా క్లైమాక్స్ సీన్స్ చేస్తున్నప్పుడు నాకే తెలియకుండా కళ్లలో నీళ్లు తిరిగాయి" అని చెప్పుకొచ్చింది.

ఏఏఐ బోర్డులో 'ఆమె'

సంకల్పం ఆకాశమంత ఎత్తుంటే.. విజయం దానంతట అదే దాసోహమంటుంది. మూడు దశాబ్దాల క్రితం ఒక సాధారణ మేనేజ్‌మెంట్ ట్రైనీగా ప్రయాణం మొదలుపెట్టి... నేడు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) బోర్డ్ తొలి మహిళా మెంబర్‌గా చరిత్ర సృష్టించిన నివేదిత దూబే స్ఫూర్తిగాథ ఇది.



భారతదేశ విమానాయన రంగం నేడు శరవేగంగా విస్తరిస్తోంది. విమానాశ్రయాల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనలో కీలక పాత్ర పోషించే 'ఏఏఐ' బోర్డులో తాజాగా ఒక చరిత్రాత్మక మార్పు చోటుచేసుకుంది. జనవరి 30న ఏఏఐ బోర్డ్ మెంబర్ (హ్యూమన్ రిసోర్సెస్)గా బాధ్యతలు చేపట్టిన నివేదిత దూబే ఈ పదవిని అధిష్ఠించిన తొలి మహిళగా రికార్డులకెక్కారు.

మేనేజ్‌మెంట్ ట్రైనీ నుంచి

నివేదిత ప్రస్థానం 1995లో ఒక సాధారణ మేనేజ్‌మెంట్ ట్రైనీగా ప్రారంభమైంది. 30 ఏళ్ల క్రితం ఏఏఐలో అడుగుపెట్టిన ఆమె అంచెలంచెలుగా ఎదుగుతూ తన కంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిర్‌పోర్ట్ మేనేజర్‌గా ఆమె చేసిన సేవలు ఎంతో కీలకమైనవి. గడ్డు పరిస్థితుల్లో కూడా ఒత్తిడిని తట్టుకుంటూ భారీ బృందాలను నడిపించడంలో ఆమె దిట్ట అని పేరు తెచ్చుకున్నారు.

నివేదిత దూబే కేవలం కార్యాలయానికే పరిమితం కాలేదు. రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా (ఈస్ట్రన్ రీజియన్) పనిచేసిన కాలంలో పట్నా, పూర్ణియా వంటి విమానాశ్రయాల్లో కొత్త టెర్మినల్ భవనాల నిర్మాణాలను వేగవంతం చేసి తన మార్కు చూపించారు. కార్మిక సంబంధాల విషయంలో ఆమెకు ప్రత్యేకమైన పట్టు ఉంది. ఆమె నాయకత్వంలో ఒక్క పనిగంట కూడా నష్టం కాకుండా ట్రేడ్ యూనియన్లతో చర్చలు జరిపి పనులు సజావుగా సాగించడం ఆమె వ్యూహ రచనకు నిదర్శనం.

దేశం పట్ల నిబద్ధత

నివేదిత విజయం వెనుక బలమైన క్రమశిక్షణతో కూడిన నేపథ్యం ఉంది. జమ్మూకశ్మీర్‌కు చెందిన ఆమె తండ్రి డీఎన్ డోగ్రా ప్రసిద్ధ సైకాలజిస్ట్. ఎంతోమంది యువత సాయుధ దళాల్లో చేరేలా ఆయన మార్గదర్శకత్వం వహించారు. ఆమె సోదరుడు మేజర్ జనరల్ సంజీవ్ డోగ్రా ఎన్డీఏ డిప్యూటీ కమాండెంట్‌గా రిటైర్ అయ్యారు. దేశం పట్ల నిబద్ధత కలిగిన కుటుంబం నుంచి వచ్చిన నివేదిత ఇప్పుడు విమానయాన రంగం ద్వారా దేశానికి సేవ చేస్తున్నారు.

ఏఏఐ విజన్ 2047

హెచ్‌ఆర్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నివేదిత ఇప్పుడు వేలాదిమంది ఉద్యోగుల సంక్షేమం, శిక్షణ, నూతన నియామకాల బాధ్యతను పర్యవేక్షించనున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగులకు కొత్త సాంకేతికతపై శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే, యువ అధికారులలో లీడర్‌షిప్ క్వాలిటీస్ పెంచనున్నారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా

భారత ప్రభుత్వం నిర్దేశించుకున్న 2047 లక్ష్యాలకు అనుగుణంగా విమానాశ్రయాల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయనున్నారు. నివేదిత కేవలం అధికారి మాత్రమే కాదు. ఒక గొప్ప శిక్షకురాలు కూడా. ఇండియన్ ఏవియేషన్ అకాడమీలో ఫ్యాకల్టీగా పనిచేస్తూ, తర్వాతి తరం విమానయాన నిపుణులను ఆమె తీర్చిదిద్దుతున్నారు. ఐసీఏవో గుర్తింపు పొందిన అంతర్జాతీయ విమానాశ్రయ నిపుణురాలిగా ఆమెకు గ్లోబల్ స్థాయిలో గుర్తింపు ఉంది. 'నిర్వహణలో నైపుణ్యం, నాయకత్వంలో నిబద్ధత ఉంటే అసాధ్యమైనది ఏదీ లేదు' అని నివేదిత నిరూపించారు. కేవలం అడ్మినిస్ట్రేషన్‌కే పరిమితం కాకుండా, మానవ వనరుల వికాసానికి ఆమె చేస్తున్న కృషి భవిష్యత్ మహిళా అధికారులకు గొప్ప దిక్సూచి.

స్టైల్ ప్లస్ ప్రొటెక్షన్

వేసవిలో యాక్సెసరీస్ కేవలం స్టైల్ కోసమే కాదు, ఎండ నుంచి మనల్ని రక్షించుకోవడానికి కూడా ఉపయోగపడతాయి.



సన్‌గ్లాసెస్: కళ్లకు రక్షణగా యూవీ ప్రొటెక్షన్ ఉన్న నాణ్యమైన కూలింగ్ గ్లాసెస్ వాడాలి. ఇవి ఐ స్ట్రెయిన్‌ను తగ్గిస్తాయి.

కాటన్ స్కార్ఫ్: తమ మీద నేరుగా ఎండ పడకుండా కాటన్ స్కార్ఫ్‌లు లేదా స్టైలిష్ హ్యాట్స్ వాడండి.

ఫుట్‌వేర్: హీల్స్ కంటే ఫ్లాట్ శాండల్స్ లేదా గాలి ఆడేలా ఉండే జూతీలు వేసవిలో హాయిగా ఉంటాయి.

గొడుగు: నల్లటి గొడుగు కంటే పైన సిల్వర్ కోటింగ్ ఉన్న గొడుగులు వేడిని ఎక్కువ ప్రతిబింబించి చల్లదనాన్ని ఇస్తాయి.

అందాన్ని కాపాడుకోండిలా..

ఎండ తాకిడికి చర్మం తన సహజత్వాన్ని కోల్పోయి నిర్జీవంగా మారుతుంది. ఈ చిన్నపాటి జాగ్రత్తలతో మీ అందాన్ని కాపాడుకోండి.



సన్‌స్క్రీన్ తప్పనిసరి: బయటకు వెళ్లడానికి 20 నిమిషాల ముందే కనీసం ఎస్పీఎఫ్ 30 ఉన్న సన్‌స్క్రీన్‌ను ముఖం, చేతులకు రాసుకోవాలి.

న్యాచురల్ ప్యాక్స్: వారానికి ఒకసారి ముల్తానీ మట్టి లేదా శనగపిండిలో రోజ్ వాటర్ కలిపి ఫేస్ ప్యాక్ వేసుకుంటే ముఖానికి ఉన్న జిడ్డు తొలగిపోతుంది.

ఐస్ థెరపీ: ఎండలో తిరిగి వచ్చాక ఐస్‌క్యూబ్స్‌తో ముఖాన్ని మెల్లగా మసాజ్ చేస్తే చర్మం తాజాగా మారుతుంది.

వంటల్లో ఘనా 'పాటీ'

వయసు 90. కానీ వేరొకరి సాయం అవసరం లేదు. ఊతకర్ర అక్కర్లేదు. చలాకీగా తిరిగేస్తారు. ఇంటర్‌నెట్‌లో సంప్రదాయ వంటలు వండేస్తూ... విభిన్న రుచులను పరిచయం చేస్తూ... వేలమంది అభిమానులను సంపాదించుకున్నారు. రెసిపీలే కాకుండా... ఆరోగ్య సూత్రాలు కూడా వివరిస్తూ ఆన్‌లైన్‌లో వడ్డిస్తున్న కేరళ బామ్మ... సరస్వతి పాటీ అభిరుచి ఇది...



అభి'రుచి'

"జీవితమంటేనే సమస్యలు, సవాళ్లు, బంధాలు, బాధలు. సమస్యలను పరిష్కరించుకొంటూ, సవాళ్లను అధిగమిస్తూ, బాధలను మరిచి కాలంతో పాటు సాగిపోవాలి. ఇది నాకు అనుభవం నేర్పిన పాఠం. కేరళలోని పాలక్కడ్‌లో సంప్రదాయ ఉమ్మడి కుటుంబం మాది. తరువాత బెంగళూరులో స్థిరపడ్డాను. చాలా చిన్న వయసులో మా అమ్మమ్మ, అమ్మలను కోల్పోయాను. ఆ బాధ నుంచి తేరుకోకముందే నా మీద బాధ్యత పడింది. పన్నెండేళ్లకే వంట గదిలో గరిట తిప్పాల్సివచ్చింది. దాన్ని నేను బరువుగా భావించలేదు. ఎంతో శ్రద్ధగా, ఇష్టంగా మొదలుపెట్టాను. ఇక మా అత్తయ్య బాగా వంట చేసేవారు. ఆమె చేత్తో వండితే రోజూ తినే కూరైనా సరే ఎంతో రుచిగా ఉంటుంది. వంటింట్లో అత్తయ్యకు సాయపడుతూ వంట నేర్చుకున్నాను.

చుట్టూ ఉన్నవారే స్ఫూర్తి...

ఉమ్మడి కుటుంబం కావడంతో మా ఇంట్లో ఎప్పుడూ రకరకాల రుచులు వడ్డిస్తుండేవారు. మా చుట్టుపక్కల ఇళ్లవాళ్లు పర్వదినాల్లో ప్రత్యేక వంటలు చేసేవారు. అలా వండినప్పుడల్లా మాకు కూడా ఇచ్చేవారు. వాటిల్లో ఏమేం పదార్థాలు ఉపయోగించారో అడిగి తెలుసుకొనేదాన్ని. నేను కూడా ఇంట్లో చేసేదాన్ని. అంతటితో ఆగిపోలేదు. తరచూ కొత్త వంటకాలు ప్రయత్నించేదాన్ని. అయితే అన్నీ సంప్రదాయ రుచులే వండేదాన్ని.

ఇక నా మనవరాలు మీనాక్షి నా దగ్గరే పెరిగింది. తను రోజూ ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ అవీ చూస్తుండేది. అదేమిటో నాకు అర్థమయ్యేది కాదు. కొంత కాలం మనవరాలిని గమనించాక... ఒక రోజు అడిగా... 'ఇందులో ఎవరైనా వీడియోలు, ఫొటోలు పెట్టవచ్చా' అని! 'ఎవరైనా పోస్ట్ చేయవచ్చు' అంటూ తను బదులిచ్చింది. ఆ సమాధానం నా ఆలోచనల్ని మార్చేసింది. సామాజిక మాధ్యమాలు ఎలా పని చేస్తాయో అడిగి తెలుసుకున్నాను. కొంత కాలం దాని మీద పూర్తిగా శ్రద్ధ పెట్టాక... ఇక అందులో నుంచి బయటకు రాలేకపోయాను. అయితే సాంకేతికత, నా మనవరాలు ఒక్కటే. ఎందుకంటే... తను కూడా అప్పుడప్పుడూ నన్ను గందరగోళానికి గురి చేస్తుంటుంది.

'అదిగో పాటీ'...

బయటకు వెళ్లినప్పుడు నన్ను గుర్తుపడుతున్నారు. 'అదిగో అయ్యర్ పాటీ' అంటూ దగ్గరకు వచ్చి ఆప్యాయంగా పలుకరిస్తున్నారు. అవన్నీ చూసినప్పుడు నాకు అనిపిస్తుంది... సామాజిక మాధ్యమం నాకు ఇంత పెద్ద కుటుంబాన్ని ఇచ్చిందని. ఈ జన్మకు ఇది చాలని."

నా ఆసక్తిని గమనించి...

నా మనవరాలు నా ఆసక్తిని గమనించింది. నేను వంటలు బాగా ఇష్టంగా చేస్తాను కాబట్టి, అదే కంటెంట్‌తో ఒక ఇన్‌స్టాలో చానల్ ప్రారంభిద్దామని తను చెప్పింది. సరేనన్నాను. ఇద్దరం కలిసి రెండేళ్ల కిందట 'ది అయ్యర్ పాటీ' చానల్‌ను తీసుకువచ్చాం. 'పాటీ' అంటే తమిళంలో బామ్మ అని. అయితే మా కంటెంట్‌ను ప్రపంచం చూడాలన్న ఉద్దేశంతో చానల్ మొదలుపెట్టలేదు. 90 ఏళ్ల వయసులో నాకంటూ కొన్ని జ్ఞాపకాలు ఉండాలని మీనాక్షి భావించింది. కానీ అనుకోకుండా అదే ఇప్పుడు వేలమందికి చేరువైంది. ప్రస్తుతం లక్షన్నర మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. నేను పోస్ట్ చేసే ప్రతి రీల్‌కూ వేలల్లో లైక్‌లు, కామెంట్లు వస్తున్నాయంటే... ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను. ముఖ్యంగా నేటితరం యువత 'పాటి' అంటూ చూపించే ప్రేమాభిమానాలు ఈ వయసులో కూడా నన్ను ఉత్సాహంగా ఉంచుతున్నాయి.

ఆరోగ్యానికి ప్రాధాన్యం...

నా వీడియోల్లో అధిక శాతం పచ్చళ్లు, పొడులు, సాంబారు, రసం, పిండివంటలు ఉంటాయి. కానీ అన్నీ ఆరోగ్యకరమైనవే. అలాగని కావాలని చొప్పించిన పదార్థాలు ఏమీ లేవు. చిన్నప్పటి నుంచి నా జీవన శైలిలో భాగమైన సంప్రదాయ వంటకాలే ఇవన్నీ. అత్తయ్యను చూసి అలవాటు చేసుకున్నా. తను అవసరాన్ని బట్టి అప్పటికప్పుడు ఆహార పదార్థాలు మార్చేసి, చిటికెలో కొత్త వంటకం సిద్ధం చేసేవారు. నా వంటల్లో బాగా ఆదరణ పొందినవాటిల్లో ఒకటి... కొల్లు రసం. ఉలవలతో చేసే రసం. దగ్గు, జలుబుకు ఔషధంలా పని చేస్తుంది. ఇలా ఎన్నో ఉన్నాయి. ఇన్‌స్టాలో నా పేజీ నా కుటుంబానికి... అంటే ఫాలోవర్స్‌కు ఒక డైరీ లాంటిది. ఎప్పుడు ఎలాంటి సందేహాలు వచ్చినా నా పేజీ ద్వారా నివృత్తి చేసుకొనే వీలుంది. అంత వివరంగా కంటెంట్‌ను అందుబాటులో ఉంచుతున్నాను."

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
అక్యూజ్‌డ్	హిందీ చిత్రం	ఫిబ్రవరి 27
అమెజాన్ ప్రైమ్		
ది సీఈవో క్లబ్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 23
ది బ్లఫ్	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 25
ఇక్కీస్	హిందీ సిరీస్	ఫిబ్రవరి 26
బ్రిడ్జర్టన్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 27
జియో హాట్‌స్టార్		
ఒన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 26ది
బ్లాక్ ఫోన్ 2	హిందీ సిరీస్	ఫిబ్రవరి 28
ఈటీవి విన్		
శ్రీ చిదంబరం గారు	తెలుగుచిత్రం	ఫిబ్రవరి 26







ఒక్క బంతీ పడకుండానే..

వర్షంతో పాక్-న్యూజిలాండ్ మ్యాచ్ రద్దు

ఇరుజట్లకు చెరో పాయింట్

కొలంబో: టీ20 వరల్డ్‌కప్ సూపర్-8 తొలి పోరుకు వరుణుడు అడ్డుపడ్డాడు. దీంతో గ్రూప్-2లో పాకిస్థాన్, న్యూజిలాండ్ మధ్య శనివారం జరగాల్సిన మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. ఇరుజట్లకూ చెరో పాయింట్ లభించింది. చిరుజల్లులు పడుతుండగానే వేసిన టాస్‌లో గెలిచిన పాక్.. మరో ఆలోచన లేకుండా బ్యాటింగ్ ఎంచుకొంది. అయితే, కొద్ది నిమిషాల్లోనే వాన జోరందుకోవడంతో స్టేడియం మొత్తాన్ని కవర్లతో కప్పేశారు. క్రమక్రమంగా పెరిగిన వర్షం.. ఎంతకూ నెమ్మదించలేదు. ఫీల్డ్‌ను కూడా పట్టాలతో కవర్ చేసినా.. భారీగానే నీరు వాటిపై చేరింది. రెండు గంటలపాటు వేచి చూసినా పరిస్థితుల్లో మార్పు కనిపించలేదు. ఐదు ఓవర్లపాటు ఆట కూడా కష్టంగా మారడంతో.. రాత్రి 9 గంటలా 7 నిమిషాలకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. సూపర్-8లో తమ తదుపరి మ్యాచుల్లో భాగంగా మంగళవారం ఇంగ్లండ్‌తో పాక్.. బుధవారం శ్రీలంకతో న్యూజిలాండ్ ఆడనున్నాయి. ఇక, వర్షం వల్ల ఈ మ్యాచ్ రద్దవడంతో ఇరుజట్ల సెమీస్ అవకాశాలపై ప్రభావం చూపించే చాన్సులున్నాయి. లంక వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని మరో మ్యాచ్‌కు ఇలాగే వరుణుడు అడ్డుతగిలినా? లేదా ఓడినా? ఆ జట్టు నాకౌట్ అవకాశాలు ఆవిరయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ఇక్కడైనా జరిగేనా?

నేడు ఇంగ్లండ్‌తో శ్రీలంక ఢీ

మ్యాచ్‌కు వరుణుడి ముప్పు

మ.3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



పల్లెకెలె: టీ20 వరల్డ్‌కప్ సూపర్-8లో భాగంగా ఆదివారం ఆతిథ్య శ్రీలంక జట్టును ఇంగ్లండ్‌ను ఎదుర్కొనబోతోంది. గత నెలలో ఇదే ఇంగ్లండ్ చేతిలో లంక 0-3తో వైట్‌వాష్ అయ్యింది. ఈ కీలక పోరుతో ఆ పరాభవానికి బదులు తీర్చుకోవాలనుకుంటోంది. ఓపెనర్ నిస్సాంక, కుశాల్ మెండిస్‌ల ఫామ్ లంకకు కీలకం కానుంది. స్పిన్నర్ తీక్షణ, మదుషంక, చమీర ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టగలరు. అటు టోర్నీలో ఇంగ్లండ్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. కానీ లంకపై గతంలో సిరీస్ నెగ్గిన ఉత్సాహంతో ఉన్న బ్రూక్ బృందం అదే జోరును కొనసాగించాలనుకుంటోంది. అయితే, ఈ మ్యాచ్‌కు కూడా వరుణుడు పొంచి ఉండడం ఇరుజట్లనూ ఆందోళనపరుస్తోంది. మ్యాచ్ జరిగే మధ్యాహ్నం సమయంలో ఇక్కడ భారీ వర్షం కురిసే చాన్సుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

సఫారీలపై సత్తా చాటాలి

సూపర్ -8లో భారత్ తొలి పోరు నేడు

రాత్రి 7 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



ప్రాక్టీస్‌లో ఇషాన్, రింకూ, సూర్య



మార్‌క్రమ్

అహ్మదాబాద్: జోరు మీదున్న టీమిండియా కీలక సమరానికి సిద్ధం కాబోతోంది. టీ20 వరల్డ్ కప్ గ్రూప్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో అజేయంగా నిలిచిన సూర్యకుమార్ సేన ఇప్పుడు సెమీస్ బెర్త్‌పై కన్నేసింది. ఇందులో భాగంగా సూపర్-8 గ్రూప్ 1లో నేడు (ఆదివారం) తమ తొలి మ్యాచ్‌ను దక్షిణాఫ్రికాతో ఆడనుంది. అయితే తొలి రౌండ్‌లో భారత్ టేబుల్ టాపర్‌గా నిలిచినా.. ఆ స్థాయి ప్రదర్శన మాత్రం కనబర్చలేకపోయింది. పసికూన జట్లుగా భావించిన యూఎస్ఏ, నెదర్లాండ్స్ గట్టి పోటీని ఇవ్వగలిగాయి. ఒక్క పాక్‌పై మాత్రమే అన్ని విధాలుగా రాణించగలిగింది. అభిమానులు ఆశించినట్టుగా జట్టు నుంచి ఇంకా పూర్తి సామర్థ్యం రాలేదనే చెప్పవచ్చు. ఇప్పుడు ప్రతీ మ్యాచ్ కీలకమే కాకుండా.. ప్రత్యర్థి దక్షిణాఫ్రికా కావడంతో భారత్ అన్ని విభాగాల్లోనూ చెలరేగాల్సిందే. అటు సఫారీలు క్రితం టోర్నీ ఫైనల్లో ఎదురైన పరాభవానికి ప్రతీకారం తీర్చుకోవాలనే కసితో ఉన్నారు. డికాక్, మార్‌క్రమ్, బ్రెవిస్, స్టబ్స్, రికెల్టన్, మిల్లర్‌లతో వీరి బ్యాటింగ్ దుర్భేద్యంగా కనిపిస్తోంది. అటు బౌలింగ్‌లోనూ పేసర్లు యాన్సెన్, రబాడ, ఎన్‌గిడి, స్పిన్నర్ కేశవ్‌లతో బలంగానే ఉంది.

అభిషేక్‌కే చాన్స్!

అనూహ్య రీతిలో డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ మూడు డకౌట్లతో ఇంకా పరుగుల ఖాతానే తెరువలేదు. అయితే తన గైర్హాజరీలో ఓపెనర్‌గా శాంసన్ నమీబియాపై 8 బంతుల్లోనే 22 పరుగులతో చెలరేగాడు. దీంతో నేటి మ్యాచ్‌లో ఓపెనర్‌గా ఎవరిని ఆడిస్తారనే సందేహాలు నెలకొన్నాయి. కానీ కెప్టెన్ సూర్య మాత్రం అభిషేక్‌పై పూర్తి నమ్మకాన్ని ఉంచాడు. అతడి ఫామ్ గురించి ఆందోళన పడుతున్న వారి గురించే తాను ఆందోళన పడుతున్నట్టు తేల్చాడు. అభిషేక్ టచ్‌లోకి వచ్చేందుకు ఒక్క ఇన్నింగ్స్ చాలనే అభిప్రాయంతో టీమ్ ఉండడంతో ఇషాన్‌తో కలిసి తనే బరిలోకి దిగే చాన్సుంది. అయితే అభిషేక్ త్వరగా అవుటవడం వన్‌డౌన్‌లో తిలక్ వర్మ బ్యాటింగ్‌పై ప్రభావం పడుతోంది. వికెట్ కాపాడుకునేందుకు అతను భారీ షాట్లకు వెళ్లడం లేదు. దీంతో మధ్య ఓవర్లలో స్కోరు నెమ్మదిస్తోంది. అయితే తమ సూచన మేరకే తిలక్ అలా ఆడాల్సి వస్తోందని కెప్టెన్ చెబుతున్నాడు. మిడిలార్డర్‌లో సూర్య పాక్, నెదర్లాండ్స్‌పై రాణించలేకపోయాడు. కాగా.. హార్దిక్, దూబే చివర్లో చెలరేగుతుండడం సానుకూలాంశం కానుంది. సఫారీల బౌలింగ్ లైనప్ పటిష్ఠంగా ఉండడంతో భారత బ్యాటర్లు సమష్టిగా రాణించాల్సి ఉంది. పేసర్ బుమ్రా, స్పిన్నర్ వరుణ్‌ల బంతులను గ్రూప్ దశలో ప్రత్యర్థి జట్లు ఆడలేకపోయాయి. కానీ సౌతాఫ్రికా బ్యాటింగ్ లైనప్‌ను ఈ ద్వయం ఎలా అడ్డుకుంటుందనేది వేచిచూడాల్సిందే. పిచ్‌ను బట్టి కుల్దీప్‌కన్నా అర్ష్‌దీప్‌నకు చాన్స్ ఇవ్వవచ్చు. అలాగే సుందర్ స్థానంలో అక్షర్ తిరిగి బరిలోకి దిగనున్నాడు.



తుది జట్లు (అంచనా)

భారత్: ఇషాన్, అభిషేక్, తిలక్, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్, దూబే, రింకూ, అక్షర్, కుల్దీప్/అర్ష్‌దీప్, బుమ్రా, వరుణ్.

దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్ (కెప్టెన్), డికాక్, రికెల్టన్, బ్రెవిస్, స్టబ్స్, మిల్లర్, యాన్సెన్, బాష్, కేశవ్, రబాడ, ఎన్‌గిడి.

పిచ్

నరేంద్ర మోదీ స్టేడియం పిచ్‌ను నల్ల మట్టితో తయారుచేశారు. దీంతో ఈ ట్రాక్ స్పిన్నర్లకు అంతగా అనుకూలించకపోవచ్చు. చక్కటి బౌన్స్‌తో పేసర్లకు మాత్రం లాభిస్తుంటుంది. అలాగే భారీ స్కోర్లకు అవకాశం ఉంది.



మంధాన (82)

గెలిచారు..

3 టీ20లలో 2500లకుపైగా పరుగులు స్కోరు చేసిన మూడో భారత బ్యాటర్ జెమీమా. మంధాన, హర్మన్‌ప్రీత్ ఇంతకు ముందు ఈ ఫీట్ సాధించారు.

చరిత్ర సృష్టించారు

ఆస్ట్రేలియాపై టీ20 సిరీస్ కైవసం

మంధాన, జెమీమా హాఫ్ సెంచరీలు

శ్రేయంక, శ్రీచరణి వికెట్ల వేట

అడిలైడ్: ఆల్‌రౌండ్ షో ప్రదర్శించిన భారత మహిళలు ఆస్ట్రేలియాపై 2-1తో టీ20 సిరీస్ నెగ్గి చరిత్ర సృష్టించారు. శనివారం ఇక్కడ జరిగిన మూడో, ఆఖరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన 17 పరుగులతో ఆతిథ్య జట్టును ఓడించింది. బలమైన ఆసీస్‌పై ఆ దేశంలో మన మహిళలు పొట్టి సిరీస్ సాధించడం 2016 తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషం. మొదట భారత్ 20 ఓవర్లలో 176/6 స్కోరు చేసింది. స్మృతీ మంధాన (55 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 82), జెమీమా (59) అర్ధ శతకాలతో అదరగొట్టారు. మంధాన, జెమీమా రెండో వికెట్‌కు 121 పరుగులు జోడించారు. పొట్టి ఫార్మాట్‌లో భారత జట్టుకు రెండో వికెట్‌కు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఇక ఛేదనలో ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 159/9 స్కోరుకే పరిమితమై ఓడింది. గార్డ్‌నర్ (57), లిచ్‌ఫీల్డ్ (26), సదర్లాండ్ (14) మినహా అంతా విఫలమయ్యారు. స్పిన్నర్లు శ్రేయాంక పాటిల్, శ్రీచరణి చెరో మూడు వికెట్లతో కంగారూల పనిబట్టారు. అరుంధతి రెడ్డి రెండు వికెట్లు పడగొట్టింది. స్మృతి మంధాన ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా నిలిచింది. మల్టీ ఫార్మాట్ సిరీస్‌లో భాగంగా తదుపరి మూడు వన్డేలలో భారత్-ఆసీస్ తలపడనున్నాయి. మొదటి మ్యాచ్ మంగళవారం బ్రిస్బేన్‌లో జరగనుంది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 176/6 (మంధాన 82, జెమీమా 59, రిచా ఘోష్ 18, సదర్లాండ్ 2/34).

ఆస్ట్రేలియా: 20 ఓవర్లలో 159/9 (గార్డ్‌నర్ 57, లిచ్‌ఫీల్డ్ 26, సదర్లాండ్ 14, శ్రేయాంక 3/22, శ్రీచరణి 3/32, అరుంధతి 2/35).

భారత్ x బంగ్లాదేశ్

మహిళల రైజింగ్ స్టార్స్ ఫైనల్ నేడు

మ.12.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో


బ్యాంకాక్: అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో బలంగా ఉన్న భారత్ ‘ఎ’.. మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీ టైటిల్ పట్టేయాలని పట్టుదలగా ఉంది. ఈక్రమంలో ఆదివారం ఇక్కడ జరిగే ఫైనల్లో బంగ్లాదేశ్ ‘ఎ’తో తలపడనుంది. రాధా యాదవ్ కెప్టెన్సీలోని భారత్ సెమీఫైనల్లో శ్రీలంకను చిత్తు చేసింది. మరో సెమీస్‌లో పాకిస్థాన్‌పై బంగ్లాదేశ్ విజయం సాధించింది.

శాప్ చెస్ లీగ్ ప్రారంభం



తిరుపతి, క్రీడలు (ఆంధ్రజ్యోతి): శాప్ చెస్ లీగ్ తిరుపతిలో ఘనంగా ప్రారంభమైంది. స్థానిక శ్రీనివాస స్పోర్ట్స్ కాంపెక్స్‌లో శాప్ చైర్మన్ రవి నాయుడు, టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి ఈ పోటీలను శనివారం ప్రారంభించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారిని అంతర్జాతీయ స్థాయికి తగ్గట్టు తీర్చిదిద్దాలనే లక్ష్యంతో శాప్ లీగ్‌ను ప్రారంభించామని రవినాయుడు తెలిపారు. చెస్, కబడ్డీ, సైక్లింగ్, బాస్కెట్‌బాల్, ఆర్చరీతో సహా 31 క్రీడాంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ హరిప్రసాద్, శాప్ వీసీ-ఎండీ భరణి పాల్గొన్నారు.

ప్రేయసిని పెళ్లాడిన గబ్బర్



ధవన్ పెళ్లికి హాజరైన రోహిత్ దంపతులు

న్యూఢిల్లీ: టీమిండియా మాజీ ఓపెనర్ శిఖర్ ధవన్ తన ప్రేయసి, ఐర్లాండ్ నటి సోఫీ షైన్‌ను శనివారం పెళ్లాడాడు. ఢిల్లీలోని ఎన్‌సీఆర్ ప్రాంతంలో జరిగిన ఈ వేడుకకు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, రితిక దంపతులు, క్రికెటర్ యజ్వేంద్ర చాహల్ తదితరులు హాజరయ్యారు. గబ్బర్, సోఫీల నిశ్చితార్థం గతనెల 12న జరిగిన సంగతి తెలిసిందే. ధవన్‌కు ఇది రెండో పెళ్లి. 2012లో ఆస్ట్రేలియాకు చెందిన ఆయేషా ముఖర్జీని పెళ్లి చేసుకున్న అతను 2021లో ఆమెకు విడాకులు ఇచ్చాడు. వీరిద్దరికీ జొరావర్ అనే కుమారుడు ఉన్నాడు.

ఎన్ఎస్ఈలో నానో సెకను ట్రేడింగ్

ఏప్రిల్ 11 నుంచి అందుబాటులోకి..

న్యూఢిల్లీ: ఏప్రిల్ 11 నుంచి ఈక్విటీలు, ఈక్విటీ డెరివేటివ్ విభాగాల్లో నానో సెకను ట్రేడింగ్‌ను అందుబాటులోకి తేనున్నట్లు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ఎండీ, సీఈఓ ఆశిష్ చౌహాన్ శనివారం తెలిపారు. తద్వారా భారత్ ప్రపంచంలోని అత్యంత వేగవంతమైన ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌ల కంటే దాదాపు 1000 రెట్ల వేగంతో కూడిన మార్కెట్‌గా అవతరించనుందన్నారు. కరెన్సీ డెరివేటివ్ విభాగ ట్రేడింగ్ ఇప్పటికే నానో సెకను వేగంతో జరుగుతోందన్నారు. ఈక్విటీలు, ఈక్విటీ డెరివేటివ్ విభాగాల్లోనూ ఇదే వేగంతో కూడిన ట్రేడింగ్‌ను అందుబాటులోకి తేనున్నట్లు ఆయన చెప్పారు. ఒక సెకను 100 కోట్ల కోట్ల నానో సెకనులతో సమానం. ఎన్ఎస్ఈ అర్డర్ల ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని సెకనుకు 10 కోట్ల లావాదేవీల స్థాయికి పెంచనుందన్నారు. ప్రస్తుతం ఎక్స్ఛేంజ్ సెకనుకు 50-60 లక్షల ఆర్డర్లను ప్రాసెస్ చేస్తోంది.

మాటలతోనే చెల్లింపులు

ఫోన్‌పేలో కొత్త ఫీచర్

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే.. డిజిటల్ చెల్లింపుల్లో వినియోగదారుల అనుభవాన్ని మరింత స్మార్ట్‌గా మారుస్తూ ‘ఏఐ ఆధారిత నేచురల్ లాంగ్వేజ్ సెర్చ్’ ఫీచర్‌ను ప్రారంభించింది. మైక్రోసాఫ్ట్ ఫౌండ్రీ భాగస్వామ్యంతో ఈ వినూత్న ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీని ద్వారా వినియోగదారులు యాప్‌లో క్లిష్టమైన మెనూలను వెతకాల్సిన పని లేకుండా కేవలం సాధారణ వాయిస్, టెక్స్ట్ కమాండ్స్‌తో లావాదేవీలను పూర్తి చేయవచ్చని ఫోన్‌పే తెలిపింది. ఇది ఆన్-డివైస్, క్లౌడ్ ఆధారంగా పనిచేసే హైబ్రిడ్ మోడల్ అని, వినియోగదారుల డేటా భద్రతకు ఎటువంటి ముప్పు లేకుండా సురక్షితంగా చెల్లింపులు చేపట్టవచ్చని ఫోన్‌పే వ్యవస్థాపకుడు, సీటీఓ రాహుల్ చారి తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	530
వరంగల్	497	గోదావరి	490
చిత్తూరు	573	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	115
వరంగల్	115	గుంటూరు	115
కరీంనగర్	115	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	117
కర్నూలు	115	నెల్లూరు	122
విశాఖపట్నం	115	అనంతపురం	122
గోదావరి	115		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,59,280 ▲	1,46,000 ▲	2,90,000 ▲
విజయవాడ	1,62,000 ▲	1,50,000 ▲	2,70,000 ▲
విశాఖపట్నం	1,59,270 ▼	1,46,000 ▲	2,90,000 ▲
రాజమండ్రి	1,59,270 ▲	1,46,000 ▲	2,61,000 ▲
ప్రొద్దుటూరు	1,55,800 ▲	1,43,340 ▲	2,68,000 ▲
ముంబై	1,55,066 ▲	1,42,040 ▲	2,50,314 ▲

బిజినెస్ ప్లస్



పన్ను పోటు లేని 10 ఆదాయాలు

చాలా మందికి సంపాదించేటప్పుడు ఖుషీగానే ఉంటుంది. కానీ ఆ ఆదాయాలపై పన్ను చెల్లించేటప్పుడే సమస్య. కష్టపడి సంపాదించిన ఆదాయంపై ప్రభుత్వానికి ఎందుకు పన్ను చెల్లించాలని తెగ బాధపడిపోతుంటారు. వీరికోసమేనా అన్నట్టు మన దేశంలో కొన్ని ఆదాయాలను పన్ను పోటు నుంచి పూర్తిగా మినహాయించారు. అటువంటి పది ఆదాయాల గురించి తెలుసుకుందాం.

జీవిత బీమా మెచ్యూరిటీ మొత్తం

జీవిత బీమా (లైఫ్ ఇన్సూరెన్స్) పాలసీ గడువు (మెచ్యూరిటీ) తీరినప్పుడు లేదా పాలసీదారుడు మధ్యలోనే చనిపోయినప్పుడు చెల్లించే మొత్తానికీ పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది. కాకపోతే ఇందుకోసం చెల్లించిన ప్రీమియం, పాలసీ కింద హామీ ఇచ్చిన మొత్తంలో 10 శాతానికి మించి ఉండకూడదు. అయితే పాలసీదారుడు మధ్యలోనే చనిపోతే చెల్లించే మొత్తానికి మాత్రం ఇది వర్తించదు.

ఉపకార వేతనాలు

ఉపకార వేతనాల (స్కాలర్‌షిప్) కింద చెల్లించే మొత్తాలకూ పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది. కాకపోతే ఈ మినహాయింపు విద్యార్థులకు చెల్లించే స్కాలర్‌షిప్‌లకు మాత్రమే వర్తిస్తుంది.

వ్యవసాయ ఆదాయం

వ్యవసాయ ఆదాయానికి పూర్తి పన్ను మినహాయింపు ఉంది. ఇందుకు ఎలాంటి పరిమితులు కూడా లేవు. అంటే మీకు ఉన్న సాగు భూమిలో పంటలు సాగు చేసి, ఆ పంటలను అమ్మడం ద్వారా లేదా మీ సాగు భూములను వేరొకరికి కౌలుకు ఇవ్వడం ద్వారా వచ్చే ఆదాయానికి కూడా ఈ మినహాయింపు వర్తిస్తుంది. అయితే వార్షిక వ్యవసాయ ఆదాయం రూ.5,000కు మించి, మీ మొత్తం ఆదాయం ప్రాథమిక మినహాయింపు పరిమితి మించి పోతే మాత్రం పన్ను రేటు లెక్కింపు కోసం పాక్షికంగా పరిగణనలోకి తీసుకుంటారు.

పీపీఎఫ్ రాబడులు

మన దేశంలో ఆదాయ పన్ను పరిధిలోకి వచ్చే వారిలో ముఖ్యంగా ఉద్యోగుల్లో ఎక్కువ మంది పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)లో పెట్టుబడులు పెడుతుంటారు. ఈ పథకంలో పెట్టే వార్షిక పెట్టుబడుల్లో రూ.1.5 లక్షల వరకు సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు లభిస్తుంది. ఈ పథకంపై వచ్చే వడ్డీ, పథకం గడువు ముగిసిన తర్వాత చేతికి వచ్చే మొత్తానికి కూడా పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది. ఈ పథకంలో పెట్టుబడులు, రాబడులు పూర్తిగా ఎగ్జెంప్షన్, ఎగ్జెంప్షన్, ఎగ్జెంప్షన్ (ఈఈఈ) పరిధిలోకి వస్తాయి.

ఈపీఎఫ్ విత్‌డ్రాయల్స్

ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) ఖాతా నుంచి వెనక్కి తీసుకునే మొత్తాలపైనా చిల్లిగవ్వ కూడా ఆదాయ పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ఉద్యోగి, కంపెనీ జమ చేసిన మొత్తాలతో పాటు ఈపీఎఫ్‌పై చెల్లించే వడ్డీకి కూడా ఇది వర్తిస్తుంది. కాకపోతే ఆ సొమ్మును విత్‌డ్రా చేసుకునే వ్యక్తి ఈపీఎఫ్‌లో కనీసం ఐదేళ్ల పాటు సభ్యుడై ఉండాలి. 2026 ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చే కొత్త ఆదాయ చట్టంలోనూ ఈ మినహాయింపు, వరుసగా ఐదేళ్ల కనీస కంట్రిబ్యూషన్ నిబంధన కొనసాగనుంది.

బహుమతులు

తల్లిదండ్రులు, జీవిత భాగస్వామి, పిల్లల వంటి దగ్గరి బంధువుల నుంచి అందుకునే బహుమతులకు, వారసత్వంగా వచ్చే ఆస్తులు, ఆదాయాలకు ఎలాంటి పరిమితి లేకుండా పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది. బంధువులు కాని వారి నుంచి అందే స్థిర లేదా చరాస్తుల బహుమతుల వార్షిక విలువ రూ.50,000 మించితే మాత్రం పన్ను పోటు తప్పదు. దీన్ని ఇతర ఆదాయంగా పరిగణించి పన్ను విధిస్తారు. ఎలాంటి ప్రతిఫలం లేకుండా వచ్చే స్థిరాస్తి బహుమతి స్టాంప్ డ్యూటీ రూ.50,000 మించి ఉంటే, పన్ను విధింపు కోసం ఆ స్థిరాస్తి మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకుంటారు.

వీలునామా లేదా వారసత్వ ఆస్తులు

వీలునామా ద్వారా వచ్చే వారసత్వ ఆస్తులపై ఎలాంటి పన్ను పోటు ఉండదు. అయితే ఈ ఆస్తులపై వచ్చే ఆదాయాలు మాత్రం పన్ను పరిధిలోకి వస్తాయి. ఉదాహరణకు ఎవరైనా చనిపోయిన తర్వాత వారి పేరు మీద ఉన్న బ్యాంకు డిపాజిట్లు, రుణ పత్రాలు వారి వారసులకు బదిలీ అవుతాయి. వీటిపై వచ్చే వడ్డీ ఆదాయానికి వాటిని అందుకున్న వ్యక్తే ఆదాయ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. షేర్లు, మ్యూచువల్ ఫండ్ యూనిట్లపై వచ్చే డివిడెండ్లకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. ఈ ఆదాయాన్ని ఆయా వ్యక్తుల రెగ్యులర్ ఆదాయానికి జోడించి వారి శ్లాబుల ప్రకారం పన్ను విధిస్తారు.

సుకన్య సమృద్ధి యోజన

సెక్షన్ 80సీ కింద సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై) పథకంలో పెట్టుబడులకు, ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల వరకు పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది. ఈ పథకంపై లభించే వడ్డీ, మెచ్యూరిటీ మొత్తాలకీ పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది. దేశంలో బాలికల భవిష్యత్ ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పథకాన్ని రూపొందించారు.

ట్యాక్స్ ఫ్రీ బాండ్స్

ప్రభుత్వం లేదా కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలు ట్యాక్స్ ఫ్రీ బాండ్స్ (రుణ పత్రాలు) జారీ చేస్తుంటాయి. ఈ బాండ్స్‌పై వచ్చే వడ్డీ ఆదాయానికి పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది.

గ్రాట్యుటీ

ప్రభుత్వ ఉద్యోగులకు అందే గ్రాట్యుటీకి పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది. అదే ప్రైవేటు ఉద్యోగులైతే ఆదాయ పన్ను చట్టం నిబంధనలకు లోబడి రూ.20 లక్షల వరకే పన్ను మినహాయింపు లభిస్తుంది.

అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగేందుకు

మేడిన్ ఇండియా చిప్‌లు కీలకం

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

ఫాక్స్‌కాన్-హెచ్‌సీఎల్ చిప్ ప్లాంట్‌కు శంకుస్థాపన

గ్రేటర్ నోయిడా: భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడంతో పాటు స్వయం సమృద్ధి సాధించేందుకు ‘మేడిన్ ఇండియా’ చిప్ (సెమీకండక్టర)లు కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశీయ ఐటీ సంస్థ హెచ్‌సీఎల్, తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ గ్రూప్ సంయుక్త భాగస్వామ్యంలో ఉత్తరప్రదేశ్‌లోని జేవర్‌లో ఏర్పాటు చేస్తున్న చిప్‌ల తయారీ ప్లాంట్‌కు ప్రధాని శనివారం శంకుస్థాపన చేశారు. దృశ్య మాధ్యమ విధానంలో సాగిన ఈ కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. కొవిడ్ సంక్షోభ సమయంలో చిప్‌ల సరఫరాకు అంతరాయం కలగడంతో పలు ఆర్థిక వ్యవస్థల పురోగతి స్తంభించిపోయింది. చాలా ఫ్యాక్టరీల్లో పని నిలిచిపోయిందన్నారు. “భారత్ స్వయం సమృద్ధి సాధించగలిగితేనే అభివృద్ధి చెందిన దేశంగా అవతరించగలదు. అందుకు మేడిన్ ఇండియా చిప్‌లు చాలా ముఖ్యం. ఈ దశాబ్దంలో భారత్ సాంకేతిక రంగంలో పురోగతికి చేస్తున్న కృషి, 21వ శతాబ్దంలో మన సామర్థ్యానికి పునాది కానుంద”ని ఆయన పేర్కొన్నారు.

రూ.3,700 కోట్ల పెట్టుబడులు: హెచ్‌సీఎల్ గ్రూప్, ఫాక్స్‌కాన్ 60:40 నిష్పత్తి భాగస్వామ్యంలో ఏర్పాటు చేసిన సంస్థ ‘ది ఇండియా చిప్ ప్రైవేట్ లిమిటెడ్’ ఈ చిప్‌ల తయారీ ప్లాంట్‌ను రూ.3,700 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేస్తోంది. నెలకు 20,000 చిప్‌ల తయారు చేయగలిగే ఈ ప్లాంట్‌లో 2028 నుంచి ఉత్పత్తి ప్రారంభం కావచ్చని అంచనా. ఈ ప్లాంట్ 3,500 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించనుంది.

ఎన్ఎండీసీ, వేల్ ఎస్ఏతో అదానీ గంగవరం పోర్ట్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగానికి చెందిన ఎన్ఎండీసీ, బ్రెజిల్ కంపెనీ వేల్ ఎస్ఏతో అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఏపీసెజ్) లిమిటెడ్ అనుబంధ విభాగమైన అదానీ గంగవరం పోర్ట్ లిమిటెడ్ (ఏజీపీఎల్) వ్యూహాత్మక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఢిల్లీలో శనివారం జరిగిన ఇండియా-బ్రెజిల్ బిజినెస్ ఫోరమ్ సమ్మిట్‌లో బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా, భారత వాణిజ్య పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో ఈ ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా మూడు సంస్థలు కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని గంగవరం పోర్టులో ముడి ఇనుము (ఐరన్ ఓర్) బ్లెండింగ్ యూనిట్‌తో పాటు ఇందుకోసం ప్రత్యేకంగా ఓ సెజ్‌ను ఏర్పాటు చేయనున్నాయి.

ఎల్ఐసీ ఎంఎఫ్ టెక్నాలజీ ఫండ్

ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్.. టెక్నాలజీ ఫండ్‌ను ప్రారంభించింది. భారత టెక్నాలజీ రంగంలోని అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ప్రత్యేకంగా రూపొందించిన థీమాటిక్ ఈక్విటీ పథకం ఇది. ఈ ఫండ్‌కు బీఎస్ఈ టెక్ టోటల్ రిటర్న్ ఇండెక్స్ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. సిప్ రూపంలో అయితే రోజుకు కనీసం రూ.100. నెలవారీగా రూ.200 పెట్టుబడిగా పెట్టవచ్చు. ముగింపు తేదీ ఈ నెల 20.

● హెల్త్‌కేర్ ఎకోసిస్టమ్ కోసం సమగ్ర యూనిఫైడ్ ఏఐ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేయనున్నట్లు టేక్ సొల్యూషన్స్ ప్రకటించింది. హాస్పిటల్స్, డయాగ్నోస్టిక్ లేబొరేటరీస్, క్లినికల్ ట్రయల్ సంస్థలకు వన్‌స్టాప్ డిజిటల్ మౌలిక సదుపాయాలను అందించేందుకు దీన్ని ప్రత్యేకంగా డిజైన్ చేయనున్నట్లు వెల్లడించింది. అలాగే ఏఐ ఆధారిత ప్రివెంటివ్ హెల్త్‌కేర్ ప్లాట్‌ఫామ్‌తో పాటు త్వరలో అందుబాటులోకి రానున్న ప్లాట్‌ఫామ్స్‌ను ఆంత్రోపిక్ ఏఐ అసిస్టెంట్ క్లాడ్‌తో అనుసంధానం చేయనున్నట్లు ప్రకటించింది.

ఏపీ నిట్.. అదే తంతు!

▸ వచ్చే ఏడాదీ 480 సీట్లకే అడ్మిషన్లు .. వసతుల కొరతతో తగ్గింపు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఏపీ నిట్)లో వచ్చే విద్యా సంవత్సరంలోనూ సీట్లు పెరిగే పరిస్థితి కనిపించడం లేదు. కేంద్రం నిధులు మంజూరు చేయకపోవడంతో మౌలిక వసతుల కల్పన ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా విద్యార్థులకు హాస్టల్ వసతికి సమస్య ఏర్పడటంతో మూడేళ్ల క్రితం నిట్‌లో సీట్లను తగ్గించారు. అప్పటి వరకు ఏటా 750 మందికి అడ్మిషన్లు కల్పించేవారు. తర్వాత 480 సీట్లకు తగ్గించారు. ఓవైపు కేంద్రం మంజూరు చేసిన 62 ఫ్యాకల్టీ పోస్టులను భర్తీ చేయలేకపోయారు. రెగ్యులర్ డైరెక్టర్ లేకపోవడంతో ఇంటర్వ్యూలు నిర్వహించడం లేదు. ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఎన్వీ రమణారావు పోస్టులపై నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. నోటిఫికేషన్ దగ్గరే భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. ఫ్యాకల్టీ పోస్టుల కోసం మొత్తం 3 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని భర్తీ చేయాల్సి ఉంది. ఇంకోవైపు డైరెక్టర్ నియామకానికి కేంద్రం నోటిఫికేషన్ జారీచేసి ఏడాది పూర్తయింది. ఇంటర్వ్యూలు నిర్వహించి ముగ్గురు అభ్యర్థులను గుర్తించారు. వారిలో ఒకరిని డైరెక్టర్‌గా నియమించాల్సి ఉంది. రోజులు గడిచిపోతున్నా నియాకంపై నిర్ణయం తీసుకోవడం లేదు. ఇదిలాఉంటే హాస్టల్ వసతితో పాటు, అకడమిక్ భవనాలు, ఇతర మౌలిక సదుపాయల కోసం రూ.400 కోట్లు మంజూరు చేయాలని ఏపీ నిట్ నుంచి కేంద్రానికి ప్రతిపాదనలు వెళ్లాయి. ఆర్థికశాఖ వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉంది. ఈ నిధులు మంజూరైతే విద్యార్థులకు అవసరమైన సదుపాయాలతో పాటు మళ్లీ 750 సీట్లకు అడ్మిషన్లు కల్పించనున్నారు. కేంద్రం నుంచి ఇంతవరకూ స్పందన లేకపోవడంతో 2026-27 విద్యా సంవత్సరంలోనూ 480 సీట్లకే అడ్మిషన్లు కల్పించేలా నిట్ నిర్ణయం తీసుకుంది.

ఇంటర్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షలను ఎలాంటి లోటుపాట్లూ లేకుండా అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుందని ఇంటర్ బోర్డు కార్యదర్శి రంజిత్ బాషా తెలిపారు. సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 1537 పరీక్ష కేంద్రాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిపి 10,57,312 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారని శనివారం పేర్కొన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లోనూ తాగునీరు, విద్యుత్తు తదితర మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు తగినంత గాలి, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రతి పరీక్ష గదిలో సీసీ కెమెరాలతోపాటు జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో జిల్లాస్థాయి పరీక్షా కమిటీలు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తాయని తెలిపారు. ఉదయం 9గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరని స్పష్టం చేశారు.

ఆప్కోతో టీటీడీ ఒప్పందం

▸ కండువాలు, దుశ్శాలువాలు, ఇతర వస్త్రాలకు ఆర్డర్

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకునే భక్తులకు వేదాశీర్వచనంలో అందజేసే కండువాలు, దుపట్టాలు, కాటన్ బ్లౌజ్‌లు, ఇతర వస్త్రాలను సరఫరా చేయడానికి టీటీడీతో ఆప్కో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు టీటీడీ మార్కెటింగ్ విభాగం నుంచి ఆర్డర్ వచ్చింది. మొదటి విడతగా 3వేల కండువాలు, 5 వేల దుశ్శాలువాలు, 90 వేల కాటన్ అప్పర్‌లు, 75వేల కాటన్ బ్లౌజ్‌లు సరఫరా చేయాలని, వాటిపై 'ఓం నమో వెంకటేశాయ' అని తెలుగులో, సంస్కృతంలో ముద్రించాలని ఆర్డర్‌లో స్పష్టం చేశారు. ఆప్కో చరిత్రలో మొదటిసారి టీటీడీతో ఒప్పందం చేసుకోవడం ఆనందకరమైన విషయమని, ఇది నేతన్నలకు.. ఆ వెంకన్న దీవెనలాంటిదని మంత్రి సవిత శనివారం పేర్కొన్నారు. నేతన్నలకు 365 రోజులూ ఉపాధి, ఆర్థిక భరోసాతో కూడిన జీవనం అందించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యానికనుగుణంగా నిర్ణయం తీసుకున్నారంటూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, పాలకమండలికి మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు.

సివిల్ ఏవియేషన్‌లోనూ

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్

▸ తిరుమల తరహాలోనే ఏర్పాటు చేస్తాం

▸ కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



ఆలయం ముందు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

తిరుమల/తిరుపతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సివిల్ ఏవియేషన్‌లోనూ తిరుమల తరహా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలసి వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించారు. తర్వాత మంత్రి మీడియాతో మాట్లాడారు. 'తిరుమలలో ఇటీవల ప్రారంభమైన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించాం. మేం కూడా సివిల్ ఏవియేషన్‌లో ఇటువంటి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటుచేయాలని ఎంతోకాలంగా ప్రయత్నిస్తున్నాం. మాకు ఎంతో ఉపయోగపడేలా బ్రహ్మాండంగా తిరుమలలో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసిన టీటీడీకి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాం. ఇలాంటి సెంటర్‌ను ఏర్పాటు చేయాలంటే చాలా ఏళ్లు పడుతుంది. కొంతమంది ఎన్ఆర్ఐ భక్తులు కలసి తిరుమలలోని పరిస్థితులకు అనుగుణంగా ప్రస్తుత ఏఐ టెక్నాలజీని వినియోగించుకుని మంచి సౌకర్యాలతో భక్తులకు తక్కువ సమయంలోనే దర్శనం చేయించేలా ఈ సెంటర్ ఏర్పాటు చేయడం గొప్ప విషయం. దీనికోసం పనిచేసిన బృందంతో త్వరలోనే సమావేశమవుతాం' అని రామ్మోహన్ నాయుడు తెలిపారు. 'దేశంలో విమానాశ్రయాలు, ఏవియేషన్ సెక్టార్ ఎంతటి అభివృద్ధి సాధించాయో అందరూ చూస్తునే ఉన్నారు. 2014కు ముందు దేశంలో 74 విమానాశ్రయాలు ఉంటే నేడు ఆ సంఖ్య సుమారు 165 చేరింది. రానున్న 20 ఏళ్లలో ప్రతి ఏడాది 10% గ్రోత్ రేట్‌తో ఈ సెక్టార్ ముందుకు వెళుతుంది. ఇలాంటి సమయంలో ఆపరేషన్స్, ప్రయాణికుల సౌకర్యాలు, విమానాశ్రయాల కార్యకలాపాలను తిరుమలలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఆపరేట్ చేయగలిగితే ప్రయాణికులకు మంచి సౌకర్యాలు అందుతాయి. దర్శనం, ప్రసాదాలు ఇతర సౌకర్యాలను చాలామంది భక్తులు మెచ్చుకుంటున్నారు. దీనిపై సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నా' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

తిరుపతి విమానాశ్రయం నుంచి త్వరలో అంతర్జాతీయ సర్వీసులు

తిరుపతి విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు ఈ ఏడాదిలోపు ప్రారంభమవుతాయని రామ్మోహన్ నాయుడు తెలిపారు. తిరుపతిలోని అమరరాజ ఆడిటోరియం లో కృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (కెకా) స్వర్ణోత్సవ వేడుక శనివారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. 'తిరుపతి విమానాశ్రయం నుంచి గత ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 10 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఇప్పటివరకు ఇదే పెద్ద సంఖ్య. తిరుపతి నుంచి వారణాసి, అయోధ్యలకు విమానాలను నడపనున్నాం' అని కేంద్ర మంత్రి ప్రకటించారు. తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు చేసిన అభ్యర్థనపై స్పదిస్తూ... త్వరలోనే కోయంబత్తూరుకు విమాన సర్వీసులను కూడా అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మురళీమోహన్, అమరరాజ సంస్థల అధినేత, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్, కెకా అధ్యక్షురాలు రమాదేవి పాల్గొన్నారు.

స్తంభించిన 'సహకారం'

▸ నిలిచిపోయిన రుణాల రికవరీ

▸ సొసైటీల్లో లావాదేవీలు, రైతు సేవలకు ఆటంకం

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు నిరవధిక సమ్మె కారణంగా పీఏసీఎస్‌ల్లో ఆర్థిక లావాదేవీలకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా వ్యవసాయ రుణాల రికవరీ ప్రక్రియ నిలిచిపోయింది. పీఏసీఎస్ ఉద్యోగుల హెచ్ఆర్ పాలసీకి సంబంధించి 2019 మార్చి 1న అప్పటి టీడీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవో 36ను అమలు చేయకపోవడం, దీర్ఘకాల డిమాండ్లను పరిష్కరించకపోవడం వల్ల పీఏసీఎస్ ఉద్యోగులు ఉద్యమ బాట పట్టారు. వాస్తవంగా 2019 మార్చిలో జీవో వచ్చినా.. సార్వత్రిక ఎన్నికల కారణంగా అమలు కాలేదు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం హెచ్ఆర్ పాలసీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా... మరో జీవో జారీచేసి, ఉద్యోగుల సర్వీస్ రిజిస్టర్లు తయారు చేసి, బదిలీలు చేయాలని భావించింది. దీనిపై ఉద్యోగుల నుంచి వ్యతిరేకత రావడంతో ఏదీ ముందుకు తీసుకెళ్లకుండా, ఐదేళ్లు కాలక్షేపం చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పీఏసీఎస్ ఉద్యోగులు పలుమార్లు ఆందోళనలు చేపట్టారు. ఇప్పుడు నిరవధిక సమ్మె ప్రారంభించారు. అత్యధిక శాతం సీఈవోలు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్‌లు, ఇతర సిబ్బంది సమ్మెలోకి వెళ్లారు. పంట రుణాలు, దీర్ఘకాల వ్యవసాయ రుణాలను రికవరీ సమయంలో ఉద్యోగులు సమ్మె బాట పట్టడంతో రాష్ట్రవ్యాప్తంగా 2వేలపైగా పీఏసీఎస్‌ల్లో లావాదేవీలు స్తంభించాయి. వేల కోట్ల రుణాల రికవరీ నిలిచిపోయింది. గతేడాదిగా పీఏసీఎస్‌లు కంప్యూటరీకరణ జరగడంతో రుణాల రీషెడ్యూల్, పుస్తకాల్లో సర్దుబాటు వంటివి సాధ్యం కాని పరిస్థితి నెలకొంది. ప్రతి రైతు నుంచి రుణాల అసలు, వడ్డీ వసూలు చేసి, డీసీసీబీలకు జమ చేయాల్సి ఉంది. ఉద్యోగులు సమ్మెలో ఉండటంతో.. ఆర్థిక లావాదేవీలు స్తంభించాయి. సమ్మె నేపథ్యంలో హెచ్ఆర్ పాలసీ అమలుకు నిర్దిష్ట కాలపరిమితితో ప్రభుత్వం రూట్ మ్యాప్ ప్రకటించింది. కంప్యూటరీకరణ తర్వాత పీఏసీఎస్‌ల్లో ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేందుకు సిఫారసులు చేయడానికి, హెచ్ఆర్ పాలసీ సమస్యను పరిశీలించడానికి ఉన్నత స్థాయి కమిటీని నియమించింది.

పీఏసీఎస్ ఉద్యోగుల నిరవధిక సమ్మె

ఫలితమివ్వని ప్రత్యామ్నాయ చర్యలు

సమ్మె కాలంలో పీఏసీఎస్‌ల్లో రైతుసేవలకు అసౌకర్యం కలగకుండా సహకార శాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టింది. డీసీసీబీల్లోని సూపర్‌వైజర్లు, స్టాఫ్ అసిస్టెంట్లను పీఏసీఎస్‌ల్లో తాత్కాలికంగా ఇన్‌చార్జిలుగా నియమించాలని సహకార శాఖ కమిషనర్ ఆప్కాబ్ ఎండీకి లేఖ రాశారు. దీనిపై ఏపీ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. పీఏసీఎస్ ఉద్యోగుల సహకారం లేకుండా డీసీసీబీ అధికారులు రైతులతో లావాదేవీలు, రోజువారీ కార్యకలాపాలు, రికార్డుల నిర్వహణ సాధ్యం కాదని స్పష్టం చేసింది. డీసీసీబీ సూపర్‌వైజర్లు, స్టాఫ్ అసిస్టెంట్లను పీఏసీఎస్‌లకు ఇన్‌చార్జిలుగా నియమిస్తే, డీసీసీబీల్లో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలుగుతుందని స్పష్టం చేసింది. అలాగే పీఏసీఎస్ ఉద్యోగుల ఆందోళనను పరోక్షంగా పలుచన చేయడం తమకిష్టం లేదని అసోసియేషన్ స్పష్టం చేసింది. దీంతో ఓవైపు పీఏసీఎస్ ఉద్యోగుల సమ్మె, మరోవైపు డీసీసీబీ ఉద్యోగుల సంఘం అభ్యంతరాలతో సమస్య జఠిలమౌతోంది. ఈ పరిస్థితుల్లో పీఏసీఎస్‌ల్లో సేవలకు జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉన్న సహకార శాఖ ఉద్యోగులను వినియోగించవచ్చని అనుకుంటున్నారు.

భార్య సౌకర్యానికే ప్రాధాన్యం ఇవ్వాలి

▸ వైవాహిక వివాదాల కేసుల బదిలీలపై హైకోర్టు స్పష్టత

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వైవాహిక వివాదాలకు సంబంధించి నమోదైన కేసుల బదిలీ విషయంలో హైకోర్టు స్పష్టత ఇచ్చింది. దంపతుల మధ్య వివాదం తలెత్తినప్పుడు, కేసు విచారణ ఏ ప్రాంతంలో జరగాలనే విషయంలో భర్త కంటే భార్య సౌకర్యానికే ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంది. బదిలీ పిటిషన్ల విచారణ సందర్భంగా సామాజిక, ఆర్థిక స్థితిగతులను పరిగణలోకి తీసుకోవాలని తెలిపింది. భార్యకు తగినంత ఆర్థిక స్థోమత లేకున్నా, ప్రయాణ ఇబ్బందులున్నా ఆమె అభ్యర్థనను పరిగణలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. వైవాహిక వివాదాలకు సంబంధించి రెండు వేర్వేరు కేసులలో తమ భర్త దాఖలు చేసిన పిటిషన్లను తమకు అనుకూలమైన ప్రాంతానికి బదిలీ చేయాలని ఇద్దరు మహిళలు దాఖలు చేసిన పిటిషన్లను అనుమతిచ్చింది. విడాకుల కోసం పిటిషన్లు వేసిన భర్తలను తప్పనిసరిగా కోర్టు ముందు హాజరుకావాలని ఒత్తిడి చేయవద్దని, క్రాస్ ఎగ్జామినేషన్, ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే హాజరుకు ఆదేశించాలని సంబంధిత కోర్టును ఆదేశించింది. భర్త తరఫున న్యాయవాది హాజరవుతున్నంత కాలం వ్యక్తిగత హాజరు అవసరం లేదని స్పష్టం చేసింది. ఈమేరకు న్యాయమూర్తి జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు ఇటీవల తీర్పు ఇచ్చారు. గుంటూరుకు చెందిన మోహనమురళి, అతడి భార్య రాజేశ్వరి మధ్య వివాదాలు తలెత్తడంతో పిల్లలతో కలిసి రాజేశ్వరి ఒంగోలులో నివాసం ఉంటున్నారు. భర్త నుంచి మనోవర్తి కోరుతూ రాజేశ్వరి 2021లో ఒంగోలు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. భార్యనుంచి విడాకులు కోరుతూ మురళి రేపల్లె కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా రేపల్లె కోర్టుకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని విడాకుల కేసును ఒంగోలుకు బదిలీ చేయాలని కోరుతూ రాజేశ్వరి 2025లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే తిరుపతికి చెందిన పవన్, అతడి భార్య ఐశ్వర్య మధ్య వివాదాలు తలెత్తడంతో ఐశ్వర్య ఆదోనిలోని తన తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. విడాకులు కోరుతూ తిరుపతి కోర్టులో భర్త దాఖలు చేసిన కేసు విచారణకు తాను రావాలంటే 400 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని, కేసును ఆదోనికి బదిలీ చేయాలని ఐశ్వర్య మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు వ్యాజ్యాలపై విచారణ జరిపిన న్యాయమూర్తి... కేసుల విచారణ విషయంలో భర్త కంటే భార్యల సౌకర్యానికే ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో మత్స్యకార కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా

మత్స్యకార కుటుంబాలకు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్ సొమ్ము విడుదలకు మంత్రి అచ్చెన్నాయుడు చొరవ చూపారు. వేట సమయంలో ప్రమాదవశాత్తు మరణించిన 95 మంది మత్స్యకారుల కుటుంబాలకు రూ.4.75కోట్లు విడుదల చేసినట్లు మత్స్యశాఖ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. 2018 నుంచి వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న క్లైములను మంత్రి అచ్చెన్న ఆదేశాలతో పరిష్కరించినట్లు వెల్లడించింది. 90 మంది కుటుంబాల బ్యాంకుఖాతాల్లో నేరుగా ఎక్స్‌గ్రేషియా సొమ్మును జమ చేసినట్లు పేర్కొంది. సాంకేతిక సమస్యని పరిష్కరించి, మిగిలిన ఐదుగురికి ఎక్స్‌గ్రేషియా అందిస్తామని తెలిపింది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కథ విని షాక్ అయ్యాను

గోపీచంద్ మలినేని



'వరలక్ష్మి శరత్‌కుమార్ చాలా అద్భుతమైన వ్యక్తి. నా సినిమా 'క్రాక్'లో జయమ్మ పాత్రలో ఆమె పరకాయ ప్రవేశం చేసిన విధానం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఆమె 'సరస్వతి' కథ చెప్పినపుడు విని షాక్ అయ్యాను. ఈ సినిమాను థియేటర్లో చూసిన ప్రేక్షకులు థ్రిల్ అవుతారు. ప్రతి తల్లితండ్రి చూడాల్సిన గొప్ప సినిమా ఇది' అని దర్శకుడు గోపీచంద్ మలినేని అన్నారు. వరలక్ష్మి శరత్‌కుమార్ స్వీయ దర్శకత్వంలో నటించిన చిత్రం 'సరస్వతి'. పూజ శరత్‌కుమార్, వరలక్ష్మి శరత్‌కుమార్ సంయుక్తంగా నిర్మించారు. మార్చి 6న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను గోపీచంద్ మలినేని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి మాట్లాడుతూ 'ఈ చిత్రంలో సందేశంతో పాటు వాణిజ్య హంగులు ఉన్నాయి. అందరూ ఈ సినిమాను ఆదరించి ఇండస్ట్రీలో మహిళలను ప్రోత్సహించాలని కోరుతున్నాను' అని చెప్పారు.

ఇంతకీ హీరో ఎవరు?



అగ్ర నటులు కమల్ హాసన్, రజనీకాంత్‌లు నటించే చిత్రం ప్రత్యేక ప్రోమోను మేకర్స్ శనివారం విడుదల చేశారు. అందులో కమల్ హాసన్, రజనీకాంత్‌లు పోటాపోటీగా స్టైలిష్‌గా కనిపించారు. ప్రోమోలో ముందుగా ఎవరి గదిలోకి వెళ్లాలన్న కన్ఫ్యూజన్‌లో దర్శకుడు నెల్సన్ ఉండగా, అటుగా వచ్చిన సంగీత దర్శకుడు అనిరుధ్.. షణ్ముగప్రియ ట్యూన్ ఎంపిక చేసుకున్న విధానం ఫన్నీగా ఉంది. కాస్ట్యూమ్స్, బూట్లు, బెల్ట్, రిస్ట్‌వాచ్, కళ్లద్దాలు ఇలా ప్రతిదానిలో కమల్ - రజనీల డామినేషన్ చూపిస్తూ, ఆద్యంతం ఆకట్టుకునేలా ప్రోమోను డిజైన్ చేశారు. కారు గ్యారేజీలో ఇద్దరు హీరోలు స్టైల్‌గా నడుచుకుంటూ వచ్చే సీన్, ఒకరికొకరు ఎదురుగా నిలబడే షాట్ ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత రజనీ తనదైన శైలిలో కారు కీ ఇవ్వడం, దాన్ని కమల్ స్టైల్‌గా పట్టుకుని డ్రైవింగ్ సీటులో కూర్చోవడం ఇలా ప్రతి టేక్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. చివరగా, నెల్సన్, అనిరుధ్‌లను 'హీరో ఎవరు?' అని కమల్ అడగ్గా... 'చెప్పండి జీ.. హీరో ఎవరు?' అని రజనీకాంత్ రెట్టించి అడగడం ఫన్నీగా ఉంది. రెడ్ జెయింట్ మూవీస్ భారీ బడ్జెట్‌తో నిర్మించే ఈ చిత్రానికి దర్శకత్వం నెల్సన్ దిలీప్ కుమార్. కెమెరా రాజీవ్ మేనన్, సంగీతం అనిరుధ్ రవిచందర్. కాగా, ఈ ఇద్దరు లెజెండ్స్ 46 యేళ్ళ తర్వాత ఒకే ఫ్రేమ్‌లో కనిపించనున్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)



అల్లు అర్జున్ పార్టీ

● హాజరైన రామ్‌చరణ్ దంపతులు

అల్లు శిరీష్ వివాహం తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో అల్లు వారింట పెళ్లి సందడి మొదలైంది. అల్లు శిరీశ్, నయనికల వివాహం మార్చి 6న జరగనున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా అల్లు అర్జున్ టాలీవుడ్‌లోని సినీ ప్రముఖుల కోసం తన ఇంట్లో గ్రాండ్ పార్టీ ఇచ్చారు. రామ్‌చరణ్ దంపతులు, హీరోలు సందీప్ కిషన్, సిద్ధు జొన్నలగడ్డ, సుశాంత్, తేజ సజ్జా, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్, హీరోయిన్లు మృణాల్ ఠాకూర్, రాశిఖన్నా, ఫరియా అబ్దుల్లా, నిధి అగర్వాల్, కృతి శెట్టి, నేహా శర్మ తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒకే ఫ్రేమ్‌లో అల్లు అర్జున్, రామ్‌చరణ్ కనిపించడంతో మెగా అభిమానులు ఫుల్ ఖుషీ అయ్యారు. అల్లు శిరీష్, నయనికల నిశ్చితార్థం గతేడాది అక్టోబరులో జరిగింది. ఇటీవలే వీరి పెళ్లికి మెగాస్టార్ చిరంజీవిని ఆహ్వానిస్తూ ఆయనకు తొలి శుభలేఖను అందించారు అల్లు శిరీష్.

పి. సుశీలకు క్రౌన్ ఆఫ్ ది మ్యూజిక్

అవార్డు ప్రదానం



తొంభై ఏళ్ళ వయసులోనూ నా స్వరార్చన కొనసాగుతోందంటే ప్రజల అభిమానం, దేవుని ఆశీస్సులు కారణమని ప్రఖ్యాత సినీ నేపథ్యగాయని డా. పి. సుశీల అన్నారు. శనివారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రముఖ గాయని సుశీలకు ప్రముఖ సినీనటుడు శోభన్‌బాబు 90వ జయంతిని పురస్కరించుకుని క్రౌన్ ఆఫ్ ది మ్యూజిక్-2026 అవార్డును ప్రదానం చేశారు. పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ ఛైర్మన్ కోలేటి దామోదర్, శోభన్‌బాబు సేవా సమితి జాతీయ అధ్యక్షుడు సుధాకర్‌బాబు, టి. రామకృష్ణ తదితరులతో కలిసి సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం, కార్యక్రమ నిర్వాహకురాలు ఆమని సంప్రదాయబద్ధంగా సత్కరించారు. పార్వతీశం మాట్లాడుతూ... ఏ నటి గొంతుకు అయినా సరిపోయేవిధంగా పాడగల ప్రతిభావంతురాలు సుశీల అన్నారు. దామోదర్, బొక్కా బీమ్‌రెడ్డిలు మాట్లాడుతూ... సుశీల దేశ సంపద అని ఆమెను భారతరత్నతో కేంద్రం గౌరవించాలని కోరారు. సీల్‌వెల్ కార్పొరేషన్, శ్రుతిలయ ఫౌండేషన్, అకాడమి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

కల్ట్... ప్రేక్షకులు కోరుకున్నది ఇస్తుంది

విష్వక్‌సేన్



సరికొత్త కథలను, భిన్నమైన జానర్లను ఎంచుకోవడంలో హీరో విష్వక్‌సేన్ ఎప్పుడూ ముందుంటారు. తాజాగా ఆయన స్వీయ దర్శకత్వంలో నటిస్తూ, సందీప్ కాకరాలతో కలసి నిర్మిస్తున్న చిత్రం 'కల్ట్'. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. ఎంజాయ్ చేయడానికి గోవా వెళ్లిన స్నేహితుల బృందం అక్కడ ప్రాణాంతకమైన ఓ గేమ్‌లో భాగమవుతారు. ఒక్కొక్కరిని చంపుతూ వెళ్లే ఆ గేమ్ మాస్టర్ రక్షకుడా? లేక రాక్షసుడా? అన్నదే ఈ సినిమా కథ అని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. ఈ సందర్భంగా విష్వక్‌సేన్ మాట్లాడుతూ 'ప్రేక్షకులు థియేటర్లలో ఏం మిస్ అవుతున్నారు అనే విషయాలను గమనించి వాటన్నింటిని కలిపి తీసిన సినిమానే ఈ 'కల్ట్'. కసిగా తీసిన సినిమా ఇది. హింస ఎక్కువగా ఉంటుంది కాబట్టి పిల్లలు, సున్నిత మనస్కులు మా సినిమా చూడొద్దు' అని అన్నారు. రవి బస్రూర్ మాట్లాడుతూ 'నా సంగీతంలోని ఆత్మను విష్వక్ గుర్తించి సత్కరించినందుకు ఆనందంగా ఉంది' అని చెప్పారు. రేపు బాక్సాఫీసు వసూళ్లు కూడా కల్ట్‌గానే ఉంటాయని తరుణ్ భాస్కర్ తెలిపారు.

ఒక రోజు ముందుగా



శ్రీవిష్ణు నటించిన 'విష్ణు విన్యాసం' చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. మొదట ఈ సినిమాను 28న రిలీజ్ చేయాలని ప్లాన్ చేసినప్పటికీ ఒక రోజు ముందే అంటే 27న విడుదల చేస్తున్నారు. నయన సారిక కథానాయికగా నటించిన ఈ చిత్రాన్ని యదునాథ్ మారుతీరావు దర్శకత్వంలో సుమంత్ నాయుడు నిర్మించారు. జాతకాలను విపరీతంగా నమ్మే శ్రీవిష్ణు పాత్ర వినోదభరితంగా ఉంటూ అందరినీ అలరిస్తుందని దర్శకుడు చెప్పారు. అలాగే హీరోయిన్ నయన సారిక పాత్ర కూడా కీలకం అని తెలిపారు. సత్య, బ్రహ్మాజీ, ప్రవీణ్, మురళీశర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, సత్యం రాజేశ్, శ్రీనివాస్ వడ్లమాని, గోపరాజు రమణ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. సాయిశ్రీరామ్ ఫొటోగ్రఫీ, రధన్ సంగీతాన్ని అందించారు.

విభిన్న కథాంశంతో మెప్పిస్తుంది

సత్యదేవ్



సతీశ్ నీనసాం, 'కాంతార' ఫేమ్ సప్తమి గౌడ జంటగా వినోద్ వీ దుండలే తెరకెక్కించిన చిత్రం 'ద రైజ్ ఆఫ్ అశోక'. హరి, జైష్ణవి, సతీశ్ నీనసాం సంయుక్తంగా నిర్మించారు. కళాసృష్టి ఇంటర్నేషనల్ బ్యానర్‌పై రవిశంకర్ విడుదల చేయనున్నారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతున్న సందర్భంగా హీరో సత్యదేవ్ ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'విభిన్న కథాంశం ఉన్న ఈ సినిమాకు విజయం తప్పకుండా దక్కుతుంది' అని అన్నారు. 'ఇది కేవలం కమర్షియల్ సినిమా కాదు. మంచి సందేశం ఉన్న చిత్రం' అని సతీశ్ నీనసాం చెప్పారు.

సుప్రీం నేత అలీ ఖమేనీని లేపేద్దాం

» వారసుడు మొజ్తబా, ముల్లాలనూ అంతం చేద్దాం

» ట్రంప్ వద్ద 'యుద్ధ' ప్రతిపాదనలు..ఓ వెబ్ పోర్టల్ కథనం

వాషింగ్టన్, ఫిబ్రవరి 21: ఇరాన్‌తో యుద్ధమే అనివార్యమైతే ఆ దేశంపై ఎలాంటి మిలిటరీ వ్యూహాలు అమలు చేయొచ్చుననేది అధికారులు కొన్ని ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎదుట ఉంచారు. ఇరాన్ సుప్రీం నేత అలీ ఖమేనీ, ఆయన వారసుడు మొజ్తబాలను హతమార్చడం సహా పలు ప్రతిపాదనలు వాటిలో ఉన్నట్టు ట్రంప్ ప్రభుత్వంలోని ఉన్నతాధికార వర్గాలను ఉటంకిస్తూ ఎక్సివోస్ అనే వెబ్ పోర్టల్ కథనం ప్రచురించింది. ఇరాన్ సుప్రీం నేత అలీ ఖమేనీ, మొజ్తబాలను ఎందుకు లక్ష్యం చేసుకోవాలో చెబుతూ, ఇరాన్‌లో చోటుచేసుకున్న ప్రతి దుశ్చర్యకూ వారిద్దరూ, ముల్లాలే కారణమని ట్రంప్ సీనియర్ సలహాదారు ఒకరు వ్యాఖ్యానించారు. అయితే, ట్రంప్ ఈ ప్రతిపాదనలపై ఇంతవరకు తుది నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ఇదిలా ఉండగా, ఇరాన్ పాలకుల ఉక్కుపాదం కింద అనతికాలంలోనే 32 వేల మంది బలయిపోయారని ట్రంప్ అన్నారు. నిష్పాక్షిక ఒప్పందాన్ని కుదుర్చుకునే దిశగా వెంటనే చర్చలకు సిద్ధం కావాలని ఇరాన్‌ను ఉద్దేశించి ఆయన హెచ్చరించారు. "నిర్బంధంలో ఉన్న వందలాది మంది అసమ్మతివాదులను వధించాలని, వారిని బహిరంగంలో క్రేన్లకు కట్టి ఉరి తీసేందుకు ఇరాన్ పాలకులు ఒక దశలో సిద్ధమయ్యారు. అలాంటి ఒక్క ఘటనకు ఒడిగట్టినా, మరుక్షణమే అమెరికా ప్రతిస్పందన చవిచూస్తారని హెచ్చరించాను. దీంతో 837 మందికి మరణశిక్ష నిలిపివేశారు" అని చెప్పారు.

శరణార్థుల వర్క్ పర్మిట్లపై ట్రంప్ కఠిన నిబంధనలు

వాషింగ్టన్, ఫిబ్రవరి 21: వలసదారులపై కఠిన విధానాలు అమలు చేస్తోన్న అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. అమెరికా ఆశ్రయం కోరే వారి(శరణార్థులు) విషయంలో ప్రతిపాదిత కొత్త నిబంధనలు వారు వర్క్ పర్మిట్లు పొందడాన్ని మరింత కఠినతరం చేయనున్నాయి. ఈ నిబంధనల ప్రకారం శరణార్థి దరఖాస్తుదారులకు వర్క్ పర్మిట్ల జారీని సుదీర్ఘ కాలం పాటు నిలిపివేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. కొత్త రూల్ ఖరారైతే.. కొన్ని శరణార్థి దరఖాస్తుల సగటు ప్రాసెసింగ్ సమయం 180 రోజులు లేదా అంతకంటే తక్కువకు చేరుకొనే వరకు కొత్త శరణార్థి దరఖాస్తుదారులకు వర్క్ పర్మిట్లు లభించవు. అంటే దీని ప్రకారం, ఆ కాల పరిమితికి చేరుకోవడానికి, వర్క్ పర్మిట్లు తిరిగి జారీ చేయడం ప్రారంభించడానికి 14 ఏళ్ల నుంచి 173 ఏళ్ల మధ్య ఎంతైనా సమయం పట్టొచ్చనేది ఒక అంచనా! యూఎస్‌సీఐఎస్ వద్ద ప్రస్తుతం శరణార్థుల వర్క్ పర్మిట్లకు సంబంధించి 14 లక్షల మేర దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ సంఖ్య న్యూహాంప్‌షైర్ రాష్ట్ర జనాభాతో సమానమని అధికారులు తెలిపారు.

భారత్‌లో బంగ్లా వీసా సేవల పునఃప్రారంభం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: వీసా సర్వీసులతోపాటు భారత్‌లోని రాయబార కార్యాలయాల్లో దౌత్యసేవలను బంగ్లాదేశ్ పూర్తిస్థాయిలో పునఃప్రారంభించింది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు అగర్తల, సిలిగురిల్లోని దౌత్య కార్యాలయాలు పునరుద్ధరించారు. దౌత్య కార్యాలయాల వద్ద నిరసనల నేపథ్యంలో భద్రతా కారణాల రీత్యా.. అనివార్య పరిస్థితుల్లో 2025 డిసెంబర్ 22 నుంచి ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్, అగర్తలలోని బంగ్లాదేశ్ సహాయ హైకమిషన్ సేవలను నిరవధికంగా నిలిపివేశారు. తర్వాత కొద్ది రోజులకు సిలిగురిలోని వీసా దరఖాస్తుల కేంద్రాన్ని మూసివేశారు. అయితే, ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) నాయకుడు తారిఖ్ రెహ్మాన్ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన కొన్ని రోజులకే భారత్‌లో దౌత్య, వీసా సర్వీసులను పునఃప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు.

భారత్, బ్రెజిల్ మధ్య వాణిజ్యం వచ్చే ఐదేళ్లలో 20 బిలియన్ డాలర్లకు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: భారత్, బ్రెజిల్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని వచ్చే ఐదేళ్లలో 20బిలియన్ డాలర్లకు(రూ.1.81లక్షల కోట్లు) పెంచుకోవాలని ప్రధాని మోదీ, బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వా నిర్ణయించారు. క్రిటికల్ మినరల్స్ విషయంలో పరస్పర సహకారం కోసం ఒప్పందం కూడా చేసుకున్నారు. రక్షణ, విద్యుత్, ఆరోగ్యం, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో కూడా సహకరించుకోవాలని నిర్ణయించారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సులో పాల్గొనడం కోసం ఐదు రోజుల పర్యటనలో భాగంగా ఈ నెల 18న ఇండియాకు వచ్చిన లులా డసిల్వా ప్రస్తుతం భారత్‌లోనే ఉన్నారు. శనివారం ప్రధాని మోదీతో సమావేశమై ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య వాణిజ్య విలువ 12బిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో భారత్ ఎగుమతులు 6.77బిలియన్ డాలర్లు కాగా, బ్రెజిల్ ఎగుమతులు 5.43బిలియన్ డాలర్లు.

ఆరు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సవరణ పూర్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం 6 రాష్ట్రాలు, 3కేంద్రపాలిత ప్రాంతాల్లో పూర్తయింది. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం ఎన్నికల సంఘం విడుదల చేసింది. గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కేరళ, గోవా రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలైన అండమాన్-నికోబార్, లక్షద్వీప్, పుదుచ్చేరిల్లో ఈ కార్యక్రమం పూర్తయినట్టు పేర్కొంది. మరణించినవారు, శాశ్వతంగా వలసవెళ్లిన వారు, ఒకటికన్నా ఎక్కువ చోట్ల నమోదు చేసుకున్నవారు, అర్హత లేని వారి పేర్లను తొలగించినట్టు తెలిపింది. అర్హుల పేర్లను నమోదు చేసినట్టు వివరించింది. గుజరాత్‌లో అత్యధికంగా 68.12 లక్షల ఓట్ల(13.03%)ను తొలగించింది. మధ్యప్రదేశ్‌లో 34.25 లక్షలు, రాజస్థాన్‌లో 31.36 లక్షలు, ఛత్తీస్‌గఢ్‌లో 24.99 లక్షలు, కేరళలో 8.97 లక్షలు, గోవాలో 1.27 లక్షల ఓట్లను తొలగించినట్టు వివరించింది. లక్షద్వీప్‌లో కేవలం 206 ఓట్లను మాత్రమే తొలగించడం గమనార్హం.

అవిముక్తేశ్వరానందపై పోక్సో కేసు పెట్టండి

» ప్రయాగ్‌రాజ్ కోర్టు ఆదేశం

ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 21: బాలురను లైంగికంగా వేధించారన్న ఆరోపణలపై శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతిపై పోక్సో కేసు నమోదు చేయాలని శనివారం స్థానిక కోర్టు పోలీసులను ఆదేశించింది. పోక్సో చట్టం ప్రత్యేక న్యాయస్థానం జడ్జి వినోద్ కుమార్ చౌరాసియా..ఝున్సీ పోలీసు స్టేషన్ అధికారికి ఈ ఆదేశాలు ఇచ్చారు. వారణాసిలోని విద్యా మఠం అయిదో అంతస్తులో.. ఆశ్రమంలో పనిచేసే 'బట్కూ' (బాలురు)లను లైంగికంగా వేధించినట్టు అశుతోష్ బ్రహ్మచారి మహరాజ్ చేసిన ఫిర్యాదు మేరకు కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. మౌనీ అమావాస్య సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించిన మాఘమేళాలో అవిముక్తేశ్వరానంద పవిత్ర స్నానం చేయకుండా అధికారులు అడ్డగించడం గమనార్హం. ఆయన శంకరాచార్య పదవిలో లేరని అభ్యంతరం తెలిపారు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ బీజేపీ ఎమ్మెల్యే



బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని గదగ్ జిల్లా శిరహట్టి బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ చంద్రు లమాణి కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. లోకాయుక్త అధికారులు శనివారం దాడులు నిర్వహించి, ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విజయ పూజార్ అనే కాంట్రాక్టర్ గదగ్ జిల్లా సంకదాళ గ్రామంలో రోడ్డు మరమ్మతు, ప్రహరీ నిర్మాణ పనులను దక్కించుకున్నారు. రూ.కోటి విలువైన ఈ పనులకు ఎమ్మెల్యే రూ.11 లక్షలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో కాంట్రాక్టర్ లోకాయుక్త పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్యాన్సర్ సోకిన పిల్లల్లో 94.5% మందికి నయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: చిన్నతనంలోనే(18ఏళ్ల లోపు వయసు) క్యాన్సర్ సోకి ఆ వ్యాధి నుంచి బయటపడిన వారి వివరాలతో దేశంలోనే మొట్టమొదటిసారి రిజిస్ట్రీని ఏర్పాటు చేశారు. ఈ రిజిస్ట్రీ ప్రకారం క్యాన్సర్ చికిత్స పొందిన చిన్నారుల్లో 94.5శాతం మంది ఆ మహమ్మారి నుంచి బయటపడ్డారు. ఢిల్లీలోని ఎయిమ్స్, రాజీవ్ గాంధీ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు దేశవ్యాప్తంగా 5,419 మంది క్యాన్సర్ సోకిన పిల్లలపై అధ్యయనం నిర్వహించి వారికి వచ్చిన వ్యాధి, అందించిన చికిత్స విధానాలతో ఈ రిజిస్ట్రీని రూపొందించారు. ఈ 5,419మంది పిల్లల్లో 40శాతం మందికి ల్యుకేమియా(బ్లడ్ క్యాన్సర్) సోకింది.

సుంకాలు 15 శాతం



సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో వేసిన 10% టారిఫ్‌ను మరింత పెంచిన ట్రంప్

» కొన్ని నెలల్లో ఇంకా పెంచుతామని వెల్లడి

వాషింగ్టన్/ న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ప్రపంచదేశాలపై విధించిన 10శాతం సుంకాలను 15శాతానికి పెంచుతున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం ప్రకటించారు. అదనపు సుంకాలను రద్దు చేస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పూర్తిగా అధ్యయనం చేసిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. అంతేకాదు వివిధ న్యాయ, చట్టబద్ధమైన మార్గాల్లో మరిన్ని సుంకాలు విధిస్తామని స్పష్టం చేశారు. ట్రంప్ అడ్డగోలు అదనపు సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు శుక్రవారం రద్దు చేయడంతో.. అంతకుముందటి పాత సుంకాలు తిరిగి అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. కోర్టు తీర్పుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ట్రంప్.. వెంటనే పాత యాంటీ డంపింగ్, కౌంటర్ వెయిలింగ్, జాతీయ భద్రత సుంకాలను 10శాతానికి పెంచారు. మరునాడే దీనిని 15శాతానికి పెంచుతున్నట్టు ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. "అమెరికా సుప్రీంకోర్టు నిన్న ఇచ్చిన అమెరికా వ్యతిరేక, హాస్యాస్పదమైన తీర్పును క్షుణ్ణంగా, లోతుగా సమీక్షించి ఒక నిర్ణయం తీసుకున్నాను. దశాబ్దాలుగా అమెరికాను దోచుకుంటూ వస్తున్న(నేను అధ్యక్షుడిని అయ్యే వరకు) ప్రపంచ దేశాలపై నిన్న వేసిన 10% టారిఫ్‌ను 15శాతానికి పెంచుతున్నాను. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది. కొన్ని నెలల్లో న్యాయ, చట్టపరమైన మరిన్ని కొత్త టారిఫ్‌లను మా ప్రభుత్వం అమల్లోకి తెస్తుంది" అని ట్రంప్ పేర్కొన్నారు.

వెసులుబాటును పూర్తిగా వాడుకుంటూ..

అమెరికా వాణిజ్య చట్టం-1974లోని సెక్షన్ 122 ప్రకారం ఆ దేశ అధ్యక్షుడికి ప్రపంచంలోని ఏ దేశంపై అయినా గరిష్ఠంగా 15శాతం వరకు దిగుమతి సుంకాలు విధించే అధికారం ఉంది. ట్రంప్ శుక్రవారం ఈ చట్టం ప్రకారమే 10శాతం సుంకాలు వేశారు. శనివారం వెసులుబాటును పూర్తిగా వినియోగించుకుంటూ 15శాతానికి పెంచారు. ఇక ఇదే చట్టంలోని 201, 301 సెక్షన్లు, టారిఫ్‌ల చట్టంలోని 338వ సెక్షన్, వాణిజ్య విస్తరణ చట్టం-1962లోని సెక్షన్ 232 కింద కూడా సుంకాలు విధించేందుకు అవకాశం ఉంది. అయితే అవి అధ్యక్షుడి విచక్షణాధికారం మేరకు గంపగుత్తగా వేయడానికి వీల్లేదు. ఒక అధ్యయనం చేయించి.. నిర్దిష్ట ఉత్పత్తులతో దేశంలో వ్యాపారాలు, పరిశ్రమలకు ఇబ్బంది అని తేల్చి.. అందుకు అనుగుణంగా సుంకాలు వేయవచ్చు. ఇందుకోసం కొంత సమయం పడుతుంది. మరికొన్ని నెలల్లో కొత్తగా సుంకాలు వేస్తామని ట్రంప్ చేసిన ప్రకటన.. ఈ చట్టాల్లోని సెక్షన్ల ప్రకారం అధ్యయనాలు, చర్యలు చేపట్టేందుకేనని అమెరికా వాణిజ్య వర్గాలు చెబుతున్నాయి.

మొత్తంగా 15 శాతమే..

భారత్ సహా మొత్తం ప్రపంచ దేశాల దిగుమతులపై అమెరికా సుంకాలు 15శాతంగా ఉండనున్నాయి. భారత్ సహా అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకున్న/సిద్ధమైన దేశాలన్నింటికీ కూడా ప్రస్తుతానికి ఇదే వర్తించనుంది. సదరు ఒప్పందంలో టారిఫ్ శాతం ఎంత ఉన్నా కూడా ప్రస్తుతం తాత్కాలికంగా 15% సుంకాలకు మారుతాయని వైట్‌హౌజ్ వర్గాలు తెలిపాయి. ఉదాహరణకు భారత వస్త్రాలపై పాత సుంకాలు 7-9 శాతం వరకు ఉండగా ఇప్పుడు 15శాతంగా ఉంటాయి. అయితే ఉక్కు, అల్యూమినియంపై ఉన్న 50%, పలు రకాల వాహన విడిభాగాలపై ఉన్న 25 ప్రత్యేక టారిఫ్‌లు మాత్రం యథావిధిగా కొనసాగుతాయి. కాగా, అదనపు సుంకాలను సుప్రీంకోర్టు కొట్టివేసినా 2026లో తాము అంచనా వేసుకున్న మేరకు టారిఫ్‌ల ఆదాయం సమకూరుతుందని అమెరికా వాణిజ్య మంత్రి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. వాణిజ్య చట్టంలోని సెక్షన్ 122 కింద విధించిన 15శాతం సుంకంతోపాటు 232, 301 సెక్షన్ల కింద విధించబోయే సుంకాలు దీనికి దోహదం చేస్తాయని వెల్లడించారు.

టారిఫ్‌లపై పరిణామాలను పరిశీలిస్తున్నాం: వాణిజ్యశాఖ

అదనపు సుంకాలపై అమెరికా సుప్రీంకోర్టు తీర్పు, తదనంతరం జరిగిన పరిణామాలపై అధ్యయనం చేస్తున్నామని కేంద్ర వాణిజ్య శాఖ పేర్కొంది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన జారీ చేసింది. "అదనపు సుంకాలపై అమెరికా సుప్రీంకోర్టు తీర్పు, తర్వాత దానిపై అధ్యక్షుడు ట్రంప్ స్పందనను గమనించాం. ఈ అంశంలో అమెరికా ప్రభుత్వం పలు చర్యలను కూడా చేపట్టింది. ఈ అంశాలను, వాటితో నెలకొనే పరిణామాలపై అధ్యయనం చేస్తున్నాం" అని పేర్కొంది. వాణిజ్య ఒప్పందం గురించిగానీ, భారత్‌పై ప్రభావాల గురించిగానీ ఎలాంటి ప్రస్తావన చేయలేదు.

సుంకాల రద్దు తీర్పు వెనుక ఇద్దరు భారత సంతతి న్యాయవాదులు



దీపక్ గుప్తా, నీల్ కుమార్ కత్యాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ట్రంప్ సుంకాలు చెల్లవంటూ అమెరికా సుప్రీం కోర్టు సంచలన తీర్పు వెలువరించడం వెనుక భారత సంతతికి చెందిన ఇద్దరు న్యాయవాదులు నీల్ కుమార్ కత్యాల్, దీపక్ గుప్తా కీలక పాత్ర పోషించారు. ట్రంప్ యంత్రాంగం టారిఫ్‌లకు వ్యతిరేకంగా కత్యాల్, దీపక్ గుప్తా సుప్రీంకోర్టులో వాదించారు. ట్రంప్ టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ పిటిషన్లు వేసిన వ్యాపారులు, డెమోక్రాటిక్ పార్టీ పాలిత రాష్ట్రాల తరఫున సుప్రీంకోర్టులో నీల్ కత్యాల్ వాదనలు వినిపించారు. ప్రధానంగా 1977 నాటి అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టాన్ని (ఐఈపీఏ)ను ఆధారంగా చేసుకొని ట్రంప్ సుంకాలను విధించడాన్ని కత్యాల్ తన వాదనల్లో గట్టిగా వ్యతిరేకించారు. ప్రతి వాణిజ్య భాగస్వామిపైనా సుంకాలు విధించడం రాజ్యాంగ విరుద్ధం అని వాదించారు. ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఓ మైలురాయిగా కత్యాల్ అభివర్ణించారు. అధ్యక్షుడు శక్తిమంతుడే అయినా రాజ్యాంగం అంతకుమించి శక్తిమంతమైనదని.. చట్టపరమైన పాలనకు సుప్రీంకోర్టు దన్నుగా నిలబడింది అని పేర్కొన్నారు న్యాయవాదిగా కెరీర్ తొలినాళ్లలో కత్యాల్ అమెరికా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్టీఫెన్ బ్రేయర్ వద్ద కత్యాల్ క్లర్కుగా పనిచేశారు. కాగా రాజ్యాంగానికి వ్యతిరేకంగా ట్రంప్ యంత్రాంగం టారిఫ్‌లు విధించిందని దీపక్ గుప్తా వాదించారు.

ట్రంప్‌నకు 'బొమ్మ' కనిపించేలా చేసి..

సుంకాల వెనుక ఓ టాయ్స్ కంపెనీ న్యాయ పోరాటం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ఓ విధానం అంటూ లేకుండా ఇష్టారీతిన సుంకాల మోతతో ప్రపంచ దేశాలను వణికించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు అమెరికా సుప్రీంకోర్టు దిమ్మతిరిగే తీర్పు ఇచ్చిందంటే దాని వెనుక ఓ బొమ్మల కంపెనీ చేసిన పోరాటమూ ప్రధానమైనదే! అమెరికాలోని ఇలినాయిస్ కేంద్రంగా 'లెర్నింగ్ రిసోర్సెస్ లిమిటెడ్' అనే బొమ్మల కంపెనీ వ్యాపారం నడుపుతోంది. ఈ కంపెనీకి ఎక్కువకు ఎక్కువ బొమ్మలు చైనా నుంచే వస్తాయి. ట్రంప్ చైనా మీద సుంకాల వాత పెట్టడంతో బొమ్మల ధరలు బాగా పెరిగాయి. 'లెర్నింగ్ రిసోర్సెస్' కంపెనీ బిజినెస్ దెబ్బతింది. దిక్కుతోచని స్థితిలో కంపెనీ యజమాని రిక్ వోల్డెన్‌బర్గ్ సుంకాలకు వ్యతిరేకంగా గత ఏప్రిల్‌లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు పట్ల వోల్డెన్‌బర్గ్ హర్షం వ్యక్తం చేశారు.

లోకం తీరు



సుంకాల సొమ్ము రీఫండ్లపై సందిగ్ధత!

ట్రంప్ అదనపు సుంకాలను రద్దు చేసిన అమెరికా సుప్రీంకోర్టు.. ఇప్పటి వరకు వసూలు చేసిన సుంకాల మొత్తాన్ని తిరిగి చెల్లించాలా? ఏం చేయాలన్న అంశాన్ని ప్రస్తావించలేదు. దీనితో రీఫండ్ ఉంటుందా, లేదా? అన్నది సందిగ్ధంగా మారింది. ఒకవేళ రీఫండ్ చేసినా ఆ సొమ్ము మొత్తం వివిధ దేశాల నుంచి ఉత్పత్తులను దిగుమతి చేసుకున్న అమెరికన్ సంస్థలకే అందుతుందని.. భారత్‌గానీ, మరే దేశ సంస్థలకుగానీ ఆ సొమ్ము అందదని వాణిజ్య వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. సాంకేతికతంగా ట్రంప్ సుంకాలు దిగుమతులపై విధించినవి కావడమే ఇందుకు కారణమని వివరిస్తున్నాయి. దిగుమతి చేసుకున్న అమెరికన్ సంస్థలు/వ్యక్తులుగానీ.. వివిధ దేశాల నుంచి ఎగుమతులు చేసిన సంస్థలు/ వ్యక్తులుగానీ ఎవరు సుంకాల సొమ్మును భరించినా.. అది దిగుమతి చేసుకున్నవారి పేరిటే ప్రభుత్వానికి చేరుతుందని పేర్కొంటున్నాయి. కాగా, తాము చెల్లించిన దిగుమతి సుంకాల సొమ్మును రీఫండ్ చేయాలంటూ అమెరికా ప్రభుత్వంపై అక్కడి పలు సంస్థలు కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేశాయి. ఒకవేళ రీఫండ్ చేయాలని కోర్టులు ఆదేశించినా.. ఆ సొమ్ము అందేందుకు ఏడాదిన్నర నుంచి రెండేళ్లు సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఇక ట్రంప్ అదనపు సుంకాల కారణంగా తమ రాష్ట్ర రైతులు, పరిశ్రమలపై తీవ్ర భారం పడిందని, నిత్యావసరాల ధరలు భారీగా పెరిగాయని.. అందువల్ల తమ రాష్ట్రానికి రూ.81 వేల కోట్లు (9 బిలియన్ డాలర్లు) రీఫండ్‌గా ఇవ్వాలని అమెరికాలోని ఇల్లినాయిస్ గవర్నర్ జేబీ ప్రిట్జ్‌కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అధికారికంగా అధ్యక్షుడు ట్రంప్‌కు లేఖ కూడా రాశారు.

అమెరికాతో ట్రేడ్ డీల్‌పై మళ్లీ మొదటి నుంచి చర్చలు

» అమెరికా సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో కాంగ్రెస్ డిమాండ్



న్యూఢిల్లీ/ముంబై, ఫిబ్రవరి 21: అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) విషయంలో స్వదేశానికి ప్రధాని మోదీ చేసిన నమ్మకద్రోహం బట్టబయలైందని, ఆయన అమెరికాకు లొంగిపోయారని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ట్రంప్ సుంకాలు చట్ట విరుద్ధమని అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో మోదీపై రాహుల్‌గాంధీ ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. అమెరికాతో బీటీఏ భారత్‌కు తీవ్ర ప్రతిబంధకం కానుందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ అన్నారు. 'తన ఇమేజ్‌ను కాపాడుకొనేందుకు ప్రధాని వెనక్కి తగ్గకుండా కనీసం 18 రోజులపాటు గట్టిగా నిలబడినా నేడు భారతీయ రైతుల ప్రయోజనాలతోపాటు దేశ సార్వభౌమత్వానికి రక్షణ ఉండేది' అన్నారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో..ఆ దేశంతో వాణిజ్య ఒప్పందంపై మళ్లీ మొదటి నుంచి చర్చలు జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా, ఢిల్లీలో శుక్రవారం ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తల నిరసనపై బీజేపీ కార్యకర్తలు మహారాష్ట్రలోని భీవండీలో, ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ముందు నిరసన తెలిపారు.

12 రాష్ట్రాల్లో 32 నకిలీ వర్సిటీలు

» ఢిల్లీలో 12, ఏపీలో 2.. యూజీసీ వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో 32 నకిలీ యూనివర్సిటీలున్నాయని, ఇవి ఇచ్చే డిగ్రీలు చెల్లవని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) వెల్లడించింది. ఢిల్లీలో అత్యధికంగా 12 నకిలీ యూనివర్సిటీలున్నాయని తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో రెండు నకిలీ వర్సిటీలున్నాయని, గుంటూరులోని కాకుమానువారి తోటలో క్రైస్ట్ న్యూ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ, విశాఖపట్నంలోని ఎన్జీవోస్ కాలనీలో బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా పేర్లతో ఇవి ఉన్నాయని యూజీసీ తెలిపింది. ఈ వర్సిటీలపై చర్యలు తీసుకోవాలని ఆయా రాష్ట్రాలను కోరింది.

ఎర్రకోట సందర్శనకు ఇక అన్నిరోజులూ అనుమతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: దేశరాజధాని ఢిల్లీలోని చారిత్రక కట్టడం ఎర్రకోట ఇకపై వారంలో అన్ని రోజులు సందర్శకుల కోసం అందుబాటులో ఉండనుంది. సోమవారం రోజున ఎర్రకోటను మూసివేసే పద్ధతిని రద్దు చేసినట్లు భారత పురావస్తు సర్వే సంస్థ (ఏఎస్ఐ) అధికారులు వెల్లడించారు. ఈ మేరకు ఏఎస్ఐ డైరెక్టర్ జనరల్ ఫిబ్రవరి 13న జారీ చేసిన ఉత్తర్వులు ఇప్పటికే అమలులోకి వచ్చాయని, ఫిబ్రవరి 16న (సోమవారం) ఎర్రకోటను సందర్శకుల కోసం తెరిచే ఉంచామని తెలిపారు. ఈ నిర్ణయంతో దేశీయ, విదేశీ పర్యాటకులకు మరింత సౌకర్యం కలుగనుంది.

మానవాళికి సమానంగా ఏఐ ఫలాలు!

ఆ లక్ష్యంగా కొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలి

» 'న్యూఢిల్లీ ఏఐ సదస్సు' ఉమ్మడి ప్రకటన.. 88 దేశాల ఆమోదం

» ప్రపంచ సహకారానికి ఇదొక మైలురాయి: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' అనే హితోక్తితో మొదలైన 'ఢిల్లీ ఏఐ శిఖరాగ్ర సదస్సు'.. శనివారం ఆఖరి రోజున కూడా అదే స్ఫూర్తిని చాటే ఉమ్మడి ప్రకటనను ఆమోదించింది. కృత్రిమ మేధ (ఏఐ)తో ఒనగూరే ప్రయోజనాల్ని ప్రపంచ మానవాళికి అంతటికీ సమానంగా పంచాలని ఈ ప్రకటన పేర్కొంది. 'ఏఐ ప్రభావంపై న్యూఢిల్లీ డిక్లరేషన్' పేరుతో ఉన్న ఈ ప్రకటనను అమెరికా, బ్రిటన్, చైనా, ఫ్రాన్స్‌లతోపాటు 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు ఆమోదించాయని విదేశాంగశాఖ తెలిపింది. ఏఐ రంగంలో ప్రపంచ సహకారానికి సంబంధించి ఇదొక మైలురాయి అని వెల్లడించింది. ఆర్థిక ప్రగతి, సామాజిక సంక్షేమం కోసం ఏఐ ఉపయోగపడాలన్న అంతర్జాతీయ ఏకాభిప్రాయానికి నిదర్శనమని పేర్కొంది. కాగా, 'న్యూఢిల్లీ ఏఐ ప్రకటన'ను ఏడు అంశాలు పునాదిగా రూపొందించారు. అవి.. ఏఐ వనరుల ప్రజాస్వామీకరణ, ఆర్థిక ప్రగతి- సామాజిక సంక్షేమం, సురక్షిత విశ్వసనీయమైన ఏఐ, సైన్స్ కోసం ఏఐ, సామాజిక సాధికారత అవకాశాలు, మానవ వనరుల అభివృద్ధి, సమర్థవంతమైన వినూత్నమైన ఏఐ వ్యవస్థలు. ప్రపంచ ఆర్థికాభివృద్ధికి ఏఐ కీలక అంశంగా మారుతుందని, దీర్ఘకాలిక అంతర్జాతీయ ఒప్పందాలకు ప్రేరణగా నిలుస్తుందని 'న్యూఢిల్లీ ఏఐ డిక్లరేషన్' ఆశాభావం వ్యక్తం చేసింది. ఏఐ ఆధారిత పరిశోధనలను ముందుకు తీసుకెళ్లటానికి అంతర్జాతీయ శాస్త్ర పరిశోధన సంస్థల మధ్య ఏఐ నెట్‌వర్క్ ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. సుస్థిర, సమర్థవంతమైన ఏఐ వినియోగానికి మార్గదర్శకాలను కూడా రూపొందించుకోవాల్సి ఉందని పేర్కొంది.



శుక్రవారం ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూత్ కాంగ్రెస్ నిరసన

యూత్ కాంగ్రెస్ నిరసన వెనుక పెద్ద కుట్ర

» పాటియాలా కోర్టుకు తెలిపిన ఢిల్లీ పోలీసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూత్ కాంగ్రెస్ నేతలు చేపట్టిన నిరసన వెనుక పెద్ద కుట్ర ఉందని.. నేపాల్ ప్రభుత్వాన్ని కూల్చేసిన హింసాత్మక జెన్ జెడ్ ఉద్యమం నుంచి వారు ప్రేరణ పొందారని పాటియాలా హౌస్ కోర్టుకు ఢిల్లీ పోలీసులు తెలిపారు. 'నిరసన వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది. ఆందోళనకారులు దేశ వ్యతిరేక నినాదాలు చేశారు. ప్రధాని మోదీ అభ్యంతరకర చిత్రాలున్న టీషర్టులను ప్రదర్శించారు. నలుగురిని అదుపులోకి తీసుకున్నాం. మరికొందరు పారిపోయారు. అందర్నీ ముఖాముఖి, డిజిటల్ ఆధారాలతో ప్రశ్నించాల్సి ఉంది. వీరికి నిధులు ఎక్కడి నుంచి అందాయన్నది గుర్తించాల్సి ఉంది. నిందితుల ఫోన్ల నుంచి డేటా సేకరించి విశ్లేషిస్తున్నాం. ఘర్షణలో ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. లోతైన దర్యాప్తునకు నిందితులను 5 రోజుల పాటు కస్టడీకి అనుమతించండి' అని పోలీసులు కోరారు. 5 రోజుల పాటు నిందితుల పోలీసు కస్టడీకి న్యాయమూర్తి అనుమతించారు. కాగా, యూత్ కాంగ్రెస్ జాతీయ సమన్వయకర్త, జడ్చర్లకు చెందిన పి.నరసింహ యాదవ్ నేతృత్వంలో దాదాపు 10 మంది యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఏఐ సదస్సులో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ చొక్కాలు విప్పి అర్ధ నగ్న ప్రదర్శన చేపట్టిన సంగతి తెలిసిందే.

చందమామ 'చిన్న'బోతోంది


» ఉపరితలంపై కొత్తగా 1,114 పగుళ్లు

» వాటితో కుంచించుకుపోతున్న జాబిల్లి



చంద్రుడిపై ఏర్పడిన పగులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: చందమామ చిన్నబోతోంది. ఎక్కడికక్కడ పగుళ్లతో బక్కచిక్కిపోతోంది. చుక్కల రేడుకి ఇంత కష్టం ఎందుకంటే.. అక్కడ సంభవించే చంద్రకంపాలే కారణం అని పరిశోధకులు చెబుతున్నారు. చంద్రకంపాలు సాధారణమే అయినా, వాటితో ఏర్పడుతున్న పగుళ్లే జాబిల్లి కుంచించుకుపోవడానికి కారణం అంటున్నారు. చంద్రుడి ఉపరితలంపై తాజాగా మరిన్ని పగుళ్లు కనిపిస్తున్నాయని నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ మ్యూజియంకు చెందిన సెంటర్ ఫర్ ఎర్త్ అండ్ ప్లానెటరీ స్టడీస్ శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ పగుళ్ల కారణంగా చందమామ కుంచించుకుపోతోందని వారు వెల్లడించారు. చంద్రుడి అంతర్భాగం చల్లగా అయిపోతుండటం వల్ల ఇలా జరుగుతోందన్నారు. అయితే జాబిల్లిపై పగుళ్ల విషయం మన శాస్త్రవేత్తలకు 2010 నుంచి తెలుసు. అప్పట్లో చంద్రుడిపైన ఎత్తైన ప్రాంతాల్లోనే ఈ పగుళ్లను గుర్తించారు. కానీ ఇప్పుడు లూనార్ మారియా అనే మరో ప్రాంతాల్లో పగుళ్లు కనబడ్డాయి. ఈ ప్రాంతం పురాతన అగ్నిపర్వత విస్ఫోటం వల్ల ఏర్పడింది. ఈ విస్ఫోటం జాబిల్లి ఉపరితలంపై పెద్ద, చీకటి, బసాల్ట్ మైదానాన్ని సృష్టించింది. చంద్రుడి అంతర్భాగంలో ఒత్తిడి వల్ల పైకి ఉబికి వచ్చిన పదార్థంతో ఎత్తైన ప్రాంతాల్లో లొబాటే స్కార్ప్స్ అనే రూపాలు ఉద్భవించాయి. అయితే అలాంటి పక్రియతోనే లూనార్ మారియా ప్రాంతాలు కూడా ఏర్పడ్డాయి. వీటిలో ఏర్పడిన పగుళ్లను శాస్త్రవేత్తలు స్మాల్ మేర్ రిడ్జెస్ (ఎస్ఎంఆర్) అని పిలుస్తున్నారు. చంద్రుడిపై ఈ కొత్త అధ్యయనానికి నేతృత్వం వహించిన కోల్ నైపావెర్ మాట్లాడుతూ "అపోలో శకం నుంచి చంద్రుడిపై ఎత్తైన ప్రాంతాల్లోని లొబాటే స్కార్ప్స్ గురించి మాకు తెలుసు. కానీ జాబిల్లి ఉపరితలం అంతా విస్తృతంగా కనిపిస్తున్న లూనార్ మేర్‌లను ఇప్పుడే శాస్త్రవేత్తలు గుర్తిస్తున్నారు" అని చెప్పారు. ఇలాంటి 1,114 ఎస్ఎంఆర్‌లను కనుగొన్నారు. వీటితో మొత్తం పగుళ్ల సంఖ్య 2,634కు చేరింది. ఇంకో విశేషం ఏమిటంటే.. లొబాటే స్కార్ప్స్ కన్నా, ఎస్ఎంఆర్‌లు పురాతనమైనవి.



ఏప్రిల్ 1 నుంచి టోల్ ప్లాజాలో నగదు చెల్లింపుల్లేవు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: టోల్ ప్లాజాల్లో నగదు చెల్లింపులను నిలివేయాలని జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) భావిస్తోంది. ఏప్రిల్ 1 నుంచి కేవలం ఫాస్టాగ్, యూపీఐ ద్వారా మాత్రమే చెల్లింపులను స్వీకరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా టోల్ ప్లాజాల్లో పూర్తిగా నగదు లావాదేవీలను నిలిపివేసి, పూర్తిస్థాయి డిజిటల్ నేషనల్ హైవే టోలింగ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్లు సంస్థ పేర్కొంది. టోల్ వసూళ్లలో పారదర్శకత, సామర్థ్యం పెంచడమే లక్ష్యంగా ఈ మార్పును తీసుకొనిరానున్నట్లు సంస్థ వివరించింది. గత కొద్ది సంవత్సరాలుగా టోల్ వసూళ్లలో 98% ఫాస్టాగ్ ద్వారానే జరుగుతున్నాయి. జాతీయ రహదారుల రుసుము నిబంధనల ప్రకారం ఇప్పటి వరకూ... ఉనికిలో లేని ఫాస్టాగ్‌తో లేదా అసలు లేకుండా టోల్ ప్లాజా దాటాలనుకునే వాహనదారులు నిర్దేశిత రుసుముకు రెండింతలు సొమ్ము చెల్లించాలి. అదే యూపీఐ ద్వారా అయితే నిర్దేశిత ఫీజుపై 1.25 రెట్లు చెల్లిస్తే సరిపోతుంది.



కర్నూలులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సంప్రోక్షణ చేస్తున్న మంత్రి టీజీ భరత్, నాయకులు

వైసీపీ నీచ రాజకీయం

పథకం ప్రకారమే మతవిశ్వాసాలపై దాడి


- దేవుడి ఫొటోలు విసిరేసి భక్తుల మనోభావాలు దెబ్బతీశారు
- కూటమి మంత్రులు, ఎమ్మెల్యేల ధ్వజం
- వైసీపీ నాయకులు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల శాసన మండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు మహాపచారానికి పాల్పడ్డారని కూటమి మంత్రులు శనివారం ఆరోపించారు. చెప్పులు, బూట్లు వేసుకొని శ్రీవారి ఫొటోలను ప్లకార్డుల్లా ప్రదర్శిస్తూ మహాపచారానికి పాల్పడ్డారని మండిపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మంత్రి కందుల దుర్గేశ్ మీడియాతో మాట్లాడుతూ, మాజీ సీఎం జగన్ డైరెక్షన్‌లోనే వైసీపీ నీచ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. వైసీపీ విధ్వంసకర విధానాలకు వ్యతిరేకంగా వారం రోజుల పాటు ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. శాసన మండలిలో శ్రీవారికి ఘోర అపచారం జరగడం యాదృచ్ఛికం కాదని, అది ఒక ప్రణాళిక ప్రకారం మతవిశ్వాసాలు, హిందూ ఆచారాలు, సంప్రదాయాలపై జరిగిన దాడి అని పేర్కొన్నారు. దేవుడి ఫొటోలు విసిరేసి భక్తుల మనోభావాలు దెబ్బతీశారని, సాక్ష్యాలు ఉన్నప్పటికీ వైసీపీ నేత బొత్స సత్యనారాయణ బుకాయిస్తున్నారని మండిపడ్డారు. జగన్ ఓ ప్రణాళిక ప్రకారమే కుట్రపూరితంగా, ద్వేషపూరితంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. కాగా, అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, దేశంలోని ఏ రాష్ట్ర అసెంబ్లీలోనూ భగవంతుడి ఫొటోలతో ఎవరూ ఇంత అవమానకరంగా ప్రవర్తించలేదని, వైసీపీ వాళ్లకు దేవుడంటే భయం, భక్తి లేవని, హిందుత్వాన్ని కించపరచడమే వారి నైజమని ధ్వజమెత్తారు. హిందువుల మనోభావాలతో మాజీ సీఎం జగన్ చెలగాటం ఆడుతున్నారని మంత్రి కొలుసు పార్థసారథి ఏలూరులో ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌పై ఉన్న కేసుల్లోని సాక్షులు ఎలా చనిపోతున్నారో అర్థం కావడంలేదన్నారు. పరకామణి కేసులో సాక్షిగా ఉన్న అధికారి ఎలా చనిపోయాడని ప్రశ్నించారు. తిరుమల శ్రీవారిపై జగన్‌కు నమ్మకం లేదని, ఏనాడూ డిక్లరేషన్ కూడా ఇవ్వలేదని మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నంలో ఆరోపించారు. క్రికెట్ మ్యాచ్ చూడటానికి సొంత డబ్బుతో కొలంబో వెళ్లిన మంత్రి లోకేశ్‌ను వైసీపీ నాయకులు విమర్శించడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. తాడేపల్లి నుంచి తెనాలి వెళ్లడానికి కూడా హెలికాప్టర్ వాడిన జగన్ ఇప్పుడు నీతులు చెప్పడం ఎంతవరకు సబబని కొల్లు ప్రశ్నించారు. వేంకటేశ్వరస్వామి విషయంలో వైసీపీ నాయకుల తీరు దారుణంగా ఉందని మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని సంకల్ బాగ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కర్నూలు అర్బన్ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మతో కలిసి ఆలయంలో సంప్రోక్షణ చేపట్టి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో చేసిన తప్పును జగన్ ఒప్పుకోవాలని మంత్రి డిమాండ్ చేశారు. వైసీపీ అధ్యక్షుడిగా జగన్‌ను మార్చి ఇం కొకరిని ఎన్నుకోవాలని, అప్పుడైనా ముఖ్యమైన అంశాలపై చర్చలు జరిగేందుకు అవకాశం ఉంటుందేమోనని అభిప్రాయపడ్డారు. 2039 వరకు కూట మి ప్రభుత్వం అధికారంలో ఉంటుందని సీనియర్ ఐఏఎస్‌లు తనతో చెప్పారని, కూటమి పాలన ఎంత బాగుందో దీన్ని బట్టి తెలుస్తోందని మంత్రి భరత్ పేర్కొన్నారు. వైసీపీ అధినేత జగన్‌కు గానీ, ఆ పార్టీ నాయకులకు గానీ దేవుడంటే భయం, భక్తి లేవని, అందుకే రాజకీయ లబ్ధి కోసం ఆ దేవుడిని కూడా చట్ట సభలకు తీసుకువచ్చి సంప్రదాయాలను మంటగలుపుతున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలిలో మండిపడ్డారు. లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసి ఘోరమైన తప్పు చేసింది కాక హిందూ మత ఆచారాలను మంటగలిపేలా వ్యవహరించడం జగన్‌లోని రాక్షసత్వానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. కాగా, మండలిలో శ్రీవారి చిత్రపటాన్ని కింద పడేసినట్లు నిరూపిస్తే తాము రాజీనామా చేస్తామని వైసీపీ ఎమ్మెల్సీ మధుసూదన్ రావు సవాల్ విసిరారని టీటీడీ బోర్డు సభ్యుడు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. మండలిలో దేవదేవుడి చిత్రపటాన్ని కింద పడేసి వెళ్లిపోతున్న ఫొటోలను ఎమ్మెల్యే ప్రదర్శించారు. వైసీపీ వారు చేసిన సవాల్‌ను స్వీకరించి, దమ్ముంటే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వైసీపీ నేతలు క్షమాపణ చెప్పి.. చెంపలేసుకోవాలి

- ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద



డాబాగార్డెన్స్(విశాఖపట్నం), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీలు చెప్పులు, బూట్లు ధరించి శ్రీవేంకటేశ్వర స్వామి చిత్రపటాలతో అపచారానికి పాల్పడడం అత్యంత బాధాకరమని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి ఆవేదన వ్యక్తం చేశారు. శాసనమండలిలో శ్రీవారి పోస్టర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ చిత్తు కాగితాలుగా కిందకు, పైకి వేయడం హేయమన్నారు. మార్గదర్శకులుగా ఉండాల్సిన ప్రజా ప్రతినిధులే తప్పుచేస్తూ సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. త్వరలోనే రాష్ట్రంలోని సాధువులతో ఈ విషయమై విజయవాడలో సమావేశం నిర్వహిస్తామని శ్రీనివాసానంద ప్రకటించారు.

ఆలయాల్లో నాణ్యతా నిర్ధారణ ల్యాబ్‌లు

- గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు సూచన

సింహాచలం(విశాఖపట్నం), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): భక్తుల విశ్వాసాలకు తగ్గట్టుగా పూర్తి నాణ్యతతో కూడిన ప్రసాదాలు అందజేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రధాన ఆలయాల పరిధిలో ఆధునిక నాణ్యతా నిర్ధారణ లేబొరేటరీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు సూచించారు. శనివారం ఆయన సతీసమేతంగా సింహాచలేశుని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... తిరుమల లడ్డూకు వినియోగించిన నెయ్యిలో రసాయనాలు కలిశాయంటూ వస్తున్న వార్తలతో భక్తుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. రాజకీయాల కోసం వైసీపీ నాయకులు మండలిలో వెంకన్న ఫొటోల ప్రదర్శన మనస్తాపానికి గురిచేసిందని అన్నారు.

మండలి సాక్షిగా వైసీపీ దైవద్రోహం: భానుప్రకాశ్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్ష దైవంగా కోట్లాది భక్తులు కొలిచే శ్రీ వేంకటేశ్వర స్వామి పట్ల వైసీపీ ఎమ్మెల్సీలు రాష్ట్ర శాసన మండలి సాక్షిగా దైవ ద్రోహానికి పాల్పడ్డారని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి మాట్లాడారు. 'చెప్పులు ధరించి వైసీపీ ఎమ్మెల్సీలు, వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని ప్రదర్శించడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూవుల మనోభావాలు దెబ్బతిన్నాయి. స్వామి వారి పట్ల అపచారానికి పాల్పడిన వైసీపీ ఎమ్మెల్సీల తరపున ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలి. ఇది ముందస్తు ప్రణాళికతో హిందూ భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు చేసిన కుట్రపూరిత చర్య. అపచారం చేసిన వారందరికీ లీగల్ నోటీసులు పంపిస్తాం' అని చెప్పారు.

గురుకుల హాస్టల్‌లో పైశాచికం

- బాలుడిపై అర్ధరాత్రి తోటి విద్యార్థుల లైంగిక దాడి

ఆలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని ఓ గురుకుల వసతి గృహంలో శుక్రవారం అర్ధరాత్రి విద్యార్థిపై ముగ్గురు తోటి విద్యార్థులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ దాడితో విద్యార్థికి రక్తస్రావం కావడంతో పాటు నొప్పి భరించలేక తల్లిదండ్రులకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పాడు. జరిగిన పైశాచిక దాడిని వివరిస్తూ విద్యార్థి బోరున విలపించాడు. ఇలాంటి ఘటన జరగడం బాధాకరమని, ఈ ఘటనకు బాధ్యులైన ముగ్గురికి టీసీలు ఇచ్చి పంపించామని ప్రిన్సిపాల్ తెలిపారు.

మార్చినాటికి గ్రామాల్లో 100% చెత్త సేకరణ

- వృత్తాకార ఆర్థిక వ్యవస్థను పునర్నిర్వచిస్తున్నాం
- వినుకొండలో స్వచ్ఛ రథాలను ప్రారంభించిన సీఎం

గుంటూరు(వినుకొండ), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కింద చేపడుతున్న వివిధ పనుల ద్వారా వృత్తాకార ఆర్థిక వ్యవస్థను పునర్నిర్వచిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కింద స్వచ్ఛ రథాలను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇంటింటా చెత్త సేకరణ కోసం ఉద్దేశించిన పుష్ కార్టులు, ఈ-ఆటోలను కూడా ప్రారంభించారు. మార్చి నాటికల్లా గ్రామీణ ప్రాంతాల్లో 100 శాతం మేర ఇంటింటా చెత్త సేకరణ జరగాల్సిందేనని అధికారులను ఆదేశించారు. గతంలో పాత వస్తువులు తీసుకుని కొత్త వస్తువులు ఇచ్చేవారు. అదే విధానాన్ని తీసుకుని ఇళ్లలో పనికిరాని వస్తువులను స్వచ్ఛ రథాల ద్వారా సేకరించి వారికి అవసరమైన నిత్యావసరాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. దీనివల్ల ప్రజలు రోడ్లపై చెత్త పడేయకుండా ఉంటారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛ రథాల విధానాన్ని దశలవారీగా అమలులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం నింపుతున్నామని, తద్వారా ఇంటి వద్దనే 100 శాతం చెత్తను సేకరించవచ్చన్నారు. వైజాగ్, గుంటూరులో ఉన్న వేస్టు టూ ఎనర్జీ ప్లాంట్లు సత్ఫలితాలు ఇస్తున్నాయని, కొద్ది రోజుల్లోనే రాష్ట్రంలో మరో ఐదు ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సూపర్ సిక్స్ పథకాలను నిర్ణీత సమయం కంటే ముందే అమలు చేసి సూపర్‌హిట్ చేశామని చంద్రబాబు అన్నారు. కాగా, పల్నాడు జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ని సీఎం పరిశీలించారు. 561 స్వయం సహాయక సంఘాలకు రూ.100.14 కోట్ల చెక్కుని సీఎం అందజేశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చినట్టే.. వినుకొండను కూడా ఆ హబ్‌లో చేర్చి అభివృద్ధి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, సీఎంవో అధికారి ప్రద్యుమ్న, పల్నాడు కలెక్టర్ కృతికా శుక్లా పాల్గొన్నారు.



అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కుమార్తె మానస-సిద్ధార్థ్ వివాహ వేడుకలో వధూవరులను ఆశీర్వదిస్తున్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి



స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రమాణం చేస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రులు నారాయణ, గొట్టిపాటి, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తదితరులు



పల్నాడు జిల్లాలో దివ్యాంగురాలితో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, కలెక్టర్ కృతికా శుక్లా

హ్యాపీ మ్యారీడ్ లైఫ్..!

- ఏజీ దమ్మాలపాటి కుమార్తె వివాహానికి సీఎం చంద్రబాబు హాజరు
- నూతన వధూవరులను ఆశీర్వదించిన టీ-సీఎం రేవంత్‌రెడ్డి, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో శనివారం జరిగిన ఏపీ అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కుమార్తె వివాహానికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులు మానస-సిద్ధార్థ్‌లను ఆశీర్వదించారు. ఈ వేడుకకు ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్‌తో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ పీఎస్ నర్సింహ తదితరులు హాజరయ్యారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ, ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య పెళ్లికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

మరీ ఇంత నీచమా?

(మొదటి పేజీ తరువాయి)

పవిత్రతను దెబ్బతీసే అధికారం వీళ్లకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ""సాక్షాత్తు వేంకటేశ్వరస్వామి ఫొటోను కౌన్సిల్‌లోకి తీసుకెళ్లారంటే వీళ్లని ఏమనాలి? చెప్పులేసుకొని ఫొటోలు తీసుకొని వచ్చి వాటిని విసిరి పారేశారు. తమ రాజకీయ పార్టీ ఉందన్న అహంకారమే దీనంతటికి కారణం." అని మండిపడ్డారు. శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు పల్నాడు జిల్లా వినుకొండ పట్టణానికి వచ్చారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. "మేం అధికారం చేపట్టగానే తిరుమల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టి కొత్త ఈవోను నియమించాం. నెయ్యిలో కల్తీ ఉందని అప్పుడే తేలింది. ఆ శాంపిల్‌ను ఎన్‌డీడీబీకి పంపిస్తే అందులో జంతుకొవ్వు ఉందని నివేదిక వచ్చింది. అదే విషయం నేను చెప్పాను. వైసీపీ వాళ్లు లేనిపోనివి సృష్టించి సుప్రీంకు వెళితే సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ నివేదికలో లడ్డూ తయారీలో వినియోగించినది నెయ్యే కాదని చెప్పింది. దీనిపై చర్యలు తీసుకోమని ప్రభుత్వానికి సూచించింది." అని తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

రాజకీయ ప్రక్షాళనకు ప్రజలు కలిసిరావాలి

"శివుడి తలపై పాము ఉంటే, అది ఎక్కడ కాటు వేస్తుందోనని అంతా భయపడతారు. నేను శివుడి తలపై పాము ఉంటే, ఆయనకు నమస్కారం పెట్టి, పామును బయటకు తీసుకొచ్చి ఏమి చేయాలో అది చేస్తాను. ప్రజలు కూడా తమకెందుకని కూర్చోకుండా ముందుకొచ్చి వైసీపీ లాంటి చెడు పార్టీలను నిరాకరిస్తే రాజకీయాలు ప్రక్షాళన అవుతాయి. వైసీపీ వాళ్లు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులు తిడుతున్నారు. నేను ప్రతిపక్షంలో ఉండగా, నా భార్యను దూషించారు. ఆంబోతుల మాదిరిగా ప్రవర్తిస్తూ రెచ్చగొడుతున్నారు. రాష్ట్రాన్ని గంజాయితో సర్వనాశనం చేశారు."

బాలికల రేపిస్టులను హెచ్చరిస్తున్నా..

"గంజాయి సేవించి మదనపల్లెలో ఒక వ్యక్తి మృగంలా మారి ఏడేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. నేను ఒకటే చెబుతున్నా. ఆడబిడ్డల జోలికొస్తే అదే వాళ్లకు చివరి రోజు. ఆ మాటకు కట్టుబడి ఉన్నాను. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వాళ్లకు ఈ సమాజంలో చోటు లేదు. వాళ్లకి ఉరిశిక్ష పడాలి."

బూతులు తిట్టేవారికి పరామర్శలా?

" 2019 ఎన్నిలకు ముందు మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యను తొలుత గుండెపోటుగా చిత్రీకరించారు. ఆయన కుమార్తె విజ్ఞప్తి మేరకు పోస్టుమార్టం చేస్తే అది హత్య అని తేలింది. దీంతో వాళ్లు నాటకాలు మార్చి మరుసటి రోజు ఉదయం వాళ్ల పత్రికలో 'నారాసుర రక్తచరిత్ర' అని రాశారు. నేను రాజకీయం చేస్తాను. రౌడీల గుండెల్లో రైళ్లు పరుగెట్టిస్తా. సంఘ విద్రోహ శక్తులను అణచివేస్తాను తప్పించి నేరాలు చెయ్యను. ఇప్పుడు కల్తీ నెయ్యి వ్యవహారంలోకి హెరిటేజ్‌ను తీసుకొచ్చి నాపై తప్పు వేయాలని చూస్తున్నారు. ఇలాంటి కరుడుగట్టిన నేరస్తులతో రాజకీయం చేయాల్సి రావడం బాధాకరం. 'వైసీపీ నేత జగన్ బయటకు వస్తే బలవంతంగా మనుషులను తీసుకొస్తారు. పోతూపోతూ వాళ్ల కార్ల కిందనే అమాయక మనుషులను చంపేస్తారు. ఆ తర్వాత వాళ్లను ఏమాత్రం పట్టించుకోరు. బూతులు తిట్టిన వాళ్లను మాత్రం ఇళ్లకు వెళ్లి పరామర్శిస్తారు. వాళ్ల కోసం వచ్చి చనిపోయిన వాళ్లకు ఎలాంటి పరామర్శలు ఉండవు. దీనిని బట్టి ఆ పార్టీ నాయకుల వైఖరిపై ప్రజలే ఆలోచన చేయాలి."

కాంగ్రెస్ వైఖరి గర్హనీయం.. "ఢిల్లీలోని ఏఐ సదస్సుకు అన్ని దేశాల నుంచి ప్రతినిధులు వచ్చి వాళ్లు చేసిన ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఆ సదస్సు దేశానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. దీనిని స్వాగతించాల్సిందిపోయి కాంగ్రెస్ పార్టీ వాళ్లు అర్ధనగ్నంగా సదస్సులోకి ప్రవేశిస్తారా? వాళ్లను ఏమనాలో. బాధ్యత లేకుండా ప్రవర్తించిన కాంగ్రెస్ తీరును తీవ్రంగా గర్హిస్తున్నాను."

పిల్లలకు ఏఐ మాస్టరు.. ప్రజలకు ఏఐ డాక్టరు

"సాంకేతిక రంగంలో కొత్త విషయాలు తెలుసుకొని వాటి ద్వారా ప్రజలకు మేలు చేయడం నాకు ఇష్టం. అది నా అభిరుచి. 1995లో ఐటీకి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల నేడు తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయంలో దేశంలోనే నం.1గా నిలిచింది. ఇప్పుడు వైజాగ్‌లో గూగుల్ డేటా సెంటర్‌ను 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏర్పాటు చేయిస్తున్నాం. అమరావతిలో క్వాంటం కంప్యూటర్ నెలకొల్పుతున్నాం. తద్వారా ప్రపంచంలోని ఆరు, ఏడు దేశాల సరసన అమరావతిని చేరుస్తున్నాం. ఇటీవల ఉండవల్లికి బిల్‌గేట్స్ వచ్చి మనం వ్యవసాయ రంగంలో వినియోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చూసి ఆనందపడ్డారు. త్వరలో ఏఐ ద్వారా అగ్రి టెక్ తీసుకొస్తాం. అలానే పిల్లలందరికీ ఏఐ ట్యూషన్ మాస్టర్, ప్రజలకు ఏఐ డాక్టర్ వస్తారు."



పెరుగుతున్న ఎండలు

- కర్నూలు, నందిగామలో 37 డిగ్రీలు.. బలపడనున్న అల్పపీడనం

అమరావతి, విశాఖపట్నం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండ తీవ్రత క్రమేపీ పెరుగుతోంది. శనివారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. దేశంలోనే అత్యధికంగా కర్నూలు, నందిగామల్లో 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏజెన్సీ, శివారు ప్రాంతాల్లో మాత్రం రాత్రిపూట చలి ప్రభావం కొనసాగుతోంది. కాగా శనివారం ఉదయం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ వాయువ్యంగా పయనించి నైరుతి బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంలో ప్రవేశించింది. రానున్న 24 గంటల్లో పశ్చిమ వాయువ్యంగా పయనించి మరింత బలపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో ఆది, సోమవారాల్లో కోస్తా, రాయలసీమలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. తూర్పుగోదావరి జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

బాధ్యతగా సభ్యత్వ నమోదు

- జనసేన నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రి మనోహర్ సూచన

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): "జనసేన పార్టీ సభ్యత్వ నమోదు అనేది మహోన్నత ఆశయాలతో నిండిన యజ్ఞం. పార్టీ సిద్ధాంతాలను నమ్మిన ప్రతి ఒక్క జనసైనికుడు, వీర మహిళ ఆ సభ్యత్వ నమోదును భావోద్వేగంతో చేస్తారు. మనమంతా బాధ్యతగా దానిని ముందుకు తీసుకెళ్లాలి" అని జనసేన నేతలకు పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, మంత్రి మనోహర్ సూచించారు. జనసేన పార్టీ సభ్యత నమోదు కార్యక్రమం ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో సమన్వయకర్తలతో మనోహర్ శనివారం టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. క్షేత్రస్థాయి నుంచి పక్కా ప్రణాళికతో సభ్యత్వ నమోదును అత్యంత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు మీద ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల దృష్టి నిలపాలని, శాసన సభ, మండలి సమావేశాలకు హాజరవుతూనే, మిగిలిన సమయాన్ని పూర్తిగా పార్టీకి కేటాయించాలని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి బలాన్ని సమీకరించేలా ఈ బాధ్యతను నిర్వర్తించాలన్నారు. సభ్యత్వ నమోదు సమన్వయం కోసం పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను పార్టీ అధ్యక్షుడు పవన్ సూచన మేరకు నియమించామని తెలిపారు.

25 పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తలు వీరే..

శ్రీకాకుళం- కొరికాన రవికుమార్, విజయనగరం-లోకం నాగమాధవి, విశాఖపట్నం- సి.హెచ్.వంశీకృష్ణ యాదవ్, అనకాపల్లి- పంచకర్ల రమేశ్‌బాబు, అరకు-సుందరపు విజయ్‌కుమార్, కాకినాడ- తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, అమలాపురం- బత్తుల బలరామకృష్ణ, రాజమండ్రి- కందుల దుర్గేష్, నరసాపురం- చిల్లపల్లి శ్రీనివాసరావు, ఏలూరు- గిడ్డి సత్యనారాయణ, విజయవాడ-బొమ్మిడి నాయకర్, మచిలీపట్నం- వల్లభనేని బాలశౌరి, గుంటూరు - పిడుగు హరిప్రసాద్, నరసరావుపేట-పంతం నానాజీ, బాపట్ల- పత్సమట్ల ధర్మరాజు, ఒంగోలు - కొణతాల రామకృష్ణ, నెల్లూరు- బొలిశెట్టి శ్రీనివాస్, కడప- టి.సి.వరుణ్, రాజంపేట- కళ్యాణం శివశ్రీనివాసరావు, కర్నూలు- చిలకం మధుసూదన్‌రెడ్డి, నంద్యాల-కిలారు రోశయ్య, అనంతపురం- పి.హరిప్రసాద్, హిందూపురం- ఎస్.కె.రియాజ్, చిత్తూరు- వేగుళ్ల లీలాకృష్ణ, తిరుపతి- ఆరణి శ్రీనివాసులు

మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు

రాజకీయ నాయకుల తీరుపై మేధావులు నోరువిప్పాలి

- ఏఐను సరిగ్గా వాడుకోకపోతే పెనుప్రమాదం
- సిద్ధార్థ కాలేజీ పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవంలో వెంకయ్యనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య, వేదికపై సిద్ధార్థ అకాడమీ ఛైర్మన్ మలినేని రాజయ్య తదితరులు

విజయవాడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): 'కృత్రిమ మేధస్సు కృత్రిమంగానే ఉంటుంది. మన మేధస్సు ద్వారానే మంచి ఫలితాలు వస్తాయి. ఏఐ విస్తృతమైతే వావి వరసలు మరిచిపోతారేమోనన్న భయముంది నాకు. మీ ముఖం తరహాలోనే ఇంకొకరు మీ ఇంట్లోకి వచ్చే ప్రమాదమూ ఉంది. ఏఐపై మోదీ, చంద్రబాబు, సుందర్ పిచాయ్ వంటి వారు మాట్లాడారు. ఏఐను నైతిక పద్ధతిలో విలువలతో కూడిన విధంగా ఎలా వినియోగించాలన్నది ఆలోచన చేయాలి. ఏఐ వల్ల జరిగే ప్రమాదాన్ని నిపుణులు గుర్తించి వాటిని నివారించే మార్గాలను కూడా చూడాలి. ఒకప్పుడు సోషల్ మీడియా వస్తే అబ్బో అన్నారు.. ఇప్పుడు యాంటీ సోషల్ మీడియాగా మారిపోయింది. పైన హెడ్డింగ్ అద్భుతంగా ఉంటుంది. లోపల సంబంధం లేని అంశాలుంటాయి. కృత్రిమ మేధ ద్వారా ఎంత మంచి ఉందో అంత చెడూ ఉందని ఢిల్లీ ఏఐ సమ్మిట్‌లో ప్రధాని కూడా చెప్పారు. ఈ చెడును ఏవిధంగా అదుపుచేసి అరికట్టాలన్నది అందరూ ఆలోచన చేయాలి' అని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. సోషల్ మీడియా ద్వారా రాజకీయ నాయకులు మత విద్వేషాలను రెచ్చగొడుతూ సమాజాన్ని పక్కదారి పట్టిస్తున్నారని, కులాలు, మతాల పేరుతో సమాజంలో చీలికలు తెచ్చే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.విజయవాడలోని పీబీ సిద్ధార్థ కాలేజీ పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. సిద్ధార్థ ఆడిటోరియంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ వేడుకలను వెంకయ్య జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిద్ధార్థ కాలేజీ దేశ, రాష్ట్ర ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత, అంకిత భావంతో కాలేజీ సాధించిన విజయాలు స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. పాతతరం కుటుంబ వ్యవస్థ గురించి పిల్లలకు తెలిసేలా బాధ్యతాయుతంగా నేటి తరం తల్లిదండ్రులు ప్రవర్తించాలని సూచించారు. సమాజాన్ని సరైన మార్గంలో నడిపించేందుకు భారతీయ సంప్రదాయాలే ఉత్తమమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వెంకయ్యనాయుడుతో పాటు సిద్ధార్థ కాలేజీకి చెందిన ప్రముఖులను సత్కరించారు. కాలేజీ ప్రిన్సిపాల్ మేకా రమేష్‌బాబు, పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ బోడేపూడి అమరేంద్ర, అకాడమీ ఛైర్మన్ మలినేని రాజయ్య, ఉపాధ్యక్షుడు నిమ్మగడ్డ లలిత్ ప్రసాద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఉత్తర్వులు, తీర్పులు తెలుగులోనే ఉండాలి

కృత్రిమ మేధస్సుతో పాటు ఛందస్సూ తెలిసుండాలి: వెంకయ్య

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి, 21(ఆంధ్రజ్యోతి): తెలుగు భాష పరిరక్షణ జరగాలంటే ప్రభుత్వఉత్తర్వులు, అసెంబ్లీ సమావేశాలు, న్యాయస్థాన తీర్పులు, వైద్యసేవల ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే అందించాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పొట్లూరి హరికృష్ణ, ఏపీ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రపంచ కవుల మహాసభలు నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ 'ప్రభుత్వ ఉద్యోగాలకు తెలుగు అర్హత తప్పనిసరి చేయాలి. అలాచేస్తే అందరూ సహజంగానే తెలుగు నేర్చుకుంటారు. మాతృభాషలో చదివినవారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యమివ్వాలి. మనుషులంతా కృతిమ మేధస్సుతో బాటు ఛందస్సు కూడా తెలిసి ఉండాలని, భాషాభిమానం కలిగి ఉండాలన్నారు.



విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రపంచ కవుల మహా సభల్లో మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

నాటి సీఎం అభీష్టం మేరకే

- బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా వాసుదేవరెడ్డి
- రైల్వేస్ నుంచి డిప్యుటేషన్‌పై ఏపీ సర్వీసుకు నాటి సీఎం ప్రిన్సిపల్ అడ్వైజర్ లేఖలే ఆధారం
- పక్కా ప్రణాళిక, ముందస్తు కుట్రతోనే: సిట్
- 3,500 కోట్ల లిక్కర్ దందాలో ప్రధాన కుట్రదారు, పాత్రధారి ఆయనే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంలో ఏ-2గా ఉన్న వాసుదేవరెడ్డిని రాష్ట్రానికి తీసుకొచ్చిందెవరు? ఎక్కడో రైల్వే ట్రాఫిక్ సర్వీసులో పనిచేస్తున్న ఆయన్ను ఏపీకి డిప్యుటేషన్‌పై తీసుకురావాలని సిఫారసు చేసిందెవరు? వాసుదేవరెడ్డిని రాష్ట్ర సర్వీసుకు తీసుకొచ్చాక ఏరికోరి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా నియమించాలని చెప్పిందెవరు? ఈ ప్రశ్నలకు వేళ్లన్నీ నాటి ముఖ్యమంత్రి జగన్‌వైపే చూపిస్తున్నాయి. నాటి ముఖ్యమంత్రి కోరిక మేరకే వాసుదేవరెడ్డిని రైల్వే సర్వీసు నుంచి ఏపీకి డిప్యుటేషన్‌పై తీసుకొచ్చారని సిట్ విచారణలో తేలింది. ముఖ్యమంత్రి అభీష్టం మేరకే బేవరేజెస్ కార్పొరేషన్‌కు ఎండీగా, ఆ తర్వాత డిస్టిలరీస్ కమిషనర్‌గా నియమించారని, ఇందుకు ఆయన ప్రిన్సిపల్ అడ్వైజర్ రాసిన లేఖలే ఆధారాలని సిట్ తేల్చింది. లిక్కర్ స్కామ్‌లో ఏ-2గా ఉన్న వాసుదేవరెడ్డిని శనివారం సిట్ అరెస్ట్ చేసింది. ప్రభుత్వం ఇచ్చిన పోస్టుల్లో చేరిన తర్వాత వాసుదేవరెడ్డి.. జగన్ సన్నిహితులైన రాజ్‌కసిరెడ్డి, మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి ఇతరులతో కలిసి మద్యం కుంభకోణం చేసేందుకు వ్యూహ రచన చేశారని, ఆ కుట్రకు సూత్రధారిగా, పాత్రధారిగా వ్యవహరించారని ఆయనపై తీవ్ర అభియోగాలు నమోదు చేసింది. వాసుదేవరెడ్డిని సిట్ అరెస్ట్ చేసిన సందర్భంగా కోర్టుకు రిమాండ్ రిపోర్టును సమర్పించింది. అందులో పలు కీలక అంశాలను ప్రస్తావించింది.

అజేయకల్లం సిఫారసు లేఖలు

'ముఖ్యమంత్రి అభీష్టం మేరకు రైల్వేలో ఉన్న వాసుదేవరెడ్డిని ఏపీకి డిప్యుటేషన్‌పై తీసుకురావాలి' అని ఒకసారి, 'ఆయన్ను బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా నియమించాలి' అని మరోసారి ప్రిన్సిపల్ అడ్వైజర్.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)కి నోట్స్ పంపించారు. సత్యప్రసాద్ (ఏ3)ను కూడా సీఎం అభీష్టం మేరకే బేవరే జెస్ కార్పొరేషన్‌లో స్పెషల్ ఆఫీసర్‌గా నియమించాలని ప్రిన్సిపల్ అడ్వైజర్ సీఎస్‌కు నోట్ పంపించారు. ఈ విషయాన్ని సిట్ పేర్కొంది. ముఖ్యమంత్రి అభీష్టం మేరకు అన్నాక సీఎస్ కేంద్రం, రైల్వే శాఖ పెద్దలను సంప్రదించి వాసుదేవరెడ్డిని ఏపీకి డిప్యుటేషన్‌పై తీసుకొచ్చారు. సీఎం అభీష్టాన్ని బయట పెట్టిన ఆ ప్రిన్సిపల్ అడ్వైజర్ ఎవరంటే.. రిటైర్డ్ ఐఏఎస్ అజేయకల్లం రెడ్డి. రిమాండ్ రిపోర్టులో నాటి ముఖ్యమంత్రి జగన్, ఆయన ప్రిన్సిపల్ అడ్వైజర్ అజేయకల్లంరెడ్డి పేర్లు ప్రస్తావించలేదు. కానీ నాటి ముఖ్యమంత్రి అంటే జగనే. ముఖ్యమంత్రికి ప్రిన్సిపల్ అడ్వైజర్‌గా పనిచేసింది అజేయకల్లంరెడ్డినే. తొలుత వాసుదేవరెడ్డిని రైల్వేస్ నుంచి ఏపీ సర్వీసుకు తీసుకొచ్చాక తాగునీటి సరఫరా కార్పొరేషన్ ఎండీగా నియమించాలని నాటి సీఎస్ భావించారు. కానీ కేవలం పది రోజుల వ్యవధిలోనే నిర్ణయం మార్చుకొని బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా నియమిస్తూ 2019 సెప్టెంబరు 16న సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తర్వాత మరో 15 రోజులకే ఆయన్ను డిస్టిలరీస్ కమిషనర్‌గా నియమిస్తూ మరో ఉత్తర్వు ఇచ్చారు. "ముందస్తు కుట్ర, పక్కా ప్రణాళిక వేసుకున్నాకే వాసుదేవ రెడ్డిని డిప్యుటేషన్‌పై ఏపీకి తీసుకొచ్చారు. ఆయన్ను విచారిస్తేనే కుట్రలో భాగస్వాములైన వారు, వారి చర్యలను మరింతగా నిగ్గు తేల్చాల్సి ఉంది" అని సిట్ పేర్కొంది.

బహుముఖ పాత్ర

వాసుదేవరెడ్డి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా వచ్చాక లిక్కర్ దందాలో ఆయనదే కీలక పాత్ర. లిక్కర్ దందా నడిపించేందుకు రాజ్‌కసిరెడ్డి(ఏ1), మిథున్‌రెడ్డి (ఏ4), విజయసాయిరెడ్డి (ఏ5), సజ్జల శ్రీధర్‌రెడ్డి (ఏ6), ముప్పిడి అవినాశ్‌రెడ్డి (ఏ7) తదితరులతో సమావేశాలు నిర్వహించడం, కుట్రకు వ్యూహ రచన చేయడం, ఆ తర్వాత దోపిడీ కుట్రను అమలు చేయడంలో కీలకపాత్ర పోషించారని సిట్ పేర్కొంది. వాసుదేవరెడ్డి ఎండీగా వచ్చాక లిక్కర్ దందా కుట్రదారులైన రాజ్‌కసిరెడ్డి, మరికొందరి సూచనల మేరకు ఇండెంటింగ్ విధానం మార్చారు. ఆన్‌లైన్ విధానం తొలగించి దాని స్థానంలో మాన్యువల్ విధానం తీసుకొచ్చారు. దీంతో సరఫరాలో పారదర్శకత లోపించింది. దాన్ని అడ్డం పెట్టుకొని చిల్లర బ్రాండ్లు తెర మీదకు వచ్చాయి. కేవలం నోటి మాటలతోనే వాసుదేవరెడ్డి బేవరేజెస్ కార్పొరేషన్‌లో పాలనా, అమ్మకం, సరఫరా, ఇతర విధానాలను మార్చేశారు. మద్యం సరఫరాలో కీలకమైన సీఏటెల్ సాఫ్ట్‌వేర్‌ను తొక్కిపెట్టారు. దీని వల్ల మద్యం మాఫియా సూచించిన బ్రాండ్లనే రిటైల్ దుకాణాలకు సరఫరా చేసేలా మాన్యువల్ విధానం తీసుకొచ్చారు. రాజ్‌కసిరెడ్డి, ఆయన అనుచరులు సుమిత్, ప్రకాశ్‌ల నుంచి వచ్చే ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించాలని అధికార యంత్రాంగాన్ని శాసించారు. మద్యం అమ్మకాలు, సరఫరా, డిమాండ్, చెల్లింపులకు సంబంధించిన డేటాను సిండికేట్‌లకు చేరవేశారు. ప్రముఖ బ్రాండ్లు రిటైల్ దుకాణాలకు వెళ్లకుండా, చిల్లర బ్రాండ్లు దుకాణాలకు చేరడంలో వాసుదేవరెడ్డిది కీలకపాత్ర. సిండికేట్‌లకు ఏ బ్రాండ్ నుంచి ఎంత ముడుపులు చెల్లించాల్నో ఆయనే సమాచారం ఇచ్చేవారు. ఒక్కో బీర్ కేసుపై తొలుత 12 శాతం, ఆ తర్వాత 20 శాతం ముడుపులు ముట్టచెప్పాలన్నారు. సిండికేట్‌కు తలొంచకపోతే సరఫరా ఆర్డర్లు నిలిపివేస్తామని బెదిరించారు.

సిండికేట్ అడ్డాగా కార్పొరేషన్

వాసుదేవరెడ్డి చర్యల వల్ల సిండికేట్‌కు నెలకు కనీసం 50-60 కోట్ల ముడుపులు చేరాయి. వాసుదేవరెడ్డికి తెలిసే 3,500 కోట్ల లిక్కర్ దందా జరిగింది. ఇందులో ఎవరెవరి పాత్ర ఏమిటో? ఎవరి వాటాలు ఏమిటో? ఆయనకు తెలుసు. హవాలా మార్గంలో నిధుల మళ్లింపు, వసూళ్లు, ఇంకా అక్రమ సొమ్మును విదేశాలకు తరలించడం, అక్కడ వినియోగించడం వంటి కీలక విషయాలు ఆయనకు తెలిసే జరిగాయి. కానీ ఆ వివరాలపై ఆయన పెదవి విప్పడం లేదు. అంతిమంగా డబ్బు ఎక్కడికి చేరిందన్న విషయాలు వాసుదేవరెడ్డికి బాగా తెలుసు. మద్యం కుంభకోణంలో వెలుగులోకి రాని అనేక కోణాలు వాసుదేవరెడ్డికి తెలుసు. ఈ దందాలో వసూలు చేసిన బ్లాక్‌మనీని వైట్‌మనీగా ఎలా మార్చారు? అక్రమ పద్ధతుల్లో డబ్బును ఎలా దారి మళ్లించారు? సిండికేట్ ఆ డబ్బుతో ఏం చేసింది? వంటి విషయాలు ఆయనకు తెలుసు. మద్యం స్కామ్‌లో వచ్చిన డబ్బుతో వాసుదేవరెడ్డి కూడా బాగా అక్రమ సంపాదన పోగేశారు. తన బంధువుల పేరిట భారీగా ఆస్తులు కూడబెట్టారు. ఈ కేసులో వెలుగుచూడని అసలు సూత్రధారులు, పాత్రధారులు ఎవరో కనిపెట్టేందుకు మరింత లోతైన విచారణ చేపట్టేందుకు కస్టోడియల్ విచారణ అవసరమని సిట్ పేర్కొంది. వాసుదేవరెడ్డి బయట ఉంటే అతి కీలకమైన ఆధారాలు చెరిపివేయగలరని కూడా సిట్ ఆరోపించింది.



లిక్కర్ స్కామ్‌లో ఏ2 వాసుదేవరెడ్డి అరెస్ట్

విజయవాడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో రెండో నిందితుడిగా ఉన్న వాసుదేవరెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 27వ తేదీ వరకు రిమాండ్ విధించింది. సిట్ అధికారులు శనివారం అరెస్టు చేసి, ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ప్రాసిక్యూషన్స్ తరఫున జేడీ రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపించారు. వాసుదేవరెడ్డి తరఫున హైకోర్టు న్యాయవాది కె.గోపీనాథ్ వాదించారు. వాదప్రతివాదనలు విన్న తర్వాత వాసుదేవరెడ్డికి 27 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను గుంటూరులోని జిల్లా జైలుకు తరలించాలని ఆదేశించారు. కాగా ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అండ్ కోను అరెస్టు చేయడం మొదలుపెట్టిన తర్వాత తాను అప్రూవర్‌గా మారిపోతానంటూ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు అక్షింతలు వేసింది. ప్రభుత్వం మారిన తర్వాత వాసుదేవరెడ్డి కేంద్ర సర్వీసుకు వెళ్లిపోయారు. ప్రస్తుతం ఢిల్లీలో పనిచేస్తున్న ఆయనను సిట్ అధికారులు విచారణ నిమిత్తం పిలిపించారు.



ఈగల్ వార్షిక నివేదికను ఆవిష్కరిస్తున్న ఆ విభాగం చీఫ్ రవికృష్ణ, ఇతర అధికారులు

చేయి చేయి కలుపుదాం...
గంజాయిని తరిమేద్దాం

- దాని సాగును పూర్తిగా అరికట్టాం.. సరఫరా గొలుసు తెగ్గొడుతున్నాం
- 157 కేసుల్లో జైలుకెళ్లిన 96 మంది స్మగ్లర్లు: ఈగల్ ఐజీ రవికృష్ణ

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సమాజానికి ప్రమాదకరంగా ఉన్న గంజాయిని రాష్ట్రం నుంచి పూర్తిగా తరిమేసే డ్రగ్స్‌పై యుద్ధంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని 'ఈగల్' ఐజీ ఆకే రవికృష్ణ కోరారు. ఈ విభాగం 2025లో సాధించిన విజయాలు, 2026 కార్యాచరణ ప్రణాళికను విజయవాడలోని ఈగల్ కార్యాలయంలో ఆయన వివరించారు. "డ్రగ్స్, గంజాయి సేవించే వాళ్ల గురించి, సరఫరా గురించి తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ 1972కు సమాచారం అందించండి. వివరాలు గోప్యంగా ఉంచుతాం. రాష్ట్రంలో గంజాయి సాగు పూర్తిగా లేకుండా చేశాం. ఒడిశా నుంచి అక్రమంగా తరలి వస్తోన్న సరఫరా అడ్డుకోవడానికి 80 చెక్ పోస్టులు(35 అంతర్రాష్ట్ర) ఏర్పాటు చేశాం. ఏడాదిలో 1.12 లక్షల కిలోల గంజాయి ధ్వంసం చేశాం. పిట్-ఎన్‌డీపీఎస్ చట్టం కఠినంగా అమలు చేయడంతో 157 కేసుల్లో 96 మంది గంజాయి, డ్రగ్స్ స్మగ్లర్లను జైలుకు పంపించాం. ప్రభుత్వం వద్ద మరో 296 మంది జాబితా పరిశీలనలో ఉంది. 'ఆపరేషన్ చైతన్యం' పేరుతో అనేక చర్యలు, కార్యక్రమాలు చేపట్టాం. ఓపియాయిడ్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు 'ఆపరేషన్ గరుడ' అమలు చేస్తున్నాం. అరకు ప్రాంతం నుంచి వచ్చిన సమాచారంతో 12 రాష్ట్రాల్లోని 343 మందిని గుర్తించి కట్టడి చేశాం. మరో 30 నెట్‌వర్క్‌లపై నిఘా వేశాం. ఒడిశాలోని కోరాపుట్, మల్కన్‌గిరి, గజపతి, గంజాం జిల్లాల నుంచి గంజాయి వస్తోంది. గంజాయి స్మగ్లింగ్ సమాచారంతో 21 రైళ్లలో 'ఈగల్ ఆన్ ట్రైన్స్' ద్వారా తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నాం. విద్యాసంస్థల వద్ద 45 వేల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి రూ.75 లక్షల జరిమానా విధించాం. రాష్ట్రంలో 40 వేల విద్యా సంస్థల్లో ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేసి 20 లక్షల మంది విద్యార్థులకు 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ అవగాహన కల్పించాం. ఎన్‌డీపీఎస్ కేసుల్లో చిక్కుకుంటే బెయిల్, పాస్‌పోర్టు... ఏవీ రావని చెప్పాం. డ్రగ్స్ నెట్‌వర్క్ ఆర్థిక మూలాలపై ప్రత్యేక దృష్టి పెట్టి టెక్నాలజీతో మానిటరింగ్ చేస్తున్నాం. నార్కోటిక్ అఫెండర్స్ ట్రాకింగ్ సిస్టమ్‌తో పాటు.. 'ఐస్ ఫర్ విజిలెన్స్. వింగ్స్ ఫర్ జస్టిస్' నినాదంతో 2026లో ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకుని గంజాయి, డ్రగ్స్ సరఫరా చైనును పూర్తిగా తుంచేసే ప్రయత్నం చేస్తున్నాం" అని రవికృష్ణ తెలిపారు. ఈ సమావేశంలో ఆపరేషన్స్ విభాగం ఎస్పీ కే మహేశ్వర రాజు, డీఎస్పీలు దుర్గా ప్రసాద్, సింగయ్య ఇతర అధికారులు రవీంద్ర, నాగార్జున, వీరాంజనేయులు పాల్గొన్నారు.

అనంతబాబు కేసులో
పోలీసులపై వేటు

- సుప్రీం కోర్టు ఆగ్రహంతో నలుగురు సస్పెన్షన్

కాకినాడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో పోలీసులు కుమ్మక్కు అయ్యారంటూ సుప్రీం కోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. 2022, మే 19న జరిగిన హత్య కేసు విచారణలో నిందితుడైన అనంతబాబుకు అనుకూలంగా వ్యవహరించిన నలుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేస్తూ శనివారం రాత్రి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణలో లోపాలపై శుక్రవారం సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. నిందితుడైన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు డిఫాల్ట్ బెయిల్ అందించడానికి అన్ని ప్రయత్నాలు జరిగాయని, అత్యంత హేయమైన నేరంలో పోలీసుల తీరు ఆక్షేపణీయమని సుప్రీం కోర్టు మండిపడింది. కేసు విచారణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి నిందితులకు కొమ్ము కాసిన పోలీసులపై ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీసింది. అప్పటి పోలీసులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోకపోవడాన్ని తప్పుపట్టింది. ఈ నేపథ్యంలో కేసులో కీలక ఆధారాలు కావాలని విస్మరించి నిందితుడైన అనంతబాబుకు సహకరించిన నలుగురు పోలీస్ అధికారులపై డీజీపీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. సస్పెండ్ అయిన వారిలో కేసు విచారణలో కీలకంగా వ్యవహరించిన అప్పటి కాకినాడ డీఎస్పీ, ప్రస్తుతం భీమవరం అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న వి.భీమారావు, వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, అప్పట్లో సర్పవరం సీఐగా పనిచేసి ప్రస్తుతం బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఆకుల మురళీకృష్ణ, అప్పట్లో కేసు నమోదైన సర్పవరం స్టేషన్ ఎస్ఐగా ఉండి, ప్రస్తుతం కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఎన్.సతీష్‌బాబు ఉన్నారు. ఈ పోలీసు అధికారులపై వెంటనే క్రమశిక్షణ ప్రొసీడింగ్స్ ప్రారంభించాలని, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. విచారణ సజావుగా సాగేందుకు క్రమశిక్షణ ప్రొసీడింగ్స్ పూర్తయ్యే వరకు వీరి సస్పెన్షన్ కొనసాగుతుంది. వీరిపై హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆధ్వర్యంలో విచారణ జరుగుతుంది. 15 రోజుల్లో విచారణ పూర్తి చేసి నివేదిక ప్రభుత్వానికి సమర్పిస్తారు. .

అనంతబాబుపై జగన్‌కు అమితమైన ప్రేమ: ఆనందబాబు

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): దళిత యువకుడిని అతికిరాతకంగా చంపి డోర్ డెలివరీ చేసిన వ్యక్తికి రాజ్యాంగ పదవిని అప్పగించి, ఆ హంతకుడిని వెనకేసుకురావడం జగన్ నేర ప్రవృత్తికి నిదర్శనమని ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు మండిపడ్డారు. తాజాగా సుప్రీంకోర్టు ఈ కేసులో తీర్పు ఇవ్వడం జగన్ పార్టీకి చెంపపెట్టు. ప్రశ్నిస్తే చంపడం, ఎదురొస్తే కారుతో తొక్కించడం జగన్ నైజం' అంటూ ఆయన మండిపడ్డారు.

విలువల వైతాళికుడు గజ్జెల: ఘంటా

- ముగ్గురు పూర్వ సంపాదకులకు జీవన సాఫల్య పురస్కారాలు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పాత్రికేయ రంగంలో విలువల వైతాళికుడు గజ్జెల మల్లారెడ్డి స్థానం అపూర్వమైందని తెలంగాణ అంబేడ్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం-గజ్జెల మల్లారెడ్డి జీవన సాఫల్య పురస్కారాల ప్రదానోత్సవం శనివారం వైవీయూలోని అన్నమాచార్య సెనేట్ హాల్లో జరిగింది. 2023, 2024, 2025 సంవత్సరాలకు ఈ పురస్కారాలను అందజేశారు. ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, కె.శ్రీనివాస్, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు తెలకపల్లి రవిలకు దుశ్శాలువ, జ్ఞాపిక, రూ.50 వేల నగదుతో సత్కరించారు. ఈ సందర్భంగా ఘంటా చక్రపాణి మాట్లాడుతూ... '1970-95 కాలం జర్నలిజానికి స్వర్ణయుగం. నిజాయితీ, వ్యంగ్యం విమర్శలతో పత్రికారంగానికి మల్లారెడ్డి దిశానిర్దేశం చేశారు' అని అన్నారు. వైవీయూ వీసీ బెల్లంకొండ రాజశేఖర్ మాట్లాడుతూ... మల్లారెడ్డి ఫిలాసఫీ నేటికీ సమాజానికి మార్గదర్శకమని చెప్పారు. పురస్కార గ్రహీతలు జర్నలిజంలో విలువల పతాకాన్ని ఎగురవేసిన వారని వక్తలు కొనియాడారు.

బుట్టా రేణుకకు షాక్

- వైసీపీ మాజీ ఎంపీ ఆస్తుల వేలానికి మళ్లీ 'ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్' నోటీస్
- ఆ సంస్థ నుంచి రూ.340 కోట్ల రుణం
- వడ్డీ, అసలు కట్టకపోవడంతో ప్రస్తుతం రూ.782.07 కోట్లకు చేరుకున్న అప్పు
- మార్చి 23..ఇ-బిడ్ దాఖలుకు గడువు
- 24న బుట్టా రేణుక ఆస్తుల ఇ-వేలం
- గతంలో మూడు సార్లు వేలానికి యత్నం
- ఎవరూ ముందుకు రాకపోవడంతో మరోసారి నోటీస్

కర్నూలు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కర్నూలు మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఆమె భర్త నీలకంఠ శివలకు చెందిన ఆస్తులు ఇ-వేలం వేసేందుకు బెంగళూరుకు చెందిన లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్) బహిరంగ నోటీసు జారీ చేసింది. మార్చి 24న నిర్వహించే ఇ-వేలంలో పాల్గొనే బిడ్డర్లు 23న ఇ-బిడ్ ఫారం దాఖలు చేయాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. బుట్టా దంపతులు తీసుకున్న రుణం చెల్లించకపోవడంతో 'ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్' దానిని రాబట్టుకునే చర్యలకు సిద్ధమైంది. ఇప్పటికే రెండు మూడు సార్లు వేలం వేయగా, ఎవరూ ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో మరోసారి ఆమె ఆస్తులు వేలం వేసేందుకు సిద్ధమయ్యారు. బుట్టా రేణుక దంపతులు 2018లో రంగారెడ్డి జిల్లా కూకట్‌పల్లి, కేవీహెచ్‌బీ కాలనీ సర్వే నంబరు 1009, ఫేజ్-6 వద్ద గల 3,833.28 చదరపు గజాల విస్తీర్ణంలోని మెరీడియన్ స్కూల్ స్థిరాస్తిని 'ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్' వద్ద ఉమ్మడిగా తనఖా పెట్టి దాదాపు రూ.340 కోట్లు తీసుకున్నట్లు సమాచారం. వీరికి హైదరాబాద్‌లో బుట్టా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, బుట్టా కన్వెన్షన్ సర్వీసెస్ లిమిటెడ్, మెరీడియన్ ఎడ్యుకేషన్ సర్వీసెస్.. వంటి పలు వ్యాపార, విద్యా సంస్థలున్నాయి. అప్పు తీసుకున్న మొదట్లో క్రమం తప్పకుండా నెలవారీ కంతులు చెల్లిస్తూ వచ్చారు. ఆ తరువాత నుంచి చెల్లించకపోవడంతో పలుమార్లు ఆ సంస్థ నోటీసులు పంపింది. అయినా, స్పందించలేదని తెలుస్తోంది. రుణం అసలు, వడ్డీ కలిపి ప్రస్తుతం రూ.782.07 కోట్లకు చేరిందని 'ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్' అధికారులు ఇ-వేలం నోటీస్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ఇచ్చిన అప్పు వడ్డీతో సహా రాబట్టుకోవడానికి బెంగళూరు బ్రాంచి అధికారులు వేలం నోటీస్ జారీ చేశారు. వాస్తవంగా బుట్టా దంపతులకు చెందిన ఆస్తులు హైదరాబాద్‌లోని ప్రైమ్ లొకేషన్లలో ఉన్నాయి. ఇవి భారీ డిమాండ్ ఉన్న ఆస్తులు. అయినా కూడా గతంలో నిర్వహించిన వేలంలో ఎవ్వరూ పాల్గొనకపోవడం గమనార్హం. బుట్టా రేణుక 2014లో కర్నూలు వైసీపీ ఎంపీగా పోటీచేసి గెలిచారు. 2019 ఎన్నికల్లో ఆమెకు టికెట్ దక్కలేదు. 2024 ఎన్నికల్లో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్తగా కొనసాగుతున్నారు. ఆస్తుల వేలంపై రేణుక వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా, ఆమె అందుబాటులోకి రాలేదు.


మాజీ సీఎం జగన్‌తో మాజీ ఎంపీ బుట్టా రేణుక దంపతులు (ఫైల్)

విశాఖ స్టీల్ ప్లాంటు
డైరెక్టర్ రాజీనామా?

- ఇటీవలే బాధ్యతలు స్వీకారం
- ఏకపక్ష నిర్ణయాలను అమలు చేయలేకే?

విశాఖపట్నం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో డైరెక్టర్ ఒకరు తన పదవికి రాజీనామా చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఆయన వేరే కేంద్ర ప్రభుత్వ సంస్థ నుంచి ఇక్కడికి వచ్చారు. విధుల్లో భాగంగా పలు వ్యవహారాలను పరిశీలించినప్పుడు నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడి యాజమాన్యం కొన్ని ఏకపక్ష నిర్ణయాలను అమలు చేస్తున్నట్టు గుర్తించారు. ఈ విషయాన్ని సంస్థలో ముఖ్య అధికారి దృష్టికి తీసుకువెళ్లగా, పూర్తిస్థాయి సీఎండీ వచ్చాక అన్ని నిర్ణయాలు తీసుకుంటారని, అంతవరకు యథావిధిగా నడిపించాలని సూచించినట్టు సమాచారం. మరో మూడు నెలల వరకూ కొత్త సీఎండీ వచ్చే అవకాశం లేదని, భవిష్యత్తులో ఉద్యోగ సంఘాలకు అనుకూలంగా కోర్టు ఏ తీర్పు ఇచ్చినా దాని పర్యవసానాలు అనుభవించాల్సి ఉంటుందని ఆలోచించిన ఆ డైరెక్టర్.. తన రాజీనామాను ఉన్నతాధికారులకు పంపినట్టు తెలిసింది. ఆ ఫైల్ విజిలెన్స్ విభాగం విచారణకు కూడా వెళ్లినట్టు ప్లాంటులో ప్రచారం జరుగుతోంది. ఆర్ఐఎన్ఎల్ వెబ్‌సైట్‌లో అందరి డైరెక్టర్ల ఫొటోలు, పేర్లు ఉండగా, ఆ ఒక్క డైరెక్టర్ వివరాలు లేకపోవడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. అయితే ప్లాంటు అధికార వర్గాలు అలాంటిదేమీ లేదని చెబుతున్నాయి.

ఏపీలోనూ కాంగ్రెస్ జెండా ఎగరాలి

- గాంధీల కుటుంబంపై బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి
- 2 రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతుల్లో టీ-సీఎం రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్ష పదవి అధికారం కాదని, అదొక బాధ్యతని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ బలోపేతమై అక్కడ కూడా జెండా ఎగరాలని ఆకాంక్షించారు. తెలంగాణలోని వికారాబాద్ జిల్లా అనంతగిరిలో జరుగుతున్న రెండు తెలుగు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షుల శిక్షణా తరగతుల కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడారు. పైరవీలకు దూరంగా ఉన్నప్పుడే నాయకులకు గౌరవం పెరుగుతుందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా పని చేయాలని సూచించారు. డీసీసీ అధ్యక్షులుగా బాగా పని చేసిన వారికి తమ రాష్ట్రంలో ఎమ్మెల్యేలుగా అవకాశం ఇచ్చామని గుర్తు చేశారు. డీసీసీ అధ్యక్ష పదవిని దుర్వినియోగం చేసి, పార్టీ విశ్వాసాన్ని దెబ్బతీయొద్దు అని నేతలను హెచ్చరించారు. డీసీసీ నుంచి పీసీసీ అధ్యక్షులు కావచ్చని, ఎమ్మెల్యే, ఎంపీ, ముఖ్యమంత్రి కూడా కావొచ్చన్నారు. వైఎస్ షర్మిల తన తండ్రి వారసత్వంగా పదవులు పొందే అవకాశం ఉన్నా 3,000 కిలోమీటర్లు పాదయాత్ర చేసి నిరూపించుకున్న తర్వాత పీసీసీ అధ్యక్షురాలిగా ఏపీలో కాంగ్రెస్ పార్టీ కోసం నిబద్ధతతో శ్రమిస్తున్నారని ప్రశంసించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన ఇందిరాగాంధీ కుటుంబంపై బీజేపీ కుట్రలు చేస్తోందని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ తెచ్చిన స్వాతంత్ర్యాన్ని, కాంగ్రెస్ ఇచ్చిన రాజ్యాంగాన్ని ఉపయోగించుకొని పుట్టిన పార్టీలు ఇప్పుడు కాంగ్రెస్ ముక్త భారత్ అని మాట్లాడటం అత్యంత విచారకరమన్నారు. కేవలం రాజకీయంగా గాంధీ కుటుంబాన్ని అడ్డు తొలగించుకోవడానికే బీజేపీ కుట్రలు చేస్తూ, అక్రమ కేసులు పెడుతోందన్నారు. దళితులు, మైనార్టీలు, పేదల గొంతు నొక్కడానికి జరుగుతున్న ప్రయత్నాలను కాంగ్రెస్ కార్యకర్తలే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. పది రోజుల పాటు జరిగే ప్రత్యేక శిక్షణా శిబిరం మొదటి రోజు కార్యక్రమంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుల శిక్షణ శిబిరంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల, తదితరులు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.